ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక



4 అణా

1-6-5

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



అరటి ఆకుల అందం

—ఫొటో: వి. కుటుంబరావు, మద్రాసు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 46
సంచిక 39
1-6-55

మన్మథ జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి బుధవారం



*ఆకులో ఆకునై, రేకులో రేకునై

ఫొటో వి. [illegible] విజయవాడ

జపాను దేశంలో పిల్లల పత్రికలు

విశాలంగా ఆసియా దేశాల పిల్లల దృష్టిలో చూస్తే జపాను దేశపు పిల్లలు చాలా అదృష్టవంతులే అని చెప్పాలి. చదువుకోడానికి జపాను పిల్లలకున్న పుస్తకాలలో మనకు పదోవంతైనా లేవు. జపాను పిల్లలకోసం ప్రచురించే ప్రత్యేక పత్రికలను చూస్తే కళ్లు మిరుమిట్లు గొలుపుతాయి. రంగురంగులతో, అందమైన బొమ్మలతో, దేశదేశాల కథలతో నిండియున్న బాల పత్రికలను చూస్తుంటే జపానులోనే ఉండిపోవాలనిపిస్తుంది.

దేశంలో పత్రికల సంఖ్యలో పదోభాగానికి పైగా పిల్లల పత్రికలే ఆక్రమించేయి. పిల్లలు నోచుకున్న ఈ అదృష్టం అమెరికా, జపాను దేశాలకు తప్ప మరే దేశానికీ కలుగలేదు. యుద్ధానంతరం పిల్లలకోసం పత్రికలు, పుస్తకాలు విశేషంగా ప్రచురిస్తూ వచ్చేరు. అంతేకాక పెద్దపెద్ద రచయితలు కూడ పిల్లలకోసం కథలు వ్రాయడం మొదలు పెట్టేరు. మొదట్లో ఈ పెద్ద రచయితలు పిల్లలకోసం కథలు వ్రాయడం చాలా చిన్నతనముగా భావించేరు. కాని ఆర్థిక పరిస్థితుల ఒత్తిడిచేత పిల్లలకు కూడ కథలు వ్రాసి డబ్బు సంపాదించడం ప్రతి రచయితకు మామూలైపోయింది.

ఈ పెద్ద రచయితల ప్రవేశంతో పిల్లల కథా సాహిత్యంలో నూతన శకం ప్రారంభమయింది. విదేశసాహిత్యాలలో ప్రవేశమున్న రచయితలంతా అనువాదాలతోను, అనుకరణలతోను పిల్లల పత్రికలను నింపేశారు. ముఖ్యంగా ఆంగ్లసాహిత్యం, ఫ్రాన్సు, జర్మనీల సాహిత్యాలలో పిల్లల అభిరుచులకు సరిపడే పుస్తకాలనేకం అనువాదం చేసేశారు. ఈ అనువాదసాహిత్యంలో సీరియల్ కథలకంటె చిన్న కథలపైనే పిల్లలకభిమానమున్నట్టు కనిపిస్తుంది. పేరుకు పిల్లలపత్రికలైనా ఈ పత్రికలను చదవడంలో పెద్దవాళ్ళెంతమాత్రమూ తీసిపోలేదు.

దారా నేస్తలింగం (ఒసాకా)

దేశం మొత్తంమీద ఒక్కటే భాష అవడం వల్లనూ, 8 కోట్ల జనాభాలో నూటికి 96 కి పైగా అక్షరాస్యత ఉండడంచేతనూ, పిల్లల పత్రికలలో కూడ మన తెలుగుదేశంలోకన్న పాఠకుల సంఖ్య ఎన్నో రెట్లు ఎక్కువ.

పాఠకుల సంఖ్య ఎక్కువ కావడంచేతనూ, అభిరుచులలో చాలా భేదాలుండడంచేతనూ, పత్రికల సంఖ్య నానాటికీ పెరిగిపోయింది. పత్రికల సంఖ్య పెరుగుదలతో పాటు, పిల్లల పత్రికల సంఖ్య కూడ ఎక్కువయింది. ముఖ్యంగా పిల్లలలో చిత్రలేఖనంపై అభిరుచి ఎక్కువగా కనబడుతుంది.

పెద్ద రచయితలు పిల్లల పత్రికలకు కథలు వ్రాస్తున్నట్టుగానే, విఖ్యాతిగన్న కళాకారులు కూడ పిల్లల పత్రికలకు బొమ్మలు వ్రాయడం మొదలుపెట్టేరు. జపానుదేశపు చిత్రలేఖనంపై ఫ్రాన్సుదేశపు ప్రభావం బాగా కనబడుతుంది. అందుచే పిల్లల బొమ్మలపైకూడా ఫ్రెంచి చిత్రకళా ప్రభావం విశేషంగా ఉన్నది. పిల్లలకు కూడ ఫ్రెంచి చిత్రలేఖనంపై అభిమానం ఎక్కువ.

మన దేశంలోలాగ కాక జపానుదేశంలో ఆడపిల్లలకు, మగపిల్లలకు వేర్వేరు పత్రికలు ప్రచురిస్తారు. మగపిల్లల పత్రికలలో వీరోచిత కథలు, పారిశ్రామిక విషయాలు, వైజ్ఞానికశాస్త్రవిషయాలు, ఎక్కువగా కనబడతాయి. ఆడపిల్లల పత్రికలలో అల్లికలు, బొమ్మలు వ్రాయడం, కుట్టుపని, సంబంధించిన విషయాలు, నీతికథలు గృహవిషయాలు, మొదలైనవి కనబడతాయి.

ఆడపిల్లలకు, మగపిల్లలకు, జీవితాదర్శాలు, జీవనోపాధి, అభిరుచులు వేర్వేరు. అందుచే వారి భావిజీవితానికి పునాదివేస్తూ పత్రికలను, వారి సలహాదార్లుగా ప్రచురించాలని ప్రజల నమ్మకం. కాని దరిమిలా ఆడపిల్లలుకూడ, మగపిల్లల పుస్తకాలకోసమే, ప్రాకులాడడం మొదలుపెట్టేరు. అందుచే ఆడపిల్లల ప్రత్యేక పత్రికలకు, ప్రోత్సాహమంతగా లభించలేదు. కాని క్రమేపి ఆడపిల్లలు తమ బాధ్యత గుర్తిస్తే ఈ పత్రికలకు మరల యథాప్రకారం గౌరవం లభించవచ్చు. పిల్లల పత్రికలకు తోడుగా 'సప్లిమెంటు' కూడ జతపరుస్తారు. ఈ 'సప్లిమెంటు'లో సాధారణంగా కార్టూను బొమ్మలు కాని, పజిల్ ట్రిక్కులు కాని, కాగితంతోనో, అట్టతోనో చేయబడ్డ బొమ్మలుగాని ఉంటాయి. పత్రికలమీదకన్న ఈ 'సప్లిమెంటు'మీదనే పిల్లలకు ప్రేమ ఎక్కువయింది. 'సప్లిమెంటు' మంచిదయితే పత్రిక చెల్లుబడి బాగుంటుంది. ఖరీదైన బొమ్మలు కొనుక్కోలేని పిల్లలకు, వినోదాలకు నోచుకోని బీదపిల్లలకు, కడుపు నింపుకోలేని అనాథబాలురకు, ఈ 'సప్లిమెంట్లే' ఆట, వినోదం కాలక్షేపం అన్నీ కలిగిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే సప్లిమెంటును ఆధారం చేసుకొనే పిల్లల పత్రికలు డబ్బు చేసుకుంటున్నాయి.

బాగా ప్రచారంలో ఉన్న పిల్లల పత్రికలు అధమం ఇరవైఅయినా కనబడతాయి. మామూలు పత్రికలు సెలకు 5000 కాపీలు, అమ్ముడుపోతే ప్రజాదరణ ఎక్కువగా ఉన్న పత్రికలు నెలకు 2 లక్షలు అమ్ముడుపోతాయి. అయితే మొత్తంమీద అన్నీ రంగు రంగులతో ప్రచురిస్తారు.

ఈ పిల్లల పత్రికలలో కూడ వివిధవర్గాలున్నాయి. ప్రాథమికపాఠశాలల పిల్లలు చదివే పత్రికలు, మాధ్యమిక పాఠశాల పిల్లలు చదివే పత్రికలు వేర్వేరు. అంతేకాక తరగతి, తరగతి పిల్లలకు ప్రత్యేక పత్రికలు. పిల్లల కథలు అందమైన బొమ్మలతో పుస్తకాలుగా చేసి ప్రచురిస్తారు. ఈరకం పుస్తకాలు కూడపెట్టడం సాధారణంగా ప్రతి పిల్లడికి సరదా. వీటిలో కూడ విశేషంగా అనువాదసాహిత్యం కనబడుతుంది.

విషయానుక్రమణిక

పుస్తకాల ఖరీదు సాధారణంగా 6 అణాల నుండి 8 అణాలవరకు ఉంటుంది.

సాధారణంగా పిల్లల పత్రికలు 10 అణాల నుండి 1-4-0 వరకు ఉంటాయి. మన దేశ దృష్టిలో చూస్తే యివి చాలా ఖరీదైనవిగా కనబడవచ్చు. కాని జపానుదేశపు జీవిత ప్రమాణపు విలువ (*Gost of Living*) మన దేశానికి 4 రెట్లైనా ఉంటుంది. అందుచే ఈ పత్రికలు ఖరీదైనవనడానికి వీలులేదు. బాలపత్రికలలో కూడా వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు ఉన్నాయి. కాని మాసపత్రికలకే ప్రజాదరణ ఎక్కువ.

పిల్లల పత్రికలను ఎక్కువగా కొనేది గ్రంథాలయాలే. ఈ గ్రంథాలయాలు మన దేశంలో వలె, ప్రజాగ్రంథాలయాలు, ప్రభుత్వగ్రంథాలయాలు, పురపాలకగ్రంథాలయాలు, పాఠశాల గ్రంథాలయాలై యుంటవి.

సాధారణంగా ప్రతిగ్రంథాలయాలలోను పిల్లలకోసం గదులు ప్రత్యేకిస్తారు. ఈ గదులలో దేశదేశాలనుండి సేకరించిన పిల్లల పుస్తకాలను ఉంచుతారు. బీద, గొప్ప భేదం లేకుండా పిల్లలంతా ఈ గ్రంథాలయాల చుట్టూ గుమికూడతారు.

మాధ్యమిక పాఠశాలాంతము వరకు, పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యావిధానం ఎన్నో సంవత్సరాల క్రితమే ప్రవేశపెట్టేరు. ప్రాథమిక పాఠశాలలో ప్రవేశించే పిల్లల విషయంలో ప్రభుత్వం యింకా శ్రద్ధ తీసుకుంటోంది. ఈ సంవత్సరం దేశం మొత్తం మీద 26 లక్షలమంది పిల్లలు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశిస్తారని అంచనా వేయబడింది.

ఈ పిల్లల పుస్తకాలకుగాను, ప్రభుత్వం సుమారు 80 లక్షల రూపాయలను కేటాయించింది. ఈ డబ్బుతో పిల్లలకు పాఠ్యభాగ పుస్తకాలను ఉచితంగా పంచి పెడతారు.

విజ్ఞానాభివృద్ధికి తోడ్పడే దేశవిషయాలు, విదేశవిషయాలు సేకరించి మన దేశంలో ప్రచురించే 'హిందూస్థాన్ ఇయర్ బుక్' లాంటి పుస్తకాలెన్నో జపానుదేశంలో పిల్లలకోసం ప్రచురిస్తారు. పారిశ్రామిక సంపత్తిలోను, వ్యాపారసంపత్తిలోను, వైజ్ఞానిక, కళావిషయాలలోను వివిధ దేశాల పరిస్థితి, వాటితో సరిపోలుస్తూ జపానుదేశ స్థానాన్ని నిర్ణయిస్తూ ప్రచురిస్తారు. ఈ విధంగా తమదేశ నిజపరిస్థితి జపానుపిల్లలకు కళ్ళకుకట్టిన ట్లుంటుంది. తమదేశం ఏ చిన్న విషయంలో వెనుకబడ్డదన్నా పిల్లలకు పౌరుషం కలుగుతుంది. అందుచే జపాను దేశపుపిల్లలకు చిన్నతనంనుండి విదేశాలను తలదన్నిపోవాలనే భావాలు, ఆశయాలు కలుగుతాయి.

భావిజీవితంలో దేశపురోగమనానికి బాధ్యులైన ఈ చిన్న పిల్లలలో విజ్ఞానం, సాహసం, పట్టుదల ప్రవేశపెట్టడంలో పిల్లల పత్రికలు తమబాధ్యతను పూర్తిగా నిర్వహిస్తాయి. అందుచే ఈ విషయంలో జపాను దేశం ఆసియా దేశాలన్నిటికి మార్గదర్శకమయిందంటే విశేషం లేదు. ★

రచయితలకు మనవి

ఇటీవల కొందరు రచయితలు ఇదివరలో అచ్చయిన తమ రచనలను క్రొత్త రచనలన్నట్లు ఇప్పుడు తిరిగి మాకు పంపడం, కొందరు ఇతరుల రచనలను అన్యభాషలలోనుంచీ, తెలుగులోనుంచీ సంగ్రహించి స్వతంత్ర రచనలుగా పంపడం జరుగుతున్నది. వీరు సోదర రచయితలకు, మాకు జరుగుతున్న అపచారాన్ని గుర్తించడంలేదు. మాకు వచ్చే రచనలను, అనుమానంతో పరిశీలించడం రచయితలకుగాని మాకుగాని గౌరవప్రదం కాదని గుర్తించవలసిందిగా వీరిని ప్రార్థిస్తున్నాము. ఇందువల్ల చిక్కులకు లోనుకావచ్చునని ఇట్టివారు గ్రహించడంమేలు. ఇదివరలో మా పత్రికలోగాని, ఇతర పత్రికలలోగాని ప్రచురించబడిన 'వేలాది రచనలను చదివి జ్ఞప్తిలో ఉంచుకోడం ఏ సంపాదకునికైనా అసాధ్యమైన విషయమని ప్రత్యేకం చెప్పనవసరంలేదు.

అన్యథా సూచించినప్పుడు తప్ప, మాకు వచ్చే రచనలు మొదలైనవి, పంపినవారి స్వతంత్ర రచనలేననే, భావంతోనే మేము ప్రచురించడం జరుగుతుందని అందరూ గుర్తించ ప్రార్థన.

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలనుకూడా గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్‌పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.

సీరియల్

ఉదయ కిరణాలు

పోతుకూచి సాంబశివరావు

2

కోటిపల్లిలో శివాలయానికి దక్షిణ భాగాన నరసింహం కుటుంబంతో నివసిస్తున్న అద్దె యిల్లు వుంది. ఆలయానికి ఎదురుగా ఉన్న సోమగుండంనుంచి వీచే రేటిగాలులు ఆ పరిసర ప్రాంతాన్నంతా సమశీతలంగా వుంచుతుంది. నరసింహం వుంటున్న పెంకుటిల్లుకు ఒకప్రక్క నూనె వర్తకుని గానుగ మరొకవైపున కంసాలివాని సుత్తెకోట్లు, కిర్రుకిర్రు, టక్కుటక్కు శబ్దాలతో అచ్చట ప్రశాంతతమాత్రం పాడు చేస్తుంటాయి. ఆ యింటికి నాల్గుగజాల దూరంలో ఎన్నో శూద్రులకొంపలు చేపల బజారు ఆదారిలో దుర్వాసనలు వ్యాపింపజేస్తున్నాయి.

అసలు నరసింహం ఆయిల్లు అద్దెకు తీసుకున్నప్పుడు మాణిక్యం గాభరాపడింది. ఇంటికి ఇరుప్రక్కలా నూనెగానుగ కంసాలి సుత్తి చేసేధ్వనులు అపశకునంగా జీవిత గ్రహాలకు దుర్గతులు తెచ్చిపెడతాయని భయపడింది. అనుకున్నట్లే కోటిపల్లి వచ్చాక ఆ కుటుంబానికి అనేకవిధమైన యిక్కట్లు రాసాగాయి.

సోమయాజులు పదిగంటలయ్యేటప్పటికి నరసింహంయింటికిచేరుకున్నాడు. వీబూది పెండికట్లు, తెల్ల ఖద్దరుపంచ, ఖద్దరుచొక్కా, పువ్వుల అంచు ఖద్దరు కండువా - యీ దుస్తులలో అతడు పెద్దతరహాగా కనిపించేడు.

నరసింహం ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలోంచి చూశాడు సోమయాజులు. జనం అలికిడి ఏమీ ఉన్నట్లు కనిపించలేదు లోపల. వసారాలో చిందర వందరగా దుప్పటి, తలగడాలు మంచం మీద పడిఉన్నాయి. చిలక కొయ్యకు నరసింహం కోటు వేలాడుతోంది. గృహంలో కలకలపోయి పీడకళ ప్రవేశించింది.

తలుపులు తట్టాడు సోమయాజులు. లోపలినుంచి సమాధానం రాలేదు. మళ్ళీ రెండుసార్లు 'మాణిక్యం' అంటూ గట్టిగా పిలిచాడు సోమయాజులు - ప్రక్కగది లోంచి గాజులచప్పుడు వినిపించింది.

తలుపు కొడుతూంటే మాణిక్యం కంగారు పడింది. నరసింహం వెళ్లిపోయాక, అప్పులవాళ్లు చుట్టు ముట్టసాగారు. పాలవాడు, పెరుగువాడు, చాకలి, మంగలి, దుకాణదారు, అందరూ నరసింహం యింటి మీద పడ్డారు. అస్తమానూ ఎవరో ఒకరు వచ్చి తలుపుకొట్టి డబ్బు ఎప్పుడిస్తారని అడిగి వెళ్లిపోడం పరిపాటయిపోయింది. 'తన బంధువులు ఎవరో ఒకరు వస్తారు. త్వరలో బాకీలు చెల్లిస్తా'నని బతిమాలి చెబుతోంది మాణిక్యం. మొదటిసారి తలుపు చప్పుడువిని అటువంటి అప్పులవాడే ఎవడో వీధిలో నిలుచున్నాడనుకొంది ఆమె. కాని తర్వాతసోమయాజులు కంఠధ్వని వినగానే మాణిక్యంకు పోయిన ప్రాణాలు తిరిగి వచ్చి నంతధైర్యం కలిగింది. గబగబ వచ్చి తలుపులు తీసింది.

మాసిన చీరతో, కేశసంస్కారం లేక, చెరిగిన తిలకంతో వివర్ణ వదనంతో ధా[illegible]రగా కురుస్తున్న కన్నీటివల్ల గండ్లుపడిన చెక్కిళ్లతో, శోకదేవతలా మూర్తీభవించే మాణిక్యాన్ని చూడగానే సోమయాజులు హృదయం కరిగిపోయింది. దేవుడులా ఆ పత్సమయంలో దర్శనమిచ్చిన సోమయాజులు గారిని చూడగానే మాణిక్యానికి పట్టిదుఃఖం వచ్చింది గతించిన సంగతులు స్మృతిపథంలో మెదిలి. వెక్కి వెక్కి ఏడుస్తూ కొంగుముఖానికి చాటు పెట్టుకుని ఒక వారగా నిలబడింది మాణిక్యం.

'ఫరవాలేదమ్మ విచారించకు త్వరలో తిరిగి వచ్చేస్తాడులే. నిన్ను విడిచి ఎలా వెళ్లగలడు?' అంటూ సోమయాజులు ఓదార్చాడు! ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ. బట్టల సంచీ మంచం మీద పడేశాడు.

ఎగదిగ శ్వాసలతో, ఉబికివచ్చే దుఃఖంలో, ఉక్కిరిబిక్కిరయి, ఒక పది నిమిషాలు దాటాక మాణిక్యం, లోలోపలి బాధను లోలోపలే అణగ ద్రొక్కుకుంది.

'పిల్లలేరి?' అంటూ ఇల్లంతా కలయ చూశాడు సోమయాజులు. ఏకాంతంగా మాణిక్యం ఒకర్తే ఉండడం వల్ల, చిన్నబోయినట్లుయింది యిల్లంతా.

'బడికి వెళ్ళారు' అని ఆగింది మాణిక్యం తర్వాత ప్రశ్నలకు బావవైపు చూస్తూ.

'బాగుంది...ఇంతకీ ఎందుకు లేచిపోయాడమ్మా?'

'పెద్దపిల్ల పెళ్ళికి ఆరువేలు అప్పు తెచ్చారుగా బ్యాంకిలో భూమి తాకట్టు పెట్టి! అప్పు బాగా పెరిగిపోయింది. ఏదో రెండెకరాల భూమి అమ్మేసి అప్పు తీర్చమని నేనూ చాలాకాలంనుంచి గొడవపెడుతునే వున్నాను. నామాట వినలేదు. పైగా పేకాటలకు కూడా డబ్బు చాలక బ్యాంకినుంచి అప్పు తెచ్చారట! వడ్డీ, అసలు. ఈ ఆరేండ్లనుంచి పెరిగిపోవడంవల్ల, బ్యాంకువాళ్లు అప్పు తీర్చమని నోటీసు యిచ్చారు. ఈయన ఎక్కడైనా డబ్బు తెచ్చి తీరుద్దామని కాలయాపన చేశారు. తర్వాత ఆ బ్యాంకు సెక్రటరీకి ఈయనకు ఏవో ఘర్షణలు వచ్చాయట! మొత్తంమీద మోసంచేసి భూమి అంతా వ్రాయించుకున్నారట! అయిదెకరాల భూమి పోయినందుకు రెండు రోజులా సరిగా అన్నం తినలేదు. ఆతర్వాత ఏవో పేచీలు వచ్చాయట బ్యాంకులో! ఆరు నెలలు ఉద్యోగం తీసేశారుట."

"ఒకరోజు మధ్యాహ్నం భోంచేసి, పంచ లాక్కొ తొడుక్కుని బయటికి వెళ్లారు. అంతే మళ్లీ రాలేదు. ఆయన యింటికి రాలేదని కంగారుతో బంట్రోతు సత్తెన్నకు కబురు పంపాను. అతను వచ్చి తనకు తెలిసిన విషయాలన్నీ చెప్పి, ఆయన జాగాలో ఒక క్రొత్త గుమాస్తాగారు వచ్చేరని తెలిపాడు. ఇవన్నీ చూసి కంగారుపడి మీకు ఉత్తరం వ్రాశాను." అని ఒక నిట్టూర్పు విడిచింది మాణిక్యమ్మ.

'అయిదెకరాల భూమి బ్యాంకివాళ్లు జప్తుచేసుకోడానికి అంత అప్పు ఎలా పెరిగిందో నా కర్థంకాదు. రెండెకరాలు, లేకపోయినా మూడెకరాలు భూమి అమ్మేస్తే అప్పు తీరిపోతుంది. కోటిపల్లి వచ్చాక సరిగా జీతమైనా నేను కళ్ళచూడలేదు. ఇంట్లో ఎప్పుడూ ఇబ్బందే! ఇంట్లో ఏం తెమ్మన్నా ఆయన చికాకు పడేవారు. ఏదో విధంగా గుట్టుంగా కాలక్షేపం చేసేదాన్ని." అని బాధతో ముఖం దించుకుంది మాణిక్యం.

'ఎవరో అన్నారు. ఇక్కడకు వచ్చాక ఆయనకు పేకాటలాడే స్నేహితులు బాగా పోగయ్యారుట! పైగా త్రాగుడుకూడా అలవాటు చేసుకున్నారుట!' అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది ఆమె.

'నలభైరూపాయిలు తెచ్చుకునే సామాన్య గుమస్తా త్రాగుడు, పేకాటలు, అలవాటు చేసుకుంటే సంసారాలు మట్టి కొట్టుకు పోవూ?' సోమయాజులు ముఖం చిట్లించి క్రుద్ధుడైయాడు.

'ఆమధ్య అవధాని అన్నయ్య వచ్చాడుగా! పిల్లల చిరిగిపోయినబట్టలు, నా మాసిన చీరలు, చూసి బాధపడి అందరికీ బట్టలు కొన్నాడు. అవధాని అన్నయ్య వచ్చిన రోజునే బియ్యం పుల్లలు తేడానికి ఆయన బయటికి వెళ్ళారు. అన్నయ్య అదిచూసి ఆశ్చర్యపోయాడు. "ఇంట్లో ఎప్పుడూ యింతేనా" అని నన్నడిగాడు. తర్వాత ఆయన్ను కూకలేసి, అప్పులు తీర్చుకుని జాగ్రత్తపడమన్నాడు. అప్పటినుంచీ అన్నయ్య నెలనెల పదిహేనురూపాయిలు కూడా పంపిస్తున్నాడు'

'అలా సహాయంచేసినా అప్పులు తీర్చలేదన్నమాట!'

'అసలు ఎన్ని అప్పులున్నాయో, ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియదు'

'బాగుంది...' అంటూ సోమయాజులు ఒక నిట్టూర్పు విడిచాడు.

'లే, బావా! కాళ్లు కడుక్కుందువుగాని నీళ్ళయినా యివ్వడం మర్చిపోయాను!' అంటూ లేచి ఇంట్లోకి వెళ్ళింది మాణిక్యం.

ముందు కర్తవ్య మేమిటా అని ఆలోచనలో పడ్డాడు సోమయాజులు.

సోమయాజులు మాణిక్యం తెచ్చిన నీళ్ళతో, పాద ముఖ ప్రక్షాళనం చేసుకుని ప్రయాణపు బడలికతో మంచంమీదకు ఒరిగాడు.

మాణిక్యం వంటింట్లోకి వెళ్లింది భోజన కార్యక్రమాలు చెయ్యడానికి.

పన్నెండుగంటలు కాగానే పుస్తకాలు పుచ్చుకుని ఏడేళ్ళ శాంత, తొమ్మిదేండ్ల సాంబు, బడినుంచి వచ్చారు. రాగానే ఇంట్లో మంచంమీద పడుకున్న మధ్య వయసు పెద్దమనిషిని చూసి తండ్రి వచ్చాడనుకుని సాంబు బంతిలా ఒక్క గెంతు గెంతాడు 'నాన్నా! నాన్నా!!' అంటూ.

సాంబు కేకతో మగత నిద్రలో ఉన్న సోమయాజులు ముఖం నులుపుకుంటూ లేచి కూర్చున్నాడు.

'నాన్న కాదూ! పెదనాన్న!!' అంటూ దిగాలుగా ఉత్సాహమంతా జారిపోయి, దీనంగా వెనకడుగు వేశాడు సాంబు.

'రా, బాబూ' అంటూ సోమయాజులు సాంబూను దగ్గరకు చేర్చాడు. సాంబు ఒకటి రెండుసార్లు అంతకుముందు సోమయాజులను చూడడంవల్ల, యిట్టే గుర్తుపట్టాడు.

సాంబును దగ్గరకు చేరుస్తున్న సోమయాజులు తన్ను పిల్వలేదేమని బెదురుతూ శాంత దూరంగా నడయాడుతోంది. సోమయాజులు శాంతనుకూడా పిలిచాడు. ఇద్దర్నీ చెరొక చేత్తో ఆలింగనము చేసుకున్నాడు అభిమానంతో.

'బడినుంచి వస్తున్నారా?'

'ఊఁ' అంది శాంత.

'బాగా చదువుకుంటున్నారా!'

'ఆఁ' అన్నాడు సాంబు.

'ఏం చదువుతున్నారు?'

'నేను నాల్గోక్లాసు చదువుతున్నా. అన్నయ్య ఆరవక్లాసు చదువుతున్నాడు' అంటూ ముద్దబంతుల్లా మాటలు విసురుతూ అన్నది శాంత.

జ్ఞానమొచ్చిన సాంబు, బావను తండ్రిగా భావించి పరాకుగా అతనివైపు గెంతడం మాణిక్యం చూసింది. తండ్రికొడుకుల అల్లరి, వాత్సల్య సంభాషణలు మొదలైన మునుపటి సంగతులెన్నో ఆమె మనస్సులో మెదిలాయి. సాంబు అల్లరిలో ఆరితేరినవాడు. ఇంట్లో ముక్కలువిరిచి, పీటలు విరగకొట్టి, బట్టలు పాడుచేసుకుని, తోటి కుర్రాళ్లతో ఏదో కయ్యం పెట్టుకుని, వాళ్ళను కొట్టి తిట్టి ఇంటికి రావడం అలవాటు. ఒక్కొక్కసారి తండ్రి కూకలేసి 'వెధవా! ఇటువంటి పనులు చేస్తే చెవడాలు ఎక్క తీస్తాను' అని రౌద్రంతో కొట్టడానికి చెయ్యి ఎత్తేటప్పటికి అప్పటిదాకా బెదురుముఖం పెట్టి, మారాత్తుగా తండ్రిముఖంచూసి ఫక్కున కిలకిల నవ్వేవాడు సాంబు! అంతటితో నరసింహం ముఖంలో రౌద్రం మాయమయి ఆయన కూడా ఫక్కున నవ్వేవాడు. సాంబును చేరదీసి 'అల్లరిచెయ్యకూడదురా బాబు' అంటూ ముద్దుపెట్టుకునేవాడు నరసింహం. 'నేనసలు అల్లరి ఎరగను నాన్నా. అంతా వాళ్లే నేర్పుతున్నారు' అంటూ చమత్కారంగా స్నేహితులపై చాడీలు చెప్పేవాడు. కొడుకు తమాషాలుచూసి నవ్వుకుంటూ వెళ్లిపోయేవాడు నరసింహం. ఆయనలేకపోతే వీళ్ళ ముందుగతి ఏమిటి? నిరాధారులైనపక్షులైపోతారు. ప్రకాశం ఏంచేస్తున్నాడో! ఎల్లా చదువుతున్నాడో! తండ్రి లేచిపోయినట్లు తెలిసి ఏం తల్లడిల్లుతున్నాడో' బెంగతో అనుకుంటూ మాణిక్యం ఒక్కసారి బలబలా కన్నీళ్లు కురిపించింది.

వంట పూర్తిచేసి పిల్లలను, సోమయాజులను భోజనానికి పిలిచింది మాణిక్యం.

సోమయాజులు విస్తరిముందు కూర్చున్నాడు. ఏవేవో ఆలోచనలు మెదడులో దొర్లాయి. పెళ్ళి అయినప్పుడు మాణిక్యం చాలా అదృష్టవంతురాలనుకున్నారు అంతా. అయిదెకరాల మాగాణి భూమి, ఒక పెంకుటిల్లు, కలిగిన ఆస్తితో, బాదరబందీ ఏమీలేక, అందమైన నరసింహం మాణిక్యాన్ని పెళ్లి చేసుకుంటానంటూ, పట్టుపట్టడం, తర్వాత వారి వివాహం జరగడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. నరసింహం తల్లికి మాణిక్యాన్ని చేసుకోడం యిష్టంలేదు. కారణం ఎక్కువ కట్నం లభించదనే! కొడుకుకు ముంచి కట్నాలిచ్చే సంబంధాలు వస్తూంటే మాణిక్యంమీద మోజు చూపించిన నరసింహమంటే భగ్గుమని మండిపోయి, పెళ్ళయినాక అయిదేండ్లు కొడుకును వదిలేసి ఒంటరి కాపురం పెట్టుకుంది అతని తల్లి. అసలు నరసింహం, అవధానితో కలిగిన స్నేహం వల్లే, అతని చెల్లెలును పెళ్ళిచేసుకోవాలనే కుతూహలం కలిగింది. అంతే! మాణిక్యాన్ని పెళ్ళిచేసుకున్నాడు. నరసింహం వంటి ఉత్తమ వరుడు, ఏ శ్రమ కూడా లేకుండా లభ్యమయినందుకు మాణిక్యాన్ని ఎందరో అభినందించారు. పెద్దలు చాలా సంతోషించారు. తోటి పెళ్ళి కూతుళ్లు కొంత అసూయపడ్డారు. పెళ్లి తర్వాత కూడా మాణిక్యం, నరసింహంల, అనురాగ దాంపత్యం అందరికీ ఆదర్శప్రాయమైనదని అనుకున్నారంతా.

'కాకినాడలో అంతా కులాసా? ప్రకాశం బాగా చదువుకుంటున్నాడా?' అన్న మాణిక్యం ప్రశ్నకు ఆలోచనల నుంచి తేరుకున్నాడు సోమయాజులు.

'ఆఁ' అన్నాడు గొంతుకకు అడ్డుపడిన అన్నం ముద్ద మంచినీళ్లు త్రాగి జార్చుకుంటూ. 'మరి ముందుసంగతి ఏమిటి?' అన్నాడు సోమయాజులు మాణిక్యం ఉద్దేశం తెలుసుకుందామని. 'ఏముంది?' ఏం చెప్పాలో అర్థం కాలేదు మాణిక్యానికి. మాకు శక్తివంచనలేకుండా అందరికీ ఉత్తరాలు వ్రాసి నరసింహం జాడ కనుక్కుంటాం. తర్వాత విధి ఎలా ఉందో అలా జరుగుతుంది!' అంటూ నిట్టూర్చాడు సోమయాజులు.

'రాధమ్మ నీకు ఒక ఏభయి రూపాయిలు ఖర్చుకు ఉంచుకోమని పంపింది. వీలైతే పిల్లలను తీసుకుని కాకినాడ వచ్చేయమంది. నరసింహం వచ్చేదాకా అక్కడే ఉండవచ్చని ఆమె అభిప్రాయం.'

'అవధాని అన్నయ్యకు ఒక ఉత్తరం వ్రాస్తే' తన కుటుంబాన్ని మొదటినుంచి ఎక్కువ మక్కువతో, శ్రద్ధాసక్తులతో చూస్తున్న అవధాని యీ ఆపత్సమయంలో పూర్తిగాఆదుకోగలడని మాణిక్యంనమ్మింది.

'ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను' అని సోమయాజులు యింకా ఏదో చెప్పబోయాడు. ఇంతలోనే మాణిక్యం అందుకుంది.

'ఊళ్ళో ఎంతోమంది అప్పులవాళ్లు ఉన్నారు ఇప్పుడు కాకినాడ రావడం సాధ్యంకాదు కూడ, ఇంటి పరపతి నిలబడాలంటే!'

సోమయాజులుకు అర్థమయింది,

మాణిక్యం అవధానికి ప్రత్యేకం ఒక ఉత్తరం వ్రాయమని ఎందుకంటుందో! అదీ నిజమే! తనలాంటివాళ్లు మాటవల్ల ఆదరణ చూపేవాళ్లే కాని, నిజంగా యిక్కట్టు లోంచి తప్పించాలంటే ఆర్థికస్తోమత కలిగిన అవధాని ఒక్కడే కనిపిస్తున్నాడు.

అవధానికి భార్యపోయి అయిదు సంవత్సరాలు దాటింది. ఇప్పుడు ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నాడు. విజయనగరంలో ఒక టీ కంపెనీలో మేనేజరుగా పని చేస్తూ రెండువందల రూపాయలు తెచ్చుకుంటున్నాడు. మళ్ళీ పెళ్ళిచేసుకోమని అందరూ ఎన్నివిధాలో చెప్పినా పోయిన భార్యమీద ఉన్న ప్రేమవల్ల పెండ్లికి ఒప్పుకోలేదు. బలవంతాన రెండుమూడు సంబంధాలు చూపించారు కాని, అవి నచ్చలేదని ముఖం చిట్లించాడు అవధాని. అతని నాలుగేండ్ల కూతురు, భార్యపోయిన ఏడాదికి చనిపోయింది. అందువల్ల పూర్తిగా విరక్తితో కాలం గడుపుతున్నాడు అవధాని. సంసార బాధ్యతలులేక ఒంటరిగా ఉంటున్న అవధాని అన్నయ్య తప్పక తనకు పిల్లలకు ఆధారభూతుడవుతాడని ఆశించింది మాణిక్యం! ఈ ఆశ సమంజసంకాదని ఎవరనగలరు? సోమయాజులు కూడ కాదనలేకపోయాడు.

'సరే. అవధానికి ఉత్తరం రాస్తాను. నేను ఈ సాయంత్రం కాగుకి తిరిగి వెళ్ళిపోవాలి' అని గాడు సోమయాజులు.

సోమయాజులు బయలుదేరేముందు భార్య సీతమ్మ చెప్పింది తిరిగి సాయంత్రం వచ్చేయమని. ఎక్కువకాలం ఉంటే, మాణిక్యం కుటుంబానికి జాలితో ఏదైనా సహాయం భర్త చేస్తాడని ఆమె అనుమానం. సోమయాజులు స్వతహాగా చాలా మంచివాడు. కష్టపడేవాళ్లంటే ఆయన హృదయం కరిగిపోతుంది. తోచినసహాయం తప్పకుండా చేస్తాడు. ఈ విషయం గ్రహించి సీతమ్మ ఆయన్ని ఎప్పుడూ పహారా హుషారుగా కాపలాకాస్తూ హెచ్చరిక చేస్తూంటుంది అనవసరపు ఖర్చులు చెయ్యవద్దని. ఒక వేళ తన ఆనతి భర్త అతిక్రమించినట్లు తెలిస్తే ఆరోజు సోమయాజులుకు యింట్లో చెప్పలేనంత రాద్ధాంతమవుతుంది. సీతమ్మ సణుగులతో, సాధింపులతో, ఆయన్ని, అంపాన కోతిపెట్టినట్లు బాధపెడుతుంది. ఎటొచ్చి తెలివైన మనిషి కావడంవల్ల, యింటిగోడవ రచ్చకెక్కకుండా మాత్రం చాలా జాగ్రత్తపడుతోంటుంది సీతమ్మ. భార్య సంగతి యెరిగున్న సోమయాజులు ఒకరోజు మాణిక్యానికి ధైర్యం చెబుతూ కోటిపల్లిలో ఉండామనే ఉద్దేశమున్నా, అది వీలుపడేటట్లు లేదు. అక్కడికీ మాణిక్యం కూడా అడిగింది. సోమయాజులు ఉండడానికి వీలులేదని అనిగాడు. ఇంక మాణిక్యం సోమయాజులును ఉండమని బలవంతపెట్టలేకపోయింది.

ఆరుగంటలు కాగానే భోజనం చేసుకుని కాకినాడకు వెళ్ళే కారు అందుకుందామని బయలుదేరాడు సోమయాజులు. బడినుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన సాంబు పెదనాన్నతో ఏవో కబుర్లు చెబుతూ ఇంట్లోనే ఉండిపోయాడు ఆటలకు వెళ్లకుండా. ఆయన కారుస్టాండుకు బయలుదేరుతూంటే, 'పెదనాన్నను దిగబెట్టి వస్తా'నంటూ తనూ వెనకాల బయలుదేరాడు సాంబు.

వచ్చి ముఖం చూపించి ఏవో ఆదరణపూరితమైన రెండు ముక్కలు మాట్లాడడం తప్పితే సోమయాజులు మరే సహాయం మాణిక్యానికి చెయ్యలేకపోయాడు. ఇది సోమయాజులు హృదయాన్ని బాధిస్తూనే ఉంది. అయినా పిల్లల ఖర్చుకు ఏమన్నా రెండు రూపాయిలు చేతులో పెడదామనుకున్నాడు. సీతమ్మ హుంకరిస్తూ ఎదురుగా కళ్లకుకట్టింది. పర్సు తీసిన సోమయాజులు భయపడుతూ తిరిగి జేబులో పెట్టేసుకున్నాడు.

సోమయాజులు బట్టలసంచీ సాంబు చేతో పుచ్చుకుని ఆయన చిటికినవేలు ఒక చేత్తో పట్టుకుని నడుస్తున్నాడు. ఫకఫకానవ్వుతూ బడిలో గమ్మత్తుగా తనుచేసే అల్లరి, మాష్టారి తెలివితక్కువ, తోటి కుర్రాళ్ళు తనఅల్లరిలో సాయం చెయ్యడం అన్నీ విపులంగా ఒక కథ చెబుతున్నట్లు గబగబ చెబుతున్నాడు. చెబుతూహఠాత్తుగా మధ్యలో ఆగిపోయాడు.

'ఏం? మానేసేవేమిరా? చెప్పు! నువ్వు అల్లరి చేస్తూంటే మాష్టారు కోప్పడరా?'

'ఆఁ. మాష్టారికి నేనంటే ఎంతో యిష్టం. అందులో నాన్నకు మంచిస్నేహితులు.... కాని యీమధ్య అల్లరి చెయ్యటం లేదు పెదనాన్నా.'

'ఏం?'

'నాన్న వెళ్ళిపోయాక అదేదో బెంగగా ఉంది. నేనంటే నాన్న చాలా మంచిగా ఉండేవాడు. నాన్న తిరిగివస్తాడా పెదనాన్నా?'

"కరణం గారూ! ప్లాటుఫారం టికెట్లు చవకైనా యిటగా!"

"అవునోయి. ఈ మధ్యే పేపర్లో వేశారు."

"అట్టయితే ఇప్పుడే ఓవంద కొని పారెయ్యరాదూ!"

జోడపాటి సుందరి
మద్రాస్

ఆఁ తప్పక వస్తాడు. నేను మళ్లీ వచ్చేటప్పుడు తీసుకువస్తాగా'

'నువ్వెరుగుదువా పెదనాన్నా! నాన్న ఎక్కడికి వెళ్లాడో?'

'నాకు తెలియదా మరి! ఎక్కడికో దూరంగా స్నేహితులను కలుసుకుందామని వెళ్ళాడు మీ నాన్న!'

'మరి అమ్మతో కూడా చెప్పకుండా వెళ్ళాడేం?'


'మరిచిపోయి ఉండవచ్చు!'

సాంబుకు యీ సమాధానం ఒక విధంగా సంతృప్తి కలిగించింది. ఆ కుర్రాడి అమాయక సంభాషణ, తండ్రిమీదఉండే ప్రేమ, సోమయాజులుకు సాంబుమీద జాలి కలిగించాయి. తనకు సంతానం లేకపోవడంవల్ల, సోమయాజులుకు ఇతరుల పిల్లలంటే చాలా ఆప్యాయత కనపరుస్తాడు. అందులో సాంబు, ప్రకాశం అంటే, తెలివైన అందమైన కుర్రాళ్ళని, సోమయాజులుకు చాలా అభిమానం. సాంబుకు తప్పకుండా ఏదైనా యివ్వాలనిపించింది అతనికి.

బస్సుస్టాండు వచ్చింది. కాకినాడపోయే బస్సు బయలు దేరడానికి సిద్ధంగావుంది. భార్య ఏమంటుందో అని తీవ్రంగా ఒక్కసారి ఆలోచించి, చివరకు తెగించి, పర్సు తీసి రెండురూపాయలు సాంబు చేతులో పెట్టాడు. 'నువ్వూ చెల్లాయి ఏమన్నా కొనుక్కోండి' అంటూ.

'ఎందుకు పెదనాన్నా?' అన్నాడు సాంబు

రూపాయిలు స్వంత ఖర్చుకు దొరకడం అదే మొదటిసారి సాంబుకు. బంధువులు ఎందరో అప్పుడప్పుడు యింటికి వచ్చినా, అణా, బేడ, చేతిలో పెట్టడమే కాని, రూపాయి ఎవరూ యివ్వలేదు. అమ్మ నాన్న కూడా పావలాకుమించి ఎప్పుడూ కొనుక్కుందుకు యివ్వలేదు. ఆ రూపాయిలు చూసి ఆశ్చర్యపోయి, మొగమాటంతో, తీసుకోడమా లేదా అనే సందిగ్ధంలో పడ్డాడు సాంబు.



'ఫరవాలేదులే. తీసుకోరా' అన్నాడు సోమయాజులు నవ్వుతూ.

హారను మ్రోగింది. పెద్ద శబ్దం చేసుకుంటూ ఒక చిన్న భూతంలా కదిలింది కారు.

'ఉంటాను పెదనాన్నా' అంటూ చెయ్యి ఊపాడు సాంబు.

'మంచిది. జాగ్రత్త. అమ్మను ఉత్తరం వ్రాస్తూండమని చెప్పు.' అన్న సోమయాజులు ఆఖరిమాటలు కారు డర్రు శబ్దంలో లీనమైపోయి సరిగా వినిపించలేదు సాంబుకు. పెత్తండ్రి యిచ్చిన రూపాయిలు సంతోషంతో జేబులో ఘల్లుఘల్లని మ్రోగించుకుంటూ గబగబ యింటికి వచ్చేశాడు సాంబు. రూపాయిలు చూసి తల్లి అడిగింది.

'ఇవి ఎక్కడివిరా?'

'పెదనాన్న యిచ్చాడు, నాకు, చెల్లాయికి.'

సోమయాజులు మనస్తత్వం ఎరిగిన మాణిక్యం ఏ పరిస్థితుల్లో యీ సొమ్ము అతను యిచ్చి ఉంటాడో అర్థంచేసుకుని నవ్వుకుంది.

'అమ్మా! నాన్న ఎవరో స్నేహితుని యింటికి చూడ్డానికి వెళ్లారుటే!' అన్నాడు సాంబు రూపాయిలు తన పెట్టెలో దాచుకుంటూ.

'ఎవరు చెప్పారు?'

'పెదనాన్న!'

'అలాగా' అంటూ మాణిక్యం జాలిగా కొడుకువైపు చూసింది. భోజనం చేసి ఒడిలో పడుకున్న కాంతను ప్రక్కమీద పడుకోపెట్టి, సాంబును మరొక ప్రక్క పర్చి, నిద్రపోదామని, పెద్ద హరికేనులాంతరు ఆర్పి, కిరసన్‌బుడ్డి లాంపు వెలిగించింది ఆమె.

గదిలోని అంధకారంలో మినుకు మినుకుమంటూ గుడ్డిదీపం గాలికి అల్లల్లాడుతోంది. మాణిక్యం తన ప్రస్తుత జీవితాన్ని ఒక్కసారి స్మరించుకుని కన్నీళ్లు కారుస్తూ నిద్రపోయింది. [ఇంకా వుంది]

రాజా పాడిన విషాదగీతం

"జ్యేష్ఠ"

నేను ఆ యింట్లో అడుగుపెట్టిన ఆరుమాసాలకే శ్రీ నా హృదయ ద్వారాలు దాటి లోపలికి వచ్చింది. ఆమెని ఇల్లుగలావిడకు పరిచయంచేస్తూ అన్నాను, "వీళ్ల అమ్మమ్మకి కూడా మీలాగే సంప్రదాయాలంటే పంచప్రాణాలూనండి" (ఆవిడపోయి పదేళ్లైంది) ఆ మాటలకి ఆవిడ ఎంతో ఇదైపోయి "అట్లాగనా! అయితే నా చెల్లెలు పిల్లని మంచి కట్టుడిలోనే ఉంచిఉంటుంది. ఈ రోజుల్లో ఆడపిల్లలకుండే సంగీతంలాంటి పాడలవాట్లేం లేవుకదా! ఉండవులే" అంది తన ముఖంమీది ముడతలు మాయంచేసి. (ఆవిడ సిపాయి పితూరీనాటిదో అంతకంటె పదేళ్లు చిన్నదో అని నా అంచనా. తనవయస్సువాళ్లు, అంతకంటె పెద్దవాళ్లు జీవితంపై మమత కలిగిఉండడం అనవసరం, అసంభవం అని ఆవిడకు ఘట్టినమ్మకం. కాబోలు. శ్రీ అమ్మమ్మని చెల్లెలంది) నాకేం చెప్పాలో తెలియలేదు. శ్రీ పళ్లు బిగించి నవ్వుతూ అంది: "పాడలవాట్లేం లేవండి." నాకు ఆ రాత్రి అన్నం నోటికెక్కలేదు. శ్రీ "పాకశాస్త్రం" ముందుంచుకొని వండకపోయినాను.

నేను చేసేఉద్యోగం, ఒక కంపెనీకి చెందిన ఆఫీసులో ఫైళ్ళముందు కూర్చుని చెమటోడ్చడం. ఉద్యోగం వచ్చేముందు అదేఆఫీసుకు బయట చెమటోడ్చేవాణ్ణి హోటల్లో జిహ్వని చంపుకొని, ఆఫీసులో పూర్తిచేయగా మిగిలిన ఫైళ్లలో మిత్రుల యిళ్ళవద్ద కునికిపట్టి, యిప్పుడు యింటికి బయలుదేరితే తెల్లారవచ్చునే భయంతో ఏ పుణ్యాత్మురాలి ఇంటికో కాపలాకాసేవాణ్ణి, దోమల సంగీతానికి లయగా భజనచేస్తూ, మనస్సులోనే దేవుణ్ణి తల్చుకుంటూ.

నేను సంగీతం అంటే చెవికోసుకుంటాను. అది నా పూర్వజన్మ దుష్కృతి ఫలితం అని నా భావం. (నా యీ భావంలో శ్రీశ్రీకి సానుభూతి, సంపూర్ణవిశ్వాసం ఉన్నాయి) మా ఇల్లుగలావిడ సంగీతద్వేషి. ఆరుద్రగారు ఎదుర్కొన్న ఇల్లుగలావిడకి అప్పగారై ఉండవచ్చు. అందుచేత నా కొచ్చిన గాంధర్వం ప్రదర్శించడానికి నాకు భయంగానే ఉండేది. అక్కడికీ రాత్రి శేళ్ళప్పుడుమాత్రమే పాడేవాణ్ణి. ఇల్లుగలావిడకు శ్రీ సంగీతం పాడదని వల్లమాలిన అభిమానం ఆమెపైన. ఆవిడ నాతో అనేది. "ఒరేయ్! మనవడా! నీకు ఇలాంటి మంచి సంప్రదాయాల్లో పెరిగిన పెళ్లాం వచ్చింది కాబట్టి సరిపోయింది. లేకపోతే నీ కూని రాగాలతో, ముక్కు అరుపులతో నన్ను ఏనాడో మట్టిలో కలిపేసేవాడివే" ఆమాటలు విన్నప్పుడు నాకు నా కంఠం, గానకళా పరిజ్ఞానంపై ఉన్న అభిప్రాయాలు నిజమే ననిపించేవి. నా కంఠంలో మాధురికి ఆ ముసలిప్రాణం ఎంత బాధపడిందో అని జాలేసేది. ఆవిడకు సరిగా మాటవినపడదు కదా, నా కంఠంలోని గార్ధభాల నేలా కనుక్కుందా అని ఆశ్చర్యం వేసేది. అందుచేత ఈవిడ పడుపుకీ, పాముకీ మధ్యస్థితిలో ఉందనుకొన్నాను. (పాముయితే చెవుడుండదు) కాని ఆ చెవుడు ఎల్లప్పుడూ ఉండదని అప్పులవాళ్లూ, పన్నులవాళ్లూ, విధులుకుడిచేవాళ్లూ, బిచ్చగాళ్లూ పిలిచినప్పుడుమాత్రమే ఆవిడను కావాలేందుకు వస్తుందని శ్రీ కని పెట్టింది. (నాకు తోచనే లేదుసుమండీ. ఆపాటి శ్రీలాగైనా నాకున్న (గాహాలు.)

నాకున్న ఒక్క దురభ్యాసమూ కూనిరాగాలాపన. నేను నాతోటి గుమాస్తాలకు వినపడేటట్టు ఆ కూనిరాగం అందిస్తే వారు నన్ను ఏం చేసేవారో ఆలోచిస్తే నా గుండెల్లో రైళ్లు పరుగెత్తుతాయి. మా ఆఫీసరుమాత్రం పాము చెవులవాడు, నరాంతక బిరుదాంకితుడు. కాని దయార్ద్ర హృదయుడు కనుక ఆరుద్రగారి ఆఫీసరులా "నోహమ్మింగ్ ప్లీజ్" అని ఏడిపించకుండా, దేశంలోకల్లా పెద్ద సంస్థ "నిరుద్యోగ సంస్థ"లో కాని ఖర్చులేకుండా సభ్యత్వం ఇప్పించాడు.

ఉద్యోగం ఊడిన ఉత్సాహంలో (జీతం నెలముక్కాల్లో వచ్చింది!) నా కూనిరాగం వ్యసనీకృతోత్సాహంతో కాని రోగంగా మారింది. నా సంగీత వేదనలో ఏకైక భాగస్వామిని శ్రీ నన్ను మరో ఉద్యోగం చూసమంది. నేను 'సరే'నన్నాను కాని తిరిగి ఆ బందిఖానాలో స్వచ్ఛంద బాధితుడుగా చేరతానా? అక్కడ మా డైరీలు మా ఆఫీసరు కోరికలకి అనుగుణంగా రాసుకోవాలి. అప్పుడు నేను చేసేపని ఇది. అక్కో

★ రాజాపాడిన విషాదగీతం ★

బరు ఒకటి: (మా ఆఫీసుంది) 8-11; 2-8 ఫైళ్ళతో నిర్విరామమైన కుస్తీ. అక్టోబరు రెండు: డిటో అదీ వరస. మధ్యమధ్య సెలవులని పేరుగల రోజులు వచ్చినా మా డైరీ మారేదికాదు. ఇప్పుడు నా డైరీ నేనే రాసుకోవాలని పళ్లు బిగించి కూర్చున్నాను. అబ్బే. నే చేసే చర్య ఉండాలిగా దినచర్య వ్రాయడానికి! అదే ఇది.

తెల్లవారుతుంది, ఇల్లుగలావిడ చెంబుల యుద్ధంతో (నగరంలో కోళ్ల గోలా భాగ్యం లేదు). కాఫీ సేవించాక శశి ఓ పూజ చేస్తుంది ఇల్లుగలావిడ కన్నీళ్లు తుడిచేందుకు. శశి మడిగట్టుకొని (అప్పుడే అంట్లు తోమేటప్పుడు కట్టుకున్న చీరతో) 'పూజాగృహం' ప్రవేశించి కొన్ని ఫోటోలకు పూజచేస్తుంది. నిజానికి ఆ ఫోటోలలో ఒకటి శ్రీ. శ్రీ. ది. రెండోది రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సు. అవిగాక ఒక బుద్ధుడి ప్లాస్టిక్ ప్రతిమ ఉంది. ఇవి చూచి ఇల్లుగలావిడ సంతోషిస్తుంది. (చూడండి. మనం గొప్పవాడు అనుకునే ఒకాయన పొరపాటుగా ఓ మాటన్నాడనుకోండి. మనం అది కూడా గొప్పదై ఉండాలని ఊహించి నడుము బిగించి 'ఇది గొప్పది' అనేందుకు ఏదో ఆధారం కనిపెట్టి ఎదుటివారిని నమ్మించ చూస్తాం. మన మనస్సుకుండే ఈ జబ్బే ఇల్లుగలావిడ కళ్లకుంది. ఇది పూజాగృహం కనుక ఇందులో ఫోటోలు దేవుళ్ళ ఫోటోలుగా కనిపిస్తాయావిడకి). తరువాత శశి ఏవో పాటలు పాడుతుంది (అవి 'నా స్టిక్'లోవని నా నమ్మకం) ఇల్లుగలావిడ అడుగులసడి విని శశి గట్టిగా అంటుంది తన కోకిల కంఠంతో: "ఎన్నిమార్లు చెప్పినా ఓ అగరొత్తుల కట్ట తెమ్మంటే తేరు. పూజలో అగరుధూపం లేకుండా ఎలా?" పాపం ఇవి విని ఆ వృద్ధురాలు సంతోషిస్తుంది. ఆవిడ వెళ్ళిపోయాక నే నంటాను: "ఆవిడకు కనపడగూడదా. పోనీ ఓ సిగరెట్టు వెలిగించి పెడితేనేం? శ్రీ. శ్రీ. పొగాకు ద్వేషి కాదు. బుద్ధుడికీ, గాంధీజీకి దేశవాళీ పొగాకు పై దొర్ల పొగాకంటే ఉన్నంత అయిష్టం ఉండదు." శశి నా నోరుమూసి నవ్వుతూ బయటకు తరుముతుంది అప్పులవాళ్లు రావచ్చునే భయంతో.

శశి తరమకపోయినా నాకూ ఆ సన్నని రోడ్డంటే ఇష్టమే. "తీరని కోరికలు - వెర్రి పోకడలు" అనేవి ఎట్లాగుంటాయో ఉదాహరణలతో చూపించి అవి తీర్చమని అప్పులవాళ్ళకన్న ఓపికతో, స్నేహభావంతో వేధించే పుత్రరత్నం నాకింకా కలగలేదు. శశి నా ప్రేమదేవత. నా అదృష్టంకొద్దీ పెద్దల దృష్టిలో పడి మంచి దనిపించుకొని నాదైంది. ఆ పెద్దలు శుభలేఖల్లో వ్రాసినది కాస్తా జరిపించి ఊరుకున్నారా? ఊహుఁ. 'దైవం రక్షించి నీ కడుపున పదికాయలు కాసి'...అంటూ శపించారు అసూయవల్ల కాబోలు. నా పూర్వజన్మ సుకృతంకొద్దీ నాకింకా కాయలు కాయలేదు.

అయితేనేం గుమ్మం దిగుతూంటే దూరాన అప్పులవాళ్ళు కనిపిస్తారు "వీడి బాకీ గగనకుసుమమే" అనుకొన్నారేమో ఆకాశంకేసి చూస్తూ మధ్యమధ్య చిత్తబండి ఆప్యాయంతో విడిచిన పాతరేకు డబ్బాలను తన్నేస్తూ (బాల్ఫీ తన్నేసినా బతికి పోదును.) అప్పుడు ప్రతివాళ్ళ మెదడులోనూ కాస్తో కూస్తో ఉండి, అవసరం లేనందున నిద్రిస్తూఉండే 'గిరీశం' నాలో మేల్కొంటాడు. "నేను బతికే ఉన్నానగ్రోయ్. (అందులో తను ప్రపంచాంతం వరకూ బతికే ఉంటాననే ధీమా ఒకటి) నన్ను మరిచిపోడం మీతరం కాదగ్రోయ్" అంటూ. నాకు తత్క్షణం ఏ కడుపు నెప్పో వస్తుంది. (హోటళ్లలో భోంచేస్తే ఇంకా సహజంగాఉందనుగదా!) శశిలో ఎప్పుడూ హుషారుగాఉండే చాణక్యుడు కార్యరంగంలోకి ఉరుకుతాడు. శశి తనో ఫిలిమ్ కెమేరా ముందున్నాననుకుంటుందేమో, బాగా నటిస్తుంది. "అయ్యయ్యో! ఈయనకి వారంరోజులనుంచి కడుపునెప్పివస్తున్నా డాక్టరుని తీసుకొద్దామంటే డబ్బులేదు," అని అన్నతర్వాత ఆమె చీరపాడవున ఓ నిట్టూర్పు వెలువడుతుంది. అప్పటికి ఆ నక్షత్రకద్వయం మాకొంప పరిసరాల్లోకి రావడం క్రీగంటితో కనిపెట్టిన శశి స్వరం హెచ్చిస్తుంది మానవత్వం ఏమాత్రంఉన్నా అది తలవంచే జాలి స్ఫురిస్తూ: "ఇంతకుముందు ఏఆపదొచ్చినా (శశి స్నోసీసాలు, పౌడరు పీపాలు కొనమనడం నాకు ఆపదేనని ఆమె గుర్తించినందుకు ధన్యవాదాలు.) రంగయ్యగారు, లింగయ్యగారు దేవుళ్లలా కాపాడే వారు. ఇప్పుడెక్కడున్నారో ఓపాలిక అడుగుదామంటే" అని విసురుగా వెళ్తుంది వీధిగుమ్మంలోకి ముక్కుచీదేమిషతో. అప్పటికే ఆ వడ్డీకాసులవాళ్ల గుండెల్లో పెద్దబరువు చేరి ఉంటుంది. శశి తమని చూడటంలో గల ప్రమాదం గుర్తించి పెద్దపెద్ద అంగలతో తమ సుదీర్ఘ కాయాలను ముందుకు తోస్తూ నడుస్తారు. ముందు జాగ్రత్తకని నెత్తిన గుడ్డ పరుస్తారు. (వాళ్లి బట్టతలలే వాళ్లికి గుర్తు) మరో నెలదాకా వారిదర్శనభాగ్యం కలుగదు.

గొప్పగొప్ప రచయితల యిళ్లకి వెళ్లి వాళ్లని పొగుడుతున్నట్టు నటించి, "నే రాసినకథ చూస్తారా? ఇది బావుంటే, అంటే మీరు బావుందని అంటే పత్రికల వాళ్ళకిస్తాను" అంటాను. "ఏమైనా మహా గ్రంథాలు వ్రాస్తున్నారా" అని అడుగుతాను. వాళ్లపిల్లల్ని (అంటే పండితుల పుత్రుల్ని) మచ్చికచేసుకుని లాలించడం లాంటివి చేసి సెలవుతీసుకుంటాను. మధ్యాహ్నపుఎండలో మద్రాసు తారురోడ్లమీద పాతచెప్పుల నీడుస్తూ, పదెక్కిన నాతలను మధ్య మధ్య తడుముకుంటూ ఇంటికి చేరతాను.

తిరిగి నా విహారానికి బయలుదేరతాను మూడుగంటల పరిసరాల్లో. ఆ సమయంలో 'ఇంట్లోలేరు' అని సాగనంపటానికి వీలుండదు నా గురుపత్నులకి. ఎందుకంటే ఘనత వహించిన ఆ కవులు కలల్లో విహరిస్తూంటారు వరండాలలో, మాటిమాటికీ నిరుద్యోగుల్లా తారసిల్లి పలకరించే నాబోంట్లను వీధులకి వదిలేసి. వారు నిద్రపోతారు అని తెలిసి ఎందుకెళ్ళారు. అనే ప్రశ్న రావచ్చు. ఏం లేదు. "మీకోసం ఆయనెవరోవచ్చివెళ్ళారు" అని చెప్తుందా కవిపత్ని. ఎవరో అని తికమక పడతారు ఆ కవిగారు వెలవెలపోతున్న సూర్యుని వెలుగులో. మర్నాడు నే వెళ్తే "ఆయనే..." అంటుంది కవిపత్ని సగం స్వాగతంతో. మేం కాసేపు నవ్వుకుంటాం. అంతే. ఈ నిరుద్యోగి ప్రతి చిన్నవిషయంలోనూ ఛార్లీచాప్లిన్ని, వుడ్‌హౌస్‌ని చూస్తాడు.

ఉద్యోగం ఊడటం ధర్మమాఁ అని పత్రికా కార్యాలయాలకి స్వయంగా వెళ్ళడానికి వీలుపడుతోంది. అక్కడ పేపరు బోయ్‌దగ్గర్నుంచి, సంపాదకులవరకూ నాకు పరిచితులే. తన ఉద్యోగం రోజుల్లో కోరచూపులూ, దొంగనవ్వులూమాత్రం చూసిన ఈ మాజీ ఉద్యోగి అక్కడి చిరునవ్వులు చూస్తాడు. 'మీ కథ బావుంది' అంటూ వారిచ్చిన పారితోషికం, సంచికా తీసుకు బయటపడతాడు. వెనక్కి తిరిగి ఆ పత్రికా కార్యాలయం చూసి ఎంత గర్విస్తాడో, ఆనందిస్తాడో, మనస్సులోనే ఆ కార్యాలయానికి ఎన్ని నమస్కృతులందజేస్తాడో. "ఎంత మోగించినా హారన్ వినపడదేం" అన్న ఏ గోద్రెజ్ వాళ్లి కారుడ్రైవరు కంచుకంఠమో విని ఈలోకంలో పడతాడు. జేబులో ఆ డబ్బు చూసి ఆనందిస్తాడు! అల్ప సంతోషి.

ఏడు అంటే ఈ నిరుద్యోగి, నేను ఇల్లు చేరేసమయానికి శశి వీధిగుమ్మంలో నిలబడుతుంది చిరునవ్వులతో. నా మిత్రులు గుమాస్తాలు ఈ అదృష్టానికి నోచుకోలేదు. వాళ్ల భార్యలు నవ్వరుట, ధుమధుమనోములు పట్టారుట. ఫస్టుతారీకు ప్రత్యేకత లేదుట. వాళ్లు కోరేకోర్కెలు కోతికథలో మొసలి పెళ్లాన్ని జ్ఞాపకం తెస్తాయిట. నేను ఉత్సాహంగా చెప్తూఉంటాను శశి

అసమర్థత

నిజానికి నేను రాస్తున్నది అంత వింత అయినది కాని, విషాదకరమైనది కాని కాదు - ఎందుచేతనంటే మనం ఎన్నో వింటూనే ఉంటాం ప్రతిరోజూ - రైళ్ళు తిరగబడి ఎంతోమంది చనిపోయేరనీ, వరదలవల్ల ఎంతో ధన జన నష్టం సంభవించిందని భూకంపాలవల్ల, యుద్ధాల మూలంగాను ఊహించలేనంత ప్రాణనష్టం సంభవిస్తున్నదనీను.

ఇలాంటి వార్తలు వినడంవల్ల మన కేమీ అనిపించదు. "ఆహాఁ, అలాగా?" అని ఒక్కమారు ఆశ్చర్యం ప్రకటించి ఊరుకొంటాం. కాని, మన కళ్ళముందు కారు కింద కుక్కపిల్లపడి చచ్చిపోయిందంటే లేకపోతే మూర్ఛవచ్చి మనిషి రోడ్డుమీద పడి కొట్టుకొంటూఉంటే, అంత నిర్లిప్తంగా ఉండలేం - ఏదో గాఢమైన అనుభవం పొందుతాం. ఈ వార్త కనబడ్డవాళ్ళందరితోనూ చెప్తాం. వాళ్లు మాత్రం "ఆహాఁ, అలాగా?" అని ఊరుకొంటారు.

మొదట ఆ యింట్లో ప్రవేశించగానే "ఊరుతో సంబంధం లేకుండా ఒంటరిగా ఉండవలసి వచ్చిందే" అనిపించింది. అయితే, అటువంటి భయం అనవసరమనిపించింది రంగడు దగ్గరలోనే ఉంటున్నాడని తెలిసి. ఒంటరిగా ఉన్నానన్న బతుకే లేకపోతే రంగడి మంచిచెడ్డలు తెలుసుకోవలసిన అవసరమే కలిగిఉండదు నాకు.

గ్రామంలో రంగడంటే అందరికీ తెలుసును. మొండిరంగడంటే మరీ సులువుగా తెలుస్తుంది. రంగణ్ణిగురించి చెప్పుకొని నవ్వుకొందికి చాలా విషయాలున్నాయి. ప్రేమకలాపాల విషయంలో రంగడి శక్తిసామర్థ్యాలు అద్వితీయమైనవి. ఆరేసి మాసాల కొకమారు భార్యని బదలాయించెయ్యడం రంగడికి అతి సాధారణ విషయం. ప్రస్తుతం నాలుగు మాసాల గర్భవతి అతని భార్యస్థానాన్ని ఆక్రమించుకొని ఉంది.

రంగడితో ఉన్న అవసరం అంతా గ్రామంలోని చిల్లరవర్తకులకి. ఆజానుబాహువు - మంచి కండపుష్టి ఉంది. ఎంతలావు సామానైనా అవలీలగా నమ్మకంగా అనుకొన్న స్థలానికి చేరవేస్తాడని అందరి విశ్వాసం. రంగడితో కూలిబేరం చేయడం అంటూ లేదు. రంగడిచేత గాడిద పని చేయించుకోవచ్చును, మంచిమీద. తిక్క పుట్టిందంటేమాత్రం వాడిచేత ఏమీ చేయించలేరు. ఈ సంగతికూడా అందరికీ తెలుసును.

ప్రణవానంద

చుట్టుపక్కల ఊళ్లన్నీ డ్యూటీ పేరుతో చాంద్రాయణం చేసి, సాయంకాలానికి ఇంటికి చేరుకోడం నా అలవాటు. ఆ సమయంలో ఆరుబయట మంచం వాల్చుకొని రంగడు సతీసమేతంగా కూర్చునేవాడు. ఒకొక్కక్కనాడు భరించలేనంత రాగాలాపన వినిపిస్తూఉండేది. రంగడికి దాపరికమంటూలేదు. కాగా, భార్యాభర్తల సరససల్లాపాలు వినే యోగం దగ్గరగా ఉండడం చేత నాకు తప్పేదికాదు.

రోజూ ఒకమారు రాత్రి నా దగ్గరకు వచ్చేవాడు. చుట్టో, అగ్గిపెట్టో, ఒక కాడబ్బులో ఏదో అడిగేవాడు. వెళుతూ ఒకమారు అవసరమైతే కేక వేయండి బాబూ ఇక్కడే ఉంటానుకదూ అనేవాడు.

అమధ్య ఒక వారంరోజులు గ్రామంలో లేను. తిరిగి వచ్చేసరికి రంగడు కనిపించేడు. మనిషి బాగా నీరసించిపోయాడు. నన్ను చూడగానే ఎంతో ఆప్యాయత కనబరిచేడు. నాకూ అలాగే అనిపించింది. ఎక్కువ సంబంధం లేకపోయినా పరస్పరం ఈ ఆత్మీయత ఎలా కలిగిందో చెప్పలేను. ఎన్నో కారణాలు చెప్పుకొని మనం తృప్తి పడవచ్చును. కాని, ఆ కారణాలు చాలా చోట్ల అన్వయించబడుతాయి.

ఏమలా ఉన్నావని అడిగేను.

"బాబూ! నాలుగు రోజులయింది, నులిగడుపుగా ఉంది. కూలికి ఎక్కడికీ పోలేదు" అన్నాడు.

"మాకు మందేటిబాబూ! అదే పోతాది" అన్నాడు.

జబ్బుచేస్తే మందు పుచ్చుకోడం అన్నది ఆ ప్రకృతులకి అంత అలవాటయిన సంగతి కాదు; అదీకాక, మందుపుచ్చుకోవాలంటే అంత సులువయినవిషయమూ కాదు.

ఊళ్లో వైద్యుడు వెంకట్రాయడుగారు లేకపోలేదు గాని కూలినాలి చేసుకొనేవాళ్లకి వైద్యంచేస్తే ఎలాగడుస్తుంది ఆయనబతుకు! వాళ్లకి శ్రద్ధలేదు, తక్కినవారు పట్టించుకోరు.

నులిగడుపు (డిసెంట్రి) ఏమంత పెద్ద జబ్బేమీ కాదు. ఇలాంటి చిల్లరజబ్బులకి ఏఏమందులిస్తారో నాకు తెలుసును. అవి ఏమంత ఖరీదయినమందులు కావు కూడాను. ఆమాత్రం మందులు నేను కొని ఇవ్వగలను. కాని, నేను డాక్టరుని కాదు - తీరా మనం తెలిసీ తెలియకుండా మందిస్తే అది ఏమైనా వికటిస్తుందేమో? ఇంతకీ రంగడు చెప్పినట్టు దానంతటదే పోవచ్చును. ఇంతకంటె మరి విపులంగానూ ఆలోచించలేకపోయాను.

"తిండి తిన్నావా?" అని అడిగేను.

"తిన్నాను బాబూ!" అన్నాడు అనుమానంగా.

రంగడు వెళ్లిపోయినతరవాత జబ్బులూ, మందులూ, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సహాయమూ, ప్రజలఅజ్ఞానమూ మొదలయిన విషయాలు ఎంతోసేపు మనస్సులో మెదిలేయి

తరవాత మర్నాటి కార్యక్రమానికి అన్నీ సర్దుకోవలసిరావడంమూలాన నా గొడవలో నేను పడిపోయేను.

ఆవేళ సాయంత్రం ఇంటికి వచ్చి కొంత విశ్రాంతిగా కూర్చున్నాను పేపరు చదువుకొంటూ.

దగ్గరలోనే కేకలు వినిపించాయి.

"కాలూ చెయ్యీ గట్టిగా ఉన్నప్పుడు మేం కనిపించేమా? మా కోనాడేనా ఇంత గంజి పోసినావా? ఇప్పుడు నీ కళ్లకి మేం కనిపించినాము; ఇప్పుడు మేం చెయ్యాల— ఊరుముండల్నందర్నీ తెచ్చినావు, అళ్ళకేటి కావాల? తిండి పెట్టినంతకాలం ఉంటారు. అది నేకపోతే ఎవురిదారి వారిది - దానిదేమీ తప్పుకాదు - నిన్ను అనాల"—

నా డైరిని. కళ్ళ ఊఁకొడ్తూనే జోకొట్టేస్తుంది...బిచ్చగాడినీ, లక్షాధికారినీ పక్షపాతంలేకుండా తన ఒడిలోకి తీసుకొని వాళ్ళకాగోజిచ్చిన బొప్పెలకు మందురాసి మాన్పే నిద్రాదేవత ఒడిలోకి. నా నిరుద్యోగజీవితం ఒక విషాదగీతం. కాని విషాదగీతం 'రాజా' పాడితే బాగుండదూ? ★

అసమర్థత

రంగడి అక్క అప్పమ్మ ఎన్నాళ్లనుంచో ఈమాటలు అనదలచుకొని ఉంది. ఈ సదవకాశాన్ని అప్పమ్మ జారవిడవలేదు. జబ్బుతో తీసుకుంటూ కూలిచేసుకోలేని స్థితిలో ఉన్న తమ్ముణ్ని వదలి వెళ్లిపోయిన మరదలు చేసిన పని అప్పమ్మకి కొంత ఆనందంకూడా కలిగించింది.

"సల్ఫాగనోడిన్ మాత్రలిస్తే?" ఏమో, ఏం ప్రమాదం చేస్తాయో? ఇంతకీ అవి గుండెని నీరసపెడతాయట. డిసెంట్రీకి సల్ఫాగనోడిన్ మాత్రలు ఇవ్వడం నాకు తెలుసును. అయినా నే నెలా ధైర్యంచేసి ఇవ్వడం? పట్నం వెళ్లినప్పుడు డాక్టర్నడిగి మందు తీసుకొని వద్దామనుకున్నాను.

మర్నాడు రోడ్డుమీద రంగడు కనిపించేడు. మనిషిని పోల్చుకోలేకపోయాను. నడిచే స్థితి దాటిపోయింది. కూర్చునే దేకురుతూ కనిపించేడు. నేను కనిపించగానే దండం పెట్టేడు. ఎంతలో ఎంత దైన్యం వచ్చేసింది!

ఎక్కువగా మాట్లాడలేకపోయాను. ఏదో తప్పుచేస్తున్నట్టనిపించింది. ఇంట్లో ఏమీ లేదు, చేసిపెట్టేవారూ లేరు. ఈ యింటికీ ఆ యింటికీ అలా దేకురుకుంటూ పోయి, ఎవరేది పెడితే అది తినడం మొదలుపెట్టేడు. అందరికీ నిశ్చయమయిపోయింది రంగ డెలాగూ బతకడని. అందుచేత దొరికింది తినడమే మంచిదన్నారు కూడాను.

రంగణ్ణి చూడగానే జ్ఞాపకం వచ్చింది మంగుసంగతి. నేను పట్నం వెళ్ళకపోలేను, వెళ్ళేను అయినా టైములేక పోయింది.

ఆవేళ రాత్రి నాదగ్గరకు వచ్చేడు దేకురుతూనే. "బాబూ! ఏమైనా తినడానికి పెట్టం" డన్నాడు -

నాకు ఎంతో బాధ అనిపించింది. వాడికి కావలసినవి పెట్టడానికి నాకేమీ అభ్యంతరం లేదు -

"భోజనంచేస్తావా?" అని అడిగేను.

"బాబూ! ఇంత ఊరగాయ అన్నం పెట్టించండి"

నిజమే, వాడికి ఇటువంటప్పుడు ఏది పడితే అది తినాలని ఉంటుంది. అయినా ఊరగాయఅన్నం ఎలా పెట్టడం? చేజేతులా జబ్బు ఎక్కువచేయడం ఎలాగ?

"రంగడూ! ఇవాళ ఊరగాయ అన్నం తినకు - తరవాత నీకు కావలసినంత పెడతాను" అన్నాను - చిన్నపిల్లల్ని బుజ్జగించి చెప్పేపరిస్థితి తటస్థించింది.

నీకు మందు తీసుకొనివస్తాను. రెండు రోజుల్లో పోతుంది. తరవాత నీయిష్టం వచ్చినవి తినవచ్చునన్నాను.

కాఫీచేసి ఇచ్చాను.

తరవాత కాఫీకబ్బులగురించి పిండివంటలగురించి ఎంతోసేపు మాట్లాడుకున్నాం. రంగడు మాటల్లో ఇడ్లీలు, దోసెలు, గారెలు అన్నీ తిన్నాడు. ఏమైనా ఊరగాయఅన్నం తింటేనే మజా... అలా అలా చాలాసేపు పాకకళగురించి ఎంతో ఉత్సాహంతో మాట్లాడేను. ఏఏ కూరలు ఎలా వండుతారో చెప్పేను. ఈబాతాఖానీ వాడికి చాలా సంతోషం కలిగించిఉండాలి.

మళ్ళీ మన ప్రారబ్ధం మనం అనుభవించక తప్పదుకదా! ఇంటిదగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది. అక్కడ పురిటిరోజులు. తక్షణం బయలుదేరేను. అనవసరంగా గాభరా పడ్డాను. అంతా సవ్యంగానే నడిచింది.

ఊరుదగ్గరకి తిరిగిరాగానే రంగడి మందు మాట జ్ఞాపకం వచ్చింది. ఇంతవరకు ఆ ఆలోచనే లేకపోయింది. ఇప్పుడేం చెయ్యడం? బహుశః ఈపాటికి తగ్గిపోయి ఉంటుంది.

తరవాత తెలిసింది. రెండు రోజులయిందట రంగడు పోయి. వాడి అక్క అప్పమ్మ చెప్పింది. "ఉంటే ఏటి, లేకపోతే ఏటి బాబూ! మాలాటివోళ్లు" అంది యథార్థవాది అప్పమ్మ—అంతటి యథార్థాన్ని భరించగలిగే శక్తి నాకుండవద్దూ?

ఇప్పటికీ నాకు అనిపిస్తూనే ఉంటుంది, మొదట్లోనే సల్ఫాగనోడిన్ మాత్రలు ఇస్తే ఇలా జరిగిఉండకపోవునని. కాని, నే నెలా ఇవ్వగలను? నావంటి అసమర్థుల కని ఎప్పుడూ ఇదే పద్ధతి - అన్నీ అనుకోడం. సకాలంలో ఏదీ చెయ్యలేకపోవడమూను.

★

జ్ఞానవీధులు

207. మంచి నడత

అంటే ఏమిటి? అని ఒక 'విద్యార్థి' ప్రశ్నించాడు.

ఈ మాటకు సరియైన అర్థము చెప్పడము వాదవమంత సులువు కాదు. 'ఇతరులు ఏది చేస్తే నీకు బాధ అవుతుందో అది నీవు ఇతరులకు చెయ్యకపోవడము' మంచిదన్నాడు భీష్మ కృష్ణ వర్మరాజుగో. అంటే "ఇతరులను నొప్పించకుండా వర్తించడమే మంచినడత" అనవలసి వస్తుంది.

ఈ సందర్భంలో అనీ బెసెంటమ్మ చెప్పినదొక సలహా చక్కగా సరిపోతుంది. ఆమె అన్నదిది:

ఏమైనా అనే ముందు మూడు ప్రశ్నలు వేసుకోవాలి. మొదటి ప్రశ్న: నీవు మాట్లాడడమవసరమా? అని. అవసరము లేనిదే మాట్లాడడమువల్ల ఏవో అవాకులూ, చెవాకులూ, నిందలూ, విమర్శలూ, దొర్లుతాయి. మన అభిప్రాయాలూ, అభిరుచులూ అవకతవకలూ యత్నమక్కరలేకుండానే ఇతరులకు — మన శత్రువులకు కూడాను — తెలిసిపోతాయి. 'కారణము లేకుండా వీడెందుకు మాట్లాడాలి?' అన్న అమోఘ విమర్శన మనమీదికి ప్రసరిస్తుంది. కనక ఏదైనా అనేముందు 'నేనిది అనడము అవసరమా?' అని ప్రశ్న వేసుకోవాలి.

రెండో ప్రశ్న: నేననేది నిజమా? అని. అక్కరలేని కల్పనలు ఎన్నో మన మాటలలో దొర్లుతాయి. మన అభిప్రాయాన్ని జరిగిన సంగతులలోనికి తర్జుమా చేసి చెప్పడమూ, గోరంతవింటే కొండంత విన్నట్టు నొక్కి చెప్పడమూ, చిన్నలోపాన్ని కప్పిపుచ్చుకోడానికి పెద్దకల్పనలు చెయ్యడమూ మనలో చాలామందికి పరిపాటి. వీటి వల్లవచ్చే అనర్థాలు చాలావున్నాయి. కనక మాట్లాడేముందు 'నేననేది నిజమా' అని కూడా ప్రశ్న వేసుకోవాలి. మూడో ప్రశ్న: నేననేది ఇంపుగా వుంటుందా? అని. పది మందికీ వెగటుగా ఉండేవి, తిట్లూ, నిందలూ, బూతులూ, అనకపోతే నేమి? కనక 'అవసరమా?' 'నిజమా?' 'సుఖమా?' అన్న మూడు సవాళ్లకు నిలిచే నడతయే మంచినడత అని బెసెంటమ్మ ఉపదేశము.

అయితే ఈనడత అలవడడానికి మనము ఏమి చెయ్యాలి? బెసెంటమ్మ మరొక సందర్భంలో చెప్పిన సలహా ఇందుకు సాయపడుతుంది. అదేమిటంటే, "ఏదైనా చేసేముందు ఇది యుక్తమా? అని ఆలోచించు" అని. ఈ ఆలోచన అన్నది ఎంతసేపు చెయ్యవలసివచ్చినా ఆ కాలము వృథా కాదట. తల్లిని చంపమని ఆజ్ఞవెట్టి వెళ్లిపోయినతండ్రి చేసిన పని న్యాయమా అనీ తాను తల్లిని చంపవచ్చునాఅనీ ఆలోచించిన చిరకారి తండ్రికి ప్రేమపాత్రుడే అయినాడు. ఆలోచించక చేసినపని ఎంత అనర్థకారియో వివరించడానికి బెసెంటమ్మ చెప్పినకథ ఇది:

ఒక వడ్రంగి పనిలో నిమగ్నుడై అక్కడే ఏదో చిల్లరపనిని చేస్తున్న మనుమడిని 'ఆ ఉలి ఇలా ఇవ్వ' మన్నాడట. పిల్లవాడు ఉలి విసరినాడు కాని తాతకు అందలేదు. చిరాకుతో చేతనున్న[illegible]నివి బాలునిపై విసరి కొట్టినాడు. అదిబాడితె. బాలుని కణతపైతగిలి వాడుచచ్చిపడినాడు. కోర్టులో నేరస్థుడు మొరపెట్టినది, 'నాకు ఆలోచనకువ్యవధి లేక పోయినది' అని.

ఇంకొక ఘటన: యుద్ధభూమిలో శత్రుల ఫిరంగీ—మెషీను గన్నూ—లగుండ్లు విరివిగా ప్రసరిస్తున్నప్పుడు ఇద్దరు సైనికులు వెల్లకిల పరుండి ఆహారము తింటున్నారు. అందులో ఒకడు "ఒరే అన్నా ఒక రొట్టె ఇలా పడవెయ్యరా" అన్నాడు. రెండోవాడు విసిరినాడు కాని అందలేదు. మొదటివాడు కోపముతో 'నీదుంపతెగ.' అని తదుము లెత్తి లేవబోయినాడు. 'ఠక్.' సరి గుండుతగిలి పడిపోయినాడు. కనక ఆలోచించి చెయ్యండి ఏపనైనా? ఏమాలోచించాలి? అంమురా? ఆమూడు ప్రశ్నలకు మన ప్రవర్తన నిలుచునా అని.

చిట్టిప్రశ్నలు జవాబులు

యస్. కె. మణి.— కాకినాడ.

ముక్కు చెలమలలో ఉచ్ఛ్వాస నిశ్వాసములకు చాలినంత చోటు ఉండక లోముక్కు అంచులు అదురుటవల్ల గురక వచ్చును. చక్కగా చీదుకుని గొంతు పుక్కలించి, రెండు మూడు గుక్కలు నీరు త్రాగి తిరిగి పడుకున్నంటే గుర్రు తగ్గగలదు. గురక ఇతరులకు నిద్రాభంగమే కాని ఎవరికీ ఆరోగ్యభంగము కాదు.

షా. హరిహరనాథ్— శనివారపుపేట

—శీతల దేశమువారు తెల్లగా ఉండుటకు వారి చర్మములోని వర్ణగ్రంథులే కాక ఎండలేకపోవడమూ కారణమే. ఆంగ్లేయులు మన దేశంలో కొంత కాలమున్నవారు కరచరణాలూ, ముఖమూ ఎర్రబడతారు. తొమ్మ్మ, వీపూ తెల్లగా ఉంటాయి. ఇది సూర్యరశ్మివల్లనే.

అసలు వారి శరీరములోవున్న వర్ణగ్రంథులు తెల్లవి. కనక వారు తెల్లగావుంటారు. నీగ్రోలు ఇంగ్లండులో స్థిరనివాసముండిపోయినా ఒక పట్టాన తెల్లబడరు.

ఆర్. శ్యామసుందర్— వడ్డెపల్లి.

—కుడి చేతికి ఎక్కువబలముండుటకు పైతృకమూ, అలవాటూకూడా కారణాలు. పుత్ర చేతి వాటము వారి సంతానానికి ఆనేర్పు అలవడవచ్చు. మీరు కొన్నాళ్లు ఎడమచేతి రాయివిసరులు అలవాటు చెయ్యండి; అలవాటవుతుంది. ఆడవారు సరిగా త్తిలేక పోవుటకు కారణమేమిటి? అలవాటులేక పోవడమే.

కె. రామారావు— కొత్తగూడెం.

—అవును శారీరక మానసిక పరిశ్రమలచే

విజ్ఞాన సమస్యలు

మన శరీరమునందలి జీవకణములు కొన్ని నశించును. అందుకే మనకు బడలిక కలుగును. ఈ 'నశించిన' జీవకణాలు రక్తప్రవాహముతో కలిసి, ఊపిరితిత్తులలో చేరి, దగ్ధమై నెత్తురు పరిశుభ్రమగుటలో గాలిలో ప్రవేశించి ఒకదిగ ఊపిరితో బయటికి పోవును.

దాసిరెడ్డి సాంబశివరావు — వడ్లమూడి.

—అవును ఒక మనిషిని చూస్తే జుగుప్స, మరొక వ్యక్తిని చూస్తే సదభిప్రాయమూ కలగడము నిజమే. (అయితే ఈ అభిప్రాయము సర్వత్రా సత్యముకాదని జ్ఞాపకముంచుకోవాలి.) ఈ అభిప్రాయము సౌందర్యాన్ని బట్టి కలుగుతుందేమో కొంచెం ఆలోచించండి. అందంగా వున్నవారిని గురించి సదభిప్రాయమూ అష్టవక్రాలూ ఉన్నవారినిగురించి దురభిప్రాయాలూ కలుగుతాయి. ఒక మనిషిలో విద్యుచ్ఛక్తి ఉంటుందన్న సంగతిని విజ్ఞానశాస్త్రము ఇంకా కనిపెట్టలేదు.

విద్యుత్తు మానవశరీరములోనుండి ప్రవహించగలదు. అంటే మానవునిలో విద్యుత్తున్నదన్న మాటకాదు. వెలుతురు గాజులోంచి ప్రసరించగలదు. గాజులో వెలుతురెక్కడుంది?

కస్తూరి విజయసారథి — రాజోలు.

శూన్యప్రదేశముగుండా వేడిమీ వెలుతురూ ప్రసరించును. అయితే, థర్మాసుఫ్లాస్కు గోడలకు లోపైపున లోహపు పూత ఉండును. ఈపూత వేడిమిని పరావర్తము (*Reflect*) చేస్తూ ఫ్లాస్కులోనే వుంచును. సూర్యుడికీ భూమికీ నడుమ శూన్యప్రదేశమే కదా ఉన్నది? దీనిద్వారా ప్రసరించి మనకు వేడిమీ వెలుతురూ అందుటలేదా?

ఎస్. చిట్టి వీరాచారిగారు, విజయనగరము.

—మెఱుపు అన్నది విద్యుదావేశపూరితములైన మేఘాలనడుమ సాగే చెణుకు. మోటారుబేటరీస్త్రిళ్ళలో ఒకదానికి రాగితీగను బిగించి, రెండోకొసని రెండో స్త్రీమీదరాస్తే కరకరమనే చెణుకూడా ఈజాతిదే.

మెఱుపు మేఘానికీ భూమికీ నడుమ నడిచే చెణుకు, దానికి రూపమనగా ఏమిటి?

కలలు టెక్నికలర్‌లో వస్తాయా అని అడుగుతారేమి? సముద్రము నీలంగానూ రక్తము ఎఱ్ఱగానూ, మంటలు ఎఱ్ఱవాటుగానూ కనపడవా మీ కల్లో?

వల్లపల్లి సుబ్బారావు — రాజమండ్రి

సూర్యుడూ గ్రహమండలమూ, 'పాలపుంత' అని మనము వ్యవహరించే నక్షత్రపథము అంతా చేరి ఒక గెలాక్సీ. అనగా నక్షత్రలోకము. ఇలాటి గెలాక్సీలు విశ్వములో చాలావున్నాయి. అన్నీ సూర్యునివంటి, సూర్యుణ్ణి మించిన నక్షత్రాలతో ఏర్పడ్డవే.

యం. కే. శ్రీనివాసన్ — రాజమండ్రి.

మన చర్మమునకు అయిదు పొరలున్నాయి. అయిదోపొరలో చర్మమునకు రంగునిచ్చు వర్ణగ్రంథులున్నాయి. ఈ గ్రంథులలోని వర్ణము యూరోపియనులలో తెల్లగానూ, మనలో గౌరవర్ణముగానూ, నీగ్రోలలో నల్లగానూ ఉండును. అయితే పిండదశలో ఉన్న జీవి శరీరముమీద ఈ గ్రంథులు ఏర్పడుతూ ఒకచోట కొంచెము దట్టముగా వర్ణమును చేర్చవచ్చును. అవే శిశువుకి పుట్టుమచ్చలౌతాయి. వీటిస్థానాలకు అర్థములేదని మా 'అభిప్రాయము.' బల్లి పలుకుకి అర్థమేమిటి? అలాగే వీటికీనూ.

ఎ. సుబ్రహ్మణ్యము — విజయనగరం.

రాడారు కిరణాలు వెలుతుర్ని వేడిమిని తెచ్చే కిరణాల్లాంటివే. వాటిలో ఈ రెండూ హెచ్చుగా ఉండవు అంతే లేదా. చాలా అల్పంగా ఉంటాయి. వాటివల్ల లాభమా? శత్రువుల ఏరోప్లేనుకు సోకి తిరిగి మనకంటికి వచ్చే సెర్చిలైటు కాంతివలెనే ఈ కిరణాలూ మనకి చేరతాయి.

ఈ కిరణాలు బయలుదేరి అలాగ మన దగ్గరకు తిరిగివచ్చుటకు పట్టే కాలాన్ని బట్టి శత్రువుల ఏరోప్లేను ఎంత దూరమున్నదో లెక్కగట్టి తెలుసుకోవచ్చును. ఈ కిరణాల వేగము 186 000 మైళ్లు సెకనుకి.


పుత్సల మల్లికార్జునస్వామి — విజయనగరం.

పలచని అల్యూమినియము పళ్లెములు వాటముగా విసరినట్లైతే గాలిలో తేలి పైకి లేచునని మీకు తెలిసేఉంటుంది. ఇలాగ గాలిమీద తేలి లేవడానికి ఆపళ్లెముల వేగము సాయపడుతుంది. విమానాలుకూడా రెక్కలు గాలిలో తేలడమువల్లనే పైకి లేస్తాయి. అలాగ తేలడానికి ఆ రెక్కలకు గాలిలో వేగము ఉండాలి. ఆ వేగము చేరడానికే విమానము ముందు నేలబారున పరిగెత్తడము. తరవాత అంత వేగమూ నిలుపుకుంటేనే ఎగరడము. ★

గ్రంథ స్వీకారం

సుమాంజలి: నవ్య సాహితీ సమితి (హైదరాబాదు) ప్రచురణ. 60 పేజీలు. వెల పదిఅణాలు. ప్రతులకు: నవ్య సాహితీ సమితి 1-1-230/16 వివేక నగర్, చిక్కడపల్లి, హైదరాబాదు.

ఇందులో ఆరుగురు రచయితలు వ్రాసిన కథానికలున్నాయి. రచయితలు శ్రీయుతులు పాలగుమ్మి రామారావు, ధరణికోట శ్రీనివాసులు, సోమంచి రామం, ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి, కందుకూరి లింగరాజు, శ్రీమతి అత్తిలి స్వరాజ్యలక్ష్మి గారలు. పుస్తకంచివర రచయితలు పరిచయం చేయబడ్డారు.



43

వరదరాజు అడితీ బైట నిలబడ్డాడు. లోపల బ్రహ్మానందం కొత్తగా కొన్న మేడ రిజిస్ట్రేషన్‌కి కావల్సిన పనులు చూస్తున్నాడు. శాస్త్రిగారు రమేశంతోపాటు రిజిస్ట్రార్ ఆఫీసుకి సరాసరి వొస్తానన్నాడు.

బ్రహ్మానందం కావల్సిన కాయితాలూ డబ్బూ తోలు సంచీలో వేసుకుని బైటికి వొచ్చాడు. వరదరాజు బైట ఉదయపు ఎండలో నిలబడి చలికి బిగిసిన చేతులు రుద్దుకుంటున్నాడు. పక్కనే కాలవ నిదానంగా, అన్నీ తెలిసిన సంసారి జీవితంలా ప్రవహిస్తోంది.

బ్రహ్మానందం, "ఏమండీ, జట్కా పిలవమన్నారా!" అని ప్రశ్నించాడు.

"ఎందుకండి? సరదాగా ఈ ఎండలో నడిచిపొయ్యేదానికి! ఎన్నాళ్ళయింది, ఖులాసాగా నడిచి, పదండి వెళ్దాం!" అంటూ వరదరాజు హుషార్‌గా నడవసాగాడు. బ్రహ్మానందం సంచీ చేతికి తగిలించుకుని వెనకనే నడవసాగాడు.

వరదరాజు, "పంతులుగారూ! ఈ ఎలక్షనేమిటండి? దాని గొడవేంటో కాస్త చెప్పండి!" అని ప్రశ్నించాడు, కాలవవైపు చూస్తూ. కాలవ అవతల పచ్చని బయలు; తర్వాత నీలాలు పరిచినట్టు కృష్ణ. కృష్ణ వొడ్డున దెయ్యంలా కనపడే పవర్ హావుస్—పొగగొట్టం.

బ్రహ్మానందం, "మీరూ నిలబడతారని విన్నానే! నిజమేనా?" అని ప్రశ్నించాడు తిరిగి.

"అవునండి. అందుకనే అడుగుతున్నాను" తాపీగా, అదేమీ పెద్ద విశేషం కానట్టే అన్నాడు వరదరాజు.

"ఎకరాలకి ఎకరాలు ఆరిపోతాయండి, ఈ ఎలక్షన్‌లలో. వేలకు వేలు డబ్బు ఎందుకో తెలియకుండా అయిపోతుంది. అంత ఖర్చు అయినా గెలుస్తామన్న నమ్మకం వుండదు. వొట్టి జూదం" అన్నాడు గుమాస్తా.

వరదరాజు పకపక నవ్వాడు. "భలే సరదాగా వుంటుందన్నమాట అయితే!" అన్నాడు.

"సరదా! బొమికెలు విరిగిపోతాయ్. ఎంత పెట్రోల్ కాలుతుందో, ఎంత కాఫీ హరించిపోతుందో, ఎన్ని వేళ్ళ పోస్టల్ కాయితాలు ధ్వంసమౌతాయో ఎవరికీ తెలియదు. చివరికి లెక్కలు చూసేసరికి గుండెలు అవిసిపోతాయి!"

"ఊహూం! పెళ్ళంత తతంగం అన్నమాట!"

"పది పెళ్ళిళ్ళంత! దిగితే గానీ తెలీదండి దాని లోతు! దిగి లేవటమే క్లేశం!"

"ఎందుకని! నాకేం డబ్బు లేదనా?" వరదరాజు కొంచెం తీవిగా అన్నాడు.

"డబ్బు లేదనా! అంతమాట నేనెలా అంటానండి. స్వతంత్రించి ఒక్కమాట చెబుతా, కోప్పడకండి. డబ్బుండి చెయ్యదల్చుకుంటే ఇంతకంటే మంచిపన్లు కౌన్సిలర్ కాకుండానే చెయ్యవచ్చునండి, ఒక్కసారి కౌన్సిలర్ కావటానికి చేసే ఖర్చుతో, నాలుగు రోడ్లు వేయించవచ్చు. మూడు ధర్మసత్రాలు కట్టవచ్చు. ఓ అనాధ శరణాలయం, ఓ ప్రసూతివైద్యశాల ఏళ్ళ తరబడి, ఎవరి విరాళాలూ అక్కర లేకుండా నిక్షేపం[illegible] నడుస్తాయి."

వరదరాజు తిరిగి పకపక నవ్వాడు, "అవన్నీ చెయ్యవచ్చులే...కాని, ఇలా ఎందు కెగబడుతున్నారు, వార్డుకి నలుగురూ? వాళ్ళకి తెలియదా ఈపాటి?"

బ్రహ్మానందం తల గోక్కున్నాడు. "అంతే......అంతే. కానివ్వండి. కౌన్సిలరయి కూడా మంచిపన్లు చెయ్యవచ్చు. అధికారం వుంటుందాయెను!" అని సర్దేశాడు.

వరదరాజు, "శాస్త్రి వున్నాడు మన తరఫున. మనకేం ఫర్వాలేదు. ఇంకేదైనా సలహా కావల్సివస్తే మీరున్నారాయె... రాయటానికి చెయ్యటానికి—నాకేం భయం! డబ్బంటారా! మక్కను తంతే రాల్తది...అదిసరే పంతులుగారూ! మొన్న కొన్న వాగన్లేమైనాయి?"

"అక్కడే ఒకరు మన వాగన్లకి, టన్నుకి ఇంత అని లాభం ఇచ్చి మళ్ళీ కొన్నారు. మొత్తం పదివేలుదాకా లాభం రావచ్చు. ఇంకా బేరం పరిష్కారం కాలేదు...కాసేపటికి టెలిగ్రాం రావొచ్చు" అన్నాడు బ్రహ్మానందం తడుముకుంటూ.

"ఇది భలే బేరమండి. మనం ఇందులో దిగినాక ఇంతవరకూ మనకి కానీ నష్టం రాలేదు. వెధవ డబ్బు, వొద్దన్నకొద్దీ వస్తుంది." అన్నాడు విరక్తిగా. అత నెందుకో డబ్బు అంటే సరి, విసుక్కుంటున్నాడు. తన ఇనప్పెట్టెలో డబ్బు ఎంతకీ తరగదాయె; ఎంత ఖర్చుకీ వ్యాపారంలో డబ్బే సరిపోతున్నది...ఇవ్వాళ మేడ కొన్న డబ్బు పాతిక వేలూ, ఈ నెలలో రెండు తఫాలుగా అప్పుడే వచ్చేసింది...దీన్ని ఎలక్షన్‌లోనైనా వొదిలించెయ్యాలి... ఛట్...మతి పోతున్నది!...

బ్రహ్మానందం తన షావుకారువంక వింతగా చూస్తున్నాడు. ఏమి టితను? అందరూ లాభాలు రావాలే అని గోల పెడుతూంటే,

ఇతను నష్టం రాలేదని, దిగులుపడుతున్నా డేమిటి?...ఇదొక తర్కం కాబోలు...

వరదరాజు దారే పోయ్యే రిక్షా ఆపి బ్రహ్మానందంవైపు తిరిగి, "నా బదులు మీరే అన్నీ పూర్తిచేసిరండి అక్కడ. నాకు వేరేపని వుంది, వెళ్ళొస్తా" అంటూ రిక్షా ఎక్కి వెళ్ళిపోయ్యాడు.

బ్రహ్మానందం ఒక నిమిషం కొయ్యబారిపోయాడు. ఏమిటిది!...

వరదరాజు సరాసరి పచ్చమేడకి వెళ్ళాడు. కాసేపు కుర్రాడితో ఆడుకుందా మనిపించిందతనికి. అప్పటికిగాని కొంత మనశ్శాంతి చిక్కదు.... వెధవ మనుషులు, వెధవ డబ్బు....జిడ్డులా పట్టుకున్నాయి. గది తలుపు తీసి లోపలికి వెళ్ళాడు. పది నిమిషాలకి చిన్నా మెల్లిగా వొచ్చి "మామా!" అన్నాడు.

వరదరాజు కుర్రాణ్ణి అందిపుచ్చుకుని, ఎగా దిగా చూశాడు. ఎంత నిర్మలంగా ఎంత కాంతిగా వున్నాయి ఆ కళ్లు! ఏ మోసమూ ఏ వంచనా లేని యథార్థమైన చిరునవ్వును అతను రెండుచోట్ల చూశాడు. రత్తమ్మ అలా నవ్వగలదు. చిన్నా అలా నవ్వుతాడు; మిగతావాళ్ళ నవ్వుల వెనక ఏదో మలినం, ఏదో వెర్రిభీతి కనిపిస్తాయి...కనకవల్లి నవ్వితే అతను అసలే భరించలేడు.... తందామనిపిస్తుంది...

"నవ్వు చిన్నా! నవ్వు!" అన్నాడతను కుర్రాణ్ణి తొడమీద కూర్చోబెట్టుకుని, తల నిమురుతూ.

కుర్రాడు కొంచెం బలహీనంగా, నీరసంగా వున్నాడు. వొళ్లు వెచ్చగావుంది. అయినా వరదరాజు 'నవ్వు' అనగానే అలాగే నీరసంగా నవ్వి, "మామా నొప్పి..." అని వొళ్ళు చూపించాడు.

వరదరాజుకి కుర్రాడి వొళ్లు వేడి నీరసం అర్థం అయ్యాయి. "అరెరె! జ్వరం తగుల్తోంది బాబూ! మందు తాగావా?" అని ప్రేమగా కుర్రాణ్ణింకా ఎదలోకి హత్తుకుని, బుగ్గన ముద్దెట్టుకుని ప్రశ్నించాడు;

కుర్రాడు మొహం చిట్లించి, "ఛీ—థూ...అమ్మ..." అన్నాడు; అతని సౌజ్ఞ అమ్మ మందుపోసింది బాగుండలేదని. కుర్రాడి మొహమే చెబుతోంది—ఆ అర్థాన్ని.

వరదరాజు నవ్వాడుగాని, అతని కేదో కలతగావుంది... కుర్రాడేమిటి చిక్కినట్టున్నాడు, సరిగ్గా మందిప్పిస్తున్నారో లేదో..."బాబూ, వుండు..." అని కుర్రాణ్ణి కిందికి దించి, దొడ్లోకి వెళ్ళాడు. దొడ్లో పత్తిమొక్క పక్కనే నుంచుని, "ఏమమ్మా! ఏమమ్మా," అని పిల్చాడు, కొంచెం జంకుతూనే.

కుర్రాడికోసం కనిపెట్టుకుని నుల్చున్న చిన్నా తల్లి, కొంచెం సిగ్గుపడుతూ, "ఏమిటండి అన్నయ్యగారూ పిల్చారా?" అంది, తలుపవతలే నిలబడి.

"అవునమ్మా! బాబుకి సుస్తీగా వున్నట్టుంది, డాక్టర్ కి చూపించారా!" అని ప్రశ్నించాడు వరదరాజు, ఆ తలుపువంక చూస్తూ. పదకొండు గంటల ఎండ పొడకి కొబ్బరిచెట్టు నీడ తలుపు మీద కదుల్తోంది. దొడ్డంతా పచ్చగావుంది.

"డాక్టరా! ధర్మాస్పత్రి మందు పోశాం..."

వరదరాజు "నేను మంచి డాక్టర్ కి చూపించుకొస్తానండి" అనేసి సమాధానంకోసం ఎదురుచూస్తూ నుల్చున్నాడు.

ఆమె లోపలికివెళ్ళి ఐదారు నిమిషాలకల్లా తిరిగివొచ్చి, "అదేమంత భయపడవల్సిన సుస్తీకాదండి, చడామడా తిన్నాడు, కొంత అజీర్తి చేసింది అంతే" అన్నది.

వరదరాజు, "అయినా..." అని ఇంకేదో అనబోయినాడు. కాని ఆమె వినిపించుకోలేదు. "రెండురోజులు కొంత కాక తగిలి దానంతట అదే పోతుంది" అని, "చిన్నా! రా బాబు, కొంత జావ తాగుదువుగాని" అని పిల్చింది.

కుర్రాడు బిక్కమొహంపెట్టి, అతనికేసి చూస్తూ లోపలికి వెళ్ళాడు.

వరదరాజుకి ఎందుకో చిరాకు కలిగింది. తన గదిలోకివెళ్ళి అల్మారాతీసి జాగ్రతచేసి వుంచిన సీసా ఒకటి అందుకుని ఒక గ్లాసులో పోసుకుని నాలుగు గుక్కలు తాగి కలతగావున్న మనస్సు స్థిమితపర్చుకుని ఎక్కడికి పోవటమా అని ఆలోచించాడు ఒక క్షణం, గడపమీద నుల్చుని. చివరికి అతను, అల్మారాలోంచి పేక తీసి జేబులో పెట్టుకుని మొగల్రాజపురం మండపం చేరుకున్నాడు.

మండపం ఇప్పుడు నిర్మానుష్యంగా వుంది. దుమ్ముకొట్టుకొని వుంది. ఎంగిలి బీడీలు పడివున్నాయి. వింజామరం వేస్తున్న శిల్పసుందరిమీద, శిథిలమౌతున్న పైకప్పు రంధ్రాల్లోంచి ఎండ చారలు పడి మెరుస్తున్నాయి.

వరదరాజు లోపలి స్తంభాల్లో ఒకదాన్నానుకుని కూర్చుని, జేబులోనుంచి పేకముక్కలు తీసి ముందు పరుచుకుంటూ వినోదించసాగాడు, అతని అంతస్సు ఎంతో నిర్మలంగా శాంతిగా వుందిప్పుడు.

44

సదానందం తనవరకు చాలా కులాసాగావున్నాడీమధ్య. శ్యామల వైఖరివల్ల అతని జీవితంలో కొత్త ఆశలు చిగిర్చాయి. ఆమె రోజూ సాయంత్రంవేళ అతన్ని కలుసుకుని మాట్లాడుతుంది. వాళ్ల సంభాషణ వివిధ విషయాలమీదికి పోయి చివరికి ఎలక్షన్ల మీదికి వొచ్చేది. సదానందానికి ఎలక్షన్ అంటే అంత ఆసక్తి లేదు.

అతను పార్కు గోడకానుకుని నుల్చుని, లోపల ఆవరణలో పెరగలేక పెరుగుతూన్న మొక్కల్ని చూపుతూ, "మనవాళ్ల సేవ ఇలా ఫలిస్తూ ఉంటుందండి! ఏదైనా ఇంతే!" అన్నాడు.

శ్యామల నవ్వి, "ఈ పార్కు వేసింది లగాయతు చూస్తున్నాను, ఈ మొక్కల్ని మేకలు తినని రోజు లేదు, తోలే దిక్కు లేదు!" అంది. ఆమె సదానందంవేపు చూసే చూపుకి ఏమర్థం ఉంటుందో, ఆమెకే తెలియాలి. దాన్ని సదానందం మాత్రం అదినించీ ప్రేమగానే అర్థం చేసుకుంటున్నాడు.

సదానందం, "ఏమండి, మీరు స్వేచ్ఛగా నాతో మాట్లాడుతూ వుంటారుగదా, మీవాళ్ళు అభ్యంతరపెట్టరూ?" అన్నాడు ఉండి ఉండి.

శ్యామల సదానందంవేపు విచిత్రంగా చూసింది. "నాకెప్పుడూ ఎలాంటి ఆటంకమూ రాలేదండి, మా యింట్లో! ఏం తప్పు చేస్తున్నానని!" అంది నిక్కచ్చిగా.

"అయితే మీ నాన్నగారు మంచి సంస్కారం కలవారన్న మాట!"

"నిజమండి. అయినా, మన సంస్కారం కూడా మంచిదయితే గాని..." అని ఆగిపోయిందామె. తర్వాత విషయం మారుస్తూ, "మీరీతడవ ఈ వార్డులో ఎన్నికలకి నిలబడతారని డాక్టర్ గారివ్వాళ అన్నారే! నిజమేనా?" అని ప్రశ్నించింది.

"నిలబడాలని వుందిగానీండి, తాడూ బొంగరం లేనివాణ్ణి, ఎలా నిలుస్తాను, నిలిస్తేమాత్రం ఎలా గెలుస్తాను!" అన్నాడు నవ్వుతూ.

వాతావరణం చలి బారుతూవుంది. పశ్చిమాకాశం ముదురు ఎరుపులోంచి నీలవర్ణంలోకి మారుతోంది. శ్యామల నిండైన అందమైన విగ్రహం, ప్రకృతిలోని అందమైన ఓ పుష్పంలా కన్పిస్తోం

సదానందానికి. పార్కులోని క్రోటన్సు మొక్కల పచ్చదనం పక్కనే నుల్చున్న ఆమె వనదేవతలా కన్పిస్తోంది. ఆమె బరువైన కనురెప్పల్ని, నవ్వుతూంటే వెలిగే ఎర్రని పెదాల మధ్య తెల్లని ముత్యాల పలువరసల్ని, వొంటికి అతుక్కున్నట్టు కట్టుకున్న సిల్కుచీర చాటున మెరిసే శరీరపు వొంపుసొంపుల్ని సదానందం ఎంత చూసీ తృప్తిపడలేకపోతున్నాడు. ఆమెతో మాట్లాడి తన కోర్కెను తెలియబరచాలని అతనెంత కుతూహలపడుతున్నా, సమయానికి గొంతుక తడి ఆరి మాట రావడంలేదు.

శ్యామల సదానందం ఏదో బాధపడుతున్నాడని మాత్రం గ్రహించింది. కాని అదేదో ఆమె కర్థంకావటంలేదు. అది 'ప్రేమ' జబ్బే ననుకోటానికి ఆమె కాస్కారం లేదు. సదానందం అందరి వంటి మనిషి కాడు. కొంచెం ఉన్నతమైన భావాలు కలవాడు – ముఖ్యంగా చిత్రకారుడు. అతనికి ఆర్థికబాధేమో...అది తను నివారించలేదు. అటువంటప్పుడు ఆ ప్రసక్తే తీసుకురావడం అనవసరం.

“ఏమండీ! పొద్దుకూకింది ఇంటికి పోదామా?” అన్నదామె.

“పదండి... నేనూ పెందరాళే ఇంటికి వెళ్ళాలె. నాన్నగార్కి వొంట్లో ఏమంత బాగుండడం లేదు...” అంటూ సదానందం బయల్దేరాడు.

అతను ఇంటికొచ్చేప్పటికి రంగయ్యగారు దొడ్లో గుడ్డి వెన్నెట్లో మునగచెట్టుకింద నుల్చుని వున్నాడు. ఆయన కక్కడ నుల్చోడం అలవాటయింది. ఏమిటో ధోరణిగా మాట్లాడుతున్నాడు. సదానందం ఆయన్ని మెల్లిగా తీసుకొచ్చి ఇంట్లో కూర్చోపెట్టాడు.

రంగయ్యగారు మసకలాంతరు వెలుగులో రేగిన తెల్లబారిన జుట్టు చేత్తో సవరించుకుంటూ, “కరుణామూర్తి! నా రెండొందలివ్వవూ? మా అమ్మాయికి పంపించాలయ్యా! నువ్వెందు కిస్తావులే. నీది వ్యాపారం కాదూ?...పోగుచెయ్యి...పోగుచెయ్యి... నావంటివాడి డబ్బు పోగుచేస్తే గాని నీకు మేడలు రావు...”

సదానందం ఈ వాగుడంతా వింటూ తన బల్లముందు కూర్చుని, ఆలోచిస్తున్నాడు, ఎలక్షన్ సంగతి. నామినేషను పడెయ్యమని డాక్టర్ గారన్నాడు. ఏభై రూపాయలు తానిస్తానన్నాడాయన...ఆయనదంతా అదోక తత్వం...

...ఈ వార్డుకి ఎవరో బాగా డబ్బున్న ఒకాయన్ని దీపం పార్టీవాళ్ళు నిలబెడుతున్నారని ఉదయం ఎడిటర్ గారన్నాడు. కొత్తగా పార్టీలో చేరాడట...పార్టీకి విరాళంగా ఐదు వేలు ఇచ్చాడట...ఆయన్ని ఒక్క వరసన పొగుడుతున్నారందరూ...డబ్బే.. అంతా డబ్బుమయం...

నాలుగురోజులు జరిగాయి. విజయవాడలో ఖాళీ గోడంటూ ఎక్కడా లేదు...ఎలక్షన్ ప్రచారం ప్రారంభమైంది. సదానందం మనస్సులో ఎన్ని కలతలున్నా ఎలక్షన్లో నిలబడి ప్రచారం ప్రారంభించగానే అన్నీ మర్చిపోయినాడు.

ఇంట్లో ఒకటుంటే ఒకటి లేదు. రంగయ్యగారికి పిచ్చి బాగా ముదిరింది. వరలక్ష్మమ్మగారు, రాత్రి ఏ వేళటికి వొచ్చినా కొడుకుతో అన్నీ మొత్తుకుంటున్నది. సదానందం అన్నీ విని “ఎప్పుడూ ఉన్న దేకదమ్మా, ఈ సోది! ఏం చెయ్యమన్నావు... ఇప్పుడా పత్రికవాళ్లు కూడా డబ్బు లివ్వటంలేదు...” అన్నాడు.

“ఎట్లా బావునురా! ఇంట్లో ఏమీ లేవయ్యె. బియ్యంలేవు... పప్పులేదు...నెయ్యిమాట కేం, అసలు వేసుకోటమే మానేశాగా!.. రేపు పొద్దు ఎలా వెళ్తుందిరా? నువ్వేమో, ఉదయంవెళ్ళి అర్థరాత్రి కొస్తుంటివి...” అంది తల్లి బాధగా.

కొడుకు మౌనం వహించాడు. జేబులో లేనిది ఏం సమాధానం చెపుతాడు?

“అదికాదురా, నాయనా! ఇంట్లో సామానైనా తాకట్టు పెట్టి డబ్బు పట్టుకురారా! మీ నాన్నగారు ఉసూరుమని పక్కుంటే చూస్తూ ఎలా వూరుకునేదిరా?...

“అబ్బ! తెస్తాలేవే...మతిపోతోంది...ఉదయం ఎట్లాగో చూసి తెస్తాలేవే. బ్రహ్మానందాన్ని కలుసుకుని చాలా రోజులైంది...” చాలా బాధగా అన్నాడు కొడుకు.

“సరేలే నాయనా, పోయి పడుకో. పగలల్లా తిరిగి తిరిగి వొచ్చావు...” అంది తల్లి. సదానందం, పక్కమీద పడుకున్నాడు. తల్లి దుప్పటి కప్పుతూ, “మా నాయన కెన్ని కష్టాలొచ్చాయిరా...నా కడుపున పుట్టినందుకు అన్నీ బాధలే...” అంది, అతని తల నిమురుతూ.

రంగయ్యగారు కూడా నిద్రపట్టక కలవరిస్తున్నాడు.

తెల్లారి సదానందం మొదటిపనిగా బ్రహ్మానందం ఇంటికెళ్లాడు. అప్పుడు ఉదయం ఏడుగంటలవుతోంది. బ్రహ్మానందం వీధి అరుగుమీద కూర్చునివున్నాడు. “ఏమిగోయ్! బహుకాల దర్శనం!” అన్నాడు. పచ్చని ఎండపొడ ఉభయులమీదా పడుతోంది.

“ఏమిటోరా! ఎవడి సంసారం వాడిదైపోయేటప్పటికి ఎవడి జ్ఞాపకం వాడిదైపోయింది—క్షణం తీరికలేదు—దంబిడీ ఆదా లేదు అన్నట్టుంది నా స్థితి ... నీపని ఫర్వాలేదనుకుంటానే!” అన్నాడు సదానందం, అరుగుమీద కూర్చుంటూ.

బ్రహ్మానందం, “అదే బాగులే. ఏదో గంజినీళ్ళకి కరువులేకండా నెట్టుకొస్తున్నాను. నువ్వేం చేస్తున్నట్టు? నాన్న కులాసా?” అని ప్రశ్నించాడు ఆప్యాయంగా.

“నేనా! నేను ఓ డాక్టర్ దగ్గర కంపౌండర్ పని చేస్తున్నానులే. గంజికేనా చాలని సంపాదన!”

బ్రహ్మానందం స్నేహితుణ్ని పరికించి చూశాడు. వెనకటి కళ మొహంలో లేదు. క్రాపు పెరిగి పెరిగివుంది. ఇస్త్రీ మడత చెరిగితే సహించలేని తన మిత్రుడు అక్కడక్కడ చిరుగులుపడ్డ చొక్కా పంచె కట్టాడు...

“ఏమిటిరా ఇలా వున్నావు...నాన్నగార్ని ఉద్యోగంనించి తీసేశారుట, ఏం కారణం?”

సదానందం తన స్థితిని తనతండ్రిస్థితిని వర్ణించాడు. “కాలం మారిందోయ్; మా నాన్న దానికి సరిపెట్టుకోలేక మతి పోగొట్టుకున్నారు...నేనేమో మతి వుండి లేనట్టుగా తిరుగుతున్నాను... మధ్య ఈ బాధలు చాలవని ఎలక్షన్ గొడవలోకి కూడా దిగాను... దానికి....”ఆపైన ఏం చెప్పాలో ఆలోచిస్తూ వూరుకున్నాడతను.

“అదేమిట్రోయ్! ఉన్నవాడికీ లేనివాడికీ కూడా ఇదొక హాబీగా వున్నట్టుందే మానే! నువ్వుకూడా నిలబడ్డావా అంటే...చిత్రం! ఏమిటో వివరాలు కాస్త చెవిని వెయ్యి నాయనా!” అన్నాడతను ఆశ్చర్యంగా.

“ఏదో లేరా! మా డాక్టర్ గారి ప్రోత్సాహం కొంత. నా ఆదర్శపు పైత్యం కొంత-కలసి ఈ వ్యవహారం-ఆ వార్డులో కొంతమంది యువకులు కూడా కలిశారు. ప్రచారమంతా స్వచ్ఛందంగా జరుగుతోందిలే. దానికి దంబిడీ ఖర్చులేదు. కాకపోతే!...” సదానందం పూర్తిచెయ్యకముందే బ్రహ్మానందం అడ్డం వచ్చాడు “డబ్బు లేకండా ఎలక్షనేమిటిరా నీ మొహం! నీకు ఏం చూసి వేస్తారు ఓట్లు? వోటర్లదాకా వొద్దు—నువ్వా ఎలక్షన్లో నిలబడ్డావని ఆ వార్డు వోటర్లకి తెలియాలా అసలు? ఎన్ని పోస్టర్లు గావాలి! ఎన్ని బహిరంగ సభలు ఏర్పాటు చెయ్యాలి! మా షావుకారూ మీ వార్డులోనే నిలబడ్డాడు. దీపం పార్టీ తరఫున నిలబడుతున్నందుకు పార్టీకి ఐదు వేలు విరాళం ఇచ్చాడు. ఇంకో ఐదు వేలు ఖర్చుపెడుతున్నాడు. ఊం అంటే డబ్బు—ఆఁ అంటే డబ్బు!...మా షావుకారుకేంలే...డబ్బు చాలా వుంది. అవసరమనుకుంటే వోటుకి పదనా జంకడు, పాతికనా భయపడు...అతనికి ప్రత్యర్థివా, నువ్వ! నీకేమన్నా పిచ్చా యేమిటి?...”

★ అపస్వరాలు ★

సదానందం, "అక్కడే వుంది తిరుగుడు. నేను ఆదర్శాలూ, ఆచరణ చూసి వోటు వెయ్యమని అడుగుతున్నాను. నీ పావుకొలు డబ్బు దూపుతాడు గావును...ఏమౌతుందో లే. ఇదిగో ఇవ్వాళ నుంచి నేనూ, ఇంకో పదిమందీ కలిసి ఆ వార్డులోని వోటర్లందర్నీ కలుసుకోవాలి...అప్పుడుగాని చెప్పలేనురా" అన్నాడు.

"ఇవన్నీ గాలి పోగుచెయ్యడంలాంటి పనుల్లే! అది సరేకాని ఏదో పని వుండి ఇటొచ్చినట్టున్నావు!" అని ప్రశ్నించాడు.

"ఆఁ! ఏమీ లేదు! ఒక్క ఐదు రూపాయలుంటే ఇవ్వు. ఓ వారం రోజుల్లో సర్దుతాను" అన్నాడు సదానందం.

"ఇస్తాలే. పద. ఎక్కడైనా కాస్త కాఫీ తాగివద్దాం" అన్నాడు బ్రహ్మానందం, లోపలికెళ్ళి చొక్కా వేసుకొచ్చి.

"ఊఁ. కాఫీ వొద్దనటం భావ్యం కాదు" అంటూ బయల్దేరాడు. మున్సిపల్ ఎలెక్షన్ కాండిడేటు.

45

దీపం పార్టీ కార్యాలయంలో ఎలక్షన్ సమావేశంలో పాల్గొని బయటపడ్డాడు వరదరాజు. బయట కొచ్చేటప్పటికి మధ్యాహ్నం మూడుగంటలవుతోంది. శాస్త్రి కరుణమూర్తి లోపలే వున్నారు. అతనుమాత్రం పచ్చమేడకి బయల్దేరాడు. దారిలో కన పడ్డ హోటల్లోకెళ్ళి కాఫీ తాగాడు. హోటల్లోకూడా రెండు మూడు ఎలక్షన్ బోర్డులు కన్పించాయి. అతనికి నవ్వొచ్చింది. కాఫీ తాగుతూ హోటల్ గోడమీద పాలడబ్బా అడ్వర్ టైజ్ మెంటు మీద పసివాడి బొమ్మచూసి చిన్నాని జ్ఞాపకం చేసుకున్నాడు. ఎలావున్నాడో కుర్రాడు! నాలుగైదురోజులైంది అటు వెళ్ళి...ఈ వెధవగొడవలో అటు వెళ్లడమే పడలేదు.

అతను బైటికొచ్చి రిక్షా ఎక్కి పచ్చమేడ దగ్గర కెళ్ళాడు, గదిలో కూర్చుని రెండుమూడుసార్లు 'చిన్నా' అని కేక వేశాడు. కుర్రాడు పలకలేదు. లోపల్నించి, కుర్రాడి తల్లి జవాబిచ్చింది— కుర్రాడికి సుస్తీ ఎక్కువగా వుందనీ, అలసి నిద్రపోతున్నాడనీ.

వరదరాజు, "ఒకసారి లోపలికొచ్చి చూస్తానండి" అన్నాడు వినయంగా.

"రండి! దానికేం" అంది ఆమె.

అతను లోపలికి వెళ్ళాడు. ఇల్లు పరిశుభ్రంగా వుంది. నిరాడంబరంగానూ వుంది. ఇంటి యజమాని ఫోటో గోడకి వేళ్ళాడుతోంది. కుర్రాడి తల్లి వంటింట్లోకి వెళ్ళిపోయింది. వరదరాజు మధ్య గదిలో మంచంమీద పడుకునివున్న కుర్రాణ్ణి దగ్గరకెళ్ళి చూశాడు.

నిద్రపోతున్నా కుర్రాడి చిలిపితనం నుదుట కన్పిస్తూనేవుంది వొళ్ళు వెచ్చగా కాలిపోతోంది "వొద్దే! అమ్మా! మందు వొద్దే" అంటూ నిద్రలో కలవరిస్తున్నాడు.

వరదరాజు కుర్రాడి తల నిమిరి, "మంచి డాక్టర్కి చూపించండమ్మా!" అన్నాడు వంటింటివేపు చూస్తూ.

"అలాగేనండి అన్నయ్యా. ఏదో మా శక్తికొద్దీ!" అందామె.

వరదరాజుకి ఇంకా కాసేపు అక్కడే వుండి కుర్రాడు లేచిం తర్వాత చూసిపోవాలనివున్నది గాని, మర్యాదగా తోచలేదు. "వెళ్తున్నానమ్మా, చిన్నాని జాగ్రత్తగా చూడండి!" అంటూ బయటికొచ్చాడు.

గడపబైట ఏడుకొండలు నిలబడివున్నాడు.

"ఏంట్రా! ఈడకొచ్చావు?" అని ప్రశ్నించాడు వరదరాజు.

"నిన్న కోటిగాడి కేందో చెప్పి పంపించావు! ఏంది యెవారం?" అన్నాడు ఏడుకొండలు.

"అదా! సత్యనారాయణపురంలో ఎలక్షన్ గదంట్రా! అందు కని ఓమాటు నిన్ను రమ్మన్నా లే. ఇంకేం లేదు!" అన్నాడు వరదరాజు.

ఏడుకొండలు "పోదాం పా. నిలబడి ఎందేపు మాట్లాడతాం! అంటూ నడవసాగాడు. వరదరాజు అతనిపక్కనే నడుస్తూ, "మనం గూడా ఎలక్షన్లో నిలబడ్డాం లే. ఇప్పట్నించీ ఓ టీకొట్టు...సత్యనారాయణపురంలో పెట్రా: వోటర్లకి బాగా కాఫీటిఫిన్లు మెక్కబెట్టాల. అప్పుడే మనం గెలుస్తాం. ఏమంటావు?" అన్నాడు.

"ఇంకో ధర్మసత్రం పెట్టాలెట్టా! చెప్పవూ?" అన్నాడు ఏడుకొండలు మంటగా.

వరదరాజుకి ఏడుకొండలు మాటలకి నవ్వొచ్చింది. పగలబడి నవ్వాడు. "ఒరే, నీకంతా మంటగా వుంటది గాని, కాఫీనా పోయించకపోతే వోట్లు వొస్తాయంట్రా పిచ్చిమొదవ! అంతా డబ్బుతోనే వుందిరా లోకం" అన్నాడు. అతని కిమధ్య డబ్బు విలువ బాగా తెలిసొస్తున్నది.

ఏడుకొండలు, "అయినా నేనో మాట అడుగుతా కోప్పడకండా వింటావంట్రా? నీకెందు కొచ్చిందిరా ఈ ఎలచ్చను గొడవ? తిని తిరక్క?" అన్నాడు.

"ఒరే పోరా, నీకేం తెలుసు? ఇప్పుడు అందరూ చేసే అన్ని పన్లకీ అర్థం వుందంటావ్? ఏందో, అదో సర్దా! డబ్బే వుండాలి గాని, పని చెయ్యకూడదురా? మనకేం పెళ్లామా బిడ్డలా? ఓరు తినమురా ఇదంతా! మొన్న గూడకపోతివి! ఆ పార్టీ ఆఫీసుకాడికి పోతివి; చాలా గొప్పోళ్లు కూసున్నారాడ; అందరూ లక్షాధికార్లు మల్లేనే వుండారు; డబ్బుతో జూదమాడుతున్నారురా! వాళ్ళు అడగంగానే నేను ఆ పార్టీకి ఐదు వేలూ పారేసినా. ఇంకేందుకులే, నాకు పూలదండలేసి, జైలుకొట్టి ఓ! ఎంత గౌరవం చేశారనుకున్నా! ఇప్పుడేం వెనకటి వరదరాజనుకున్నావంట్రా నన్ను! నాల్రోజులు పోనీ, కౌన్సిలర్ —!ఊం!"

ఏడుకొండలు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. అతనికిదంతా అయోమయంగానూ గందరగోళంగానూ వుంది.

వరదరాజు "ఒరే ఒక్కమాట చెబుతా విను. నిజంగా నువ్వు మంచివాడివై చేసేదేం లేదురా, నేను చూస్తున్నాగా. మంచాళ్లకి కూడు పుట్టడంలేదు; శాస్త్రిని ఎరుగుదువుగా! అంత దగుల్బాజీ యాడున్నా వున్నాడూ! ఆడి కెంత పలుకుబడి, ఎంత గౌరవం చూసినావు? అంతా డబ్బు మహాత్మ్యమే! అవసరం మనదా! మనం తెలిసి ఎవడికీ మోసం చెయ్యడంలేదు. డబ్బున్నాది. దాన్ని చూస్తే అంతా అంటుకుపోతున్నాది. అంతే. డబ్బు పోతుందంటావా! నీ తాత సొమ్మా, నా తాత సొమ్మా!" అన్నాడు హేళనగా.

"అది కాదు వరదా! ఆస్తి పోనకో ముందు చూసుకొని దిగరా! చేతిలో తడారిపోతే మనవాళ్లు కుక్కలు పడవు!" అన్నాడు ఏడుకొండలు.

"ఆ ఆలోచన నాకు లేదంటా! ఒక తమాషా. నే నింత వరకూ ఖర్చు పెట్టిన డబ్బంతా యాపారంమీద సంపాయించిందే! అసలు —మనం పట్నంలో సూర్చుకొచ్చిందాన్లో ఒక్క పైసా కూడా ఖర్చు కానేలేదు. అదంతా అలాగే మూలుగుతోంది." అన్నాడు వరదరాజు కొంత ఆశ్చర్యంతో, కొంత బాధతో.

"అట్టాగంట్రా! అయితే పోనీలే. మరి నీ వార్డులో టీకొట్టు ఎప్పుడు పెట్టమన్నావు?"

"ఆ వ్యవహారమంతా నేను చూసి నీకు కబురు చేస్తాగా!

"నేను ఇటు వనిత్తుంది వెళ్ళాక సుబ్బయ్య తో కొస్తాను పోదాం!" అన్నాడు వరదరాజు.

ఏడుకొండలు వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. వరదరాజు శరాశరి మొగల్రాజపురం మండపానికి వెళ్ళి పొద్దుకూకేంతవరకూ అక్కడే కూర్చున్నాడు.

ఆ మర్నాడు వరదరాజూ, శాస్త్రిగారూ, దీపం పార్టీ 'ప్రసన్న' ఎడిటర్ వినాయక రావుగారూ, ఎలక్షన్ ప్రచారం సందర్భంలో సత్యనారాయణపురంలో వోటర్లని కలుసుకోడానికి బయల్దేరారు.

కొత్తగా కొన్న కారు మెత్తగా పోతోంది. కార్లో సంభాషణ సాగుతోంది. చలికాలపు ఎండ మార్దవంగా కారు అద్దాల్లో నుండా లోపలికి ప్రసరిస్తోంది. కారులోని మెత్తని సీట్లమీద సౌకర్యంగా సుఖంగా కూర్చుని, రోడ్డు కిరువేపులా చూస్తూ ముగ్గురూ మాట్లాడుతున్నారు.

శాస్త్రిగారు, అన్నాడు "ఓటర్లనందర్నీ ఒక్క చోట కూడగట్టి మాట్లాడితే సరిపోదండీ, రావుగారూ! ప్రతివాడి ఇంటికీ వెళ్ళాలంటే కష్టం. ఇంకొకటి చూశారూ, ఆ కొంపలు...మరీ అపరిశుభ్రంగావుంటాయి. లోపల అడుగుపెట్టటానికి మనస్కరించదు."

వరదరాజు శాస్త్రిగారి వేపు చూశాడు. వసంతం ఇంట్లో కులాసాగా గడిపే పెద్దమనిషేనా ఈమాటలు మాట్లాడుతున్నది? అతను వూరుకున్నాడు పైకేమీ అనకుండా.

రావుగారన్నాడు: "బయటే నిలబడి పిలిపించి మాట్లాడదాం లెండి. ఈ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడ్డ అతను, ప్రతివాణ్ణీ వెళ్ళి కౌగలించుకుని మరీ అడుగుతున్నాట్ట. మనం గూడా కనీసం అలా అడక్కపోతే కుదరదండి!" అన్నాడు.

వరదరాజు సత్యనారాయణపురం పార్కు వేపు తిరిగి సిగరెట్టు పొగ వొదుల్తూ, "వెళ్ళొచ్చులెండి, వాళ్ళేం మనుషులు గాదా, అవేం ఇళ్ళు గావా! మీరు బైట నిలబడండి. నేను లోపలికెళ్ళి మాట్లాడుతాను సరా!" అన్నాడు గంభీరంగా.

శాస్త్రిగారికి షాక్ తగిలినట్టయింది. ఇతనితో ప్రతిదీ పేచీగా నేవుంది. ఎప్పుడు ఎలా మాట్లాడతాడో ఊహించడం అసాధ్యం. ఆవేళ పార్టీ విరాళం నూటపదహారిస్తే సరిపొయ్యేదానికి వొక్కసారి ఐదువేలు ఇచ్చాడు. పార్టీలో ఇప్పుడు ఏ ఇతరుడికీ లేని పలుకుబడి ఇతనికి..."వరదరాజు గారూ! మీ రన్నమాట సబబుగా వుంది. అభ్యర్థి మీరూ! మేం పైవాళ్ళమేగా! మీరే గనక స్వయంగా ప్రతివాడ్నీ కలుసుకుని అడిగారూ అంటే, ఇంక గెలవటంలో ఆశ్చర్యం వుండదు!" అన్నాడాయన.

"నేనూ ఆమాటే చెప్పా వరదరాజుగార్కి" అన్నాడు వినాయక రావు గారు సర్దుతూ.

కారు ఒక గతుకులరోడ్డులో ప్రవేశించి, గూడెం మొగదల ఆగిపోయింది. శాస్త్రిగారు వోటర్లలిస్టు తీసుకుని, "ఇదుగోనండి, ఈ పూరింట్లో ఒకాయన వున్నాడు...వున్నాడేమో చూద్దాం" అన్నాడు.

అక్కడ్నించి వరసగానూ, మధ్యమధ్య నీటి గోతులలోనూ, దుర్గంధ భూయిష్టమైన మురికినీటి కాలవలలోనూ, ఆ ప్రాంతం ఆధునిక నాగరికతకీ, మానవాభ్యుదయ చరిత్రకే కళంకంగా కనపడుతోంది

శాస్త్రిగారు చేతిగుడ్డ ముక్కుకు అడ్డంపెట్టుకుని నిలబడ్డాడు కారును ఆనుకుని. ఎడిటర్ గారూ పక్కనే నిలబడ్డాడు. వరదరాజు ఆ యింటిని పరిసరాన్నీ చూస్తూ ఇంటి వాకిలిదగ్గిర కెళ్ళి "సుబ్బయ్యగారూ? అన్నాడు.

లోపల్నించి "ఎవరు బాబయ్యా!" అని ఒక హీనస్వరం సమాధానమిచ్చింది.

శాస్త్రిగారు ఎడిటర్ గారితో అన్నాడు: "పిల్చు వినాది కాళ్ళండి."

ఎడిటర్ గారు "ఆ నడకలే చెబుతున్నాయిగా!" అన్నాడు నవ్వుతూ.

వరదరాజు వెనకా ముందూ చూడకుండా తడిక వాకిలి నెట్టుకుని లోపలికి వెళ్ళాడు. గుడిశె ఎత్తు చాలా తక్కువ. గుండ్రంగా వున్నది. లోపల సుబ్బయ్య అన్న వ్యక్తి ఓ చింకిచాపమీద పడుకుని మూలుగుతున్నాడు. అతనూ, ఓ కుండ, ఓ మూడురాళ్ళ పొయ్యి, పక్కన గోడకర్రకి ఓ చింకి పంచె వున్నాయి.

వరదరాజు, "బాబూ, బాగుండావు?" అన్నాడు నవ్వుతూ.

"మీరు కోరండి బాబు! గొప్పోరల్లే వుండారు. ఏం పనిమీ దొచ్చారు?" అని ప్రశ్నించాడు సుబ్బయ్య, లేచి కూర్చుని. అతనికి అరవై ఏళ్లుంటాయి. పొట్టి బొమికల పోగు.

"ఏమీ లేదు. ఈ వార్డుకి ఎలక్షన్ వొచ్చిందిగా! నేను అభ్యర్థిగా నిలబడ్డానే. మీ వోటు" అని ఆపేశాడు వరదరాజు.

సుబ్బయ్య, "ఏం ఎలక్షనో ఏందో బాబు. పోయిం తడవ ఇట్టానే ఇంకో మారాజు వొచ్చి అడిగితే వోటు వేశాం. ఈ గూడెమంతా బాగుచేయిత్తాం అని యేందేందో చెప్పిండు. మళ్ళీ కన పళ్లా! ఇదిగో ఇప్పుడు మీరొచ్చిండ్రు! యేత్తాలే బాబు! వోటు!" అన్నాడతను.

వరదరాజు తృటికాలం పూరికే నిలబడ్డాడు. తర్వాత, అట్లాంటివాణ్ణి కాదులే తాతా! నే నిదంతా ఖచ్చితంగా బాగు చేయిస్తాలే. గెలిసినా సరే, వోడినా సరే" అనేసి, "వత్తున్నా తాతా" అంటూ బైటికి వొచ్చాడు.

దానిపక్కనే ఇంకో గుడిశెదగ్గిర కెళ్లాడు వరదరాజు. లోపల్నించి విపరీతమైన దుర్వాసన వొస్తున్నది. వరదరాజు, "ఇక్కడ లచ్చమ్మంట ఎవరూ?" అన్నాడు, గుడిశెలోకి తొంగిచూస్తూ. గడ్డిమంటలో కాల్చిన ఎండ్రకాయల్ని ఇద్దరు పిల్లలూ, ఒక ఆమే, ఆప్యాయంగా, ఆదుర్దాగా తింటున్నారు లోపల. వరదరాజు గబుక్కున వెనక్కి తిరిగి, బయటే నిలబడి, "లచ్చమ్మా, లచ్చమ్మా" అని కేకేశాడు.

లోపల్నించి ఆ ఆడమనిషి బయటికి వచ్చింది. ఆమె జుట్టు ఎన్నడూ తైలసంస్కారం ఎరగదు. చాలీ చాలని గుడ్డ వొంటికి సంబంధం లేనట్టుగా చుట్టింది. బుగ్గలు పీక్కుపోయినాయి. కళ్లు పసుపుపచ్చగా, మసకబారి వున్నాయి. ఆమె వెనక సన్నగా, వొట్టి శల్యాలుతప్ప ఇంకేమీలేని నల్లని పిల్లలిద్దరు గోచీలు పెట్టి, చింకిరి జుట్టు రెండుచేతులతోనూ గోక్కుంటూ నిలబడి గాబరాగా చూస్తున్నారు.

లచ్చమ్మ, "ఏంది బాబు!" అని ప్రశ్నించింది.

వరదరాజుకి ఏమడగాలో తోచలేదు. "ఎలక్షను గదూ!" అని మాత్రం అనగలిగాడు. అతని అంతరాత్మ అతన్ని వేధిస్తోంది. వీళ్ళూ మానవులే! వీళ్ళిట్లా అయిపోవడానికి ఏం కారణం? ఎండిన డొక్కల్లోనూ, ఆ మసకబారిన కళ్ళల్లోనూ, ఆకలి తప్ప మరో భావనే లేదే వీళ్ళకి! అరెరే! ఆ ఆకలి ఎంత ఘోరమైంది కాకపోతే మురికినీటి కాలవలోని ఎండ్రకాయల్ని పట్టి తింటారు!..

లచ్చమ్మ, "ఎట్లా బాబయ్యా! మళ్ళీ వొచ్చింది తిరనాళ!" అంది.


వరదరాజు, "ఆ! వొచ్చింది." అంటూ వెనక్కి తిరిగాడు. ఇంకేం చెప్పటానికీ అతనికి మనస్కరించలేదు ఇక్కడ్నించి వెళ్ళిపోవడం మేలు...అతను కారు దగ్గిరకొచ్చి "శాస్త్రిగారు! వీళ్ళకి అర్థమయ్యేట్టు చెప్పడం నా చేతగాదండి. మీ రెప్పట్లు బహిరంగ సభ పెట్టితే సరిపోతుంది" అన్నాడు.

శాస్త్రిగారు నవ్వి, "మీరేం గాభరాపడకండి. ఈ గూడెంలో వున్న పెద్ద ఒకణ్ణి పిలిపించి మాట్లాడదాం. అన్నీ పనులూ అయిపోతయి. మనం ఎక్కడ తిరగ్గలమండి వీళ్ళ చుట్టూనూ" అన్నాడు.

ముగ్గురూ కారెక్కి వెనక్కి మళ్లారు. వరదరాజు కారులో

ఒక మూలగా ఒదిగి కూర్చుని సిగరెట్ వెలిగించి ఆలోచిస్తున్నాడు. మాటిమాటికీ ఇందాక చూసిన ఆ రోజువాది మనిషీ ఆమె పిల్లలే కంటికి కన్పిస్తున్నా రతనికి. "అహా! ఎంత ఘోరం! వాళ్ల ఓట్లు కాజేసి, వాళ్ళ కేదో చేస్తామని ఏమీ చెయ్యకండా, వాళ్ళ నట్లాగే వుంచుతున్నారే ఈ కౌన్సిలర్లు!...అసలు వాళ్లు వీళ్ళ గుడిసెలలోకి వెళ్లి చూస్తేగా!...

వరదరాజు దారిలోనే కారుదిగి, కలతపడిన మనస్సుతో కొంగ్రలాజపురం మండపానికి బయల్దేరాడు. (ఇంకావుంది)



కలగా జరిగిన గాథ

అంత్యశ్రీకి ఆ చప్పుడు ఆశ్చర్యాన్ని కలిగించింది. తలుపు తెరుచుకుంది. రివ్వున చల్లనిగాలి వీచింది. సువాసనావాసితంగా మందంగా వుంది. మనిషి తెరిచినట్టే తెరుచుకున్న ఆ తలుపు మళ్లా మెల్లగా మూసుకుంది. ఈసారి అంత్యశ్రీకి మరీ ఆత్రుత, బితుకూ కలిగాయి. ఏదో గాలితాకిడికి అలాగయిందని మనస్సు ధైర్యం చేసుకొంటున్నాడు. హఠాత్తుగా గది తలుపు తను లోపలుండగానే తనే వేసుకున్నట్టు ఇనుపగడియపడింది. అంత్యశ్రీకి కాళ్లు గజగజ వణికాయి. రెండువేళ్ల మధ్య బందీకృతమైన సిగరెట్ తఫీమని స్వేచ్ఛ పొందింది. ఇందాకటి చల్లనిగాలికి ఎగిరిన కాగితాలు కనిగారు తమను సర్దుకో లేదేమా అని ఎదురుచూస్తున్నాయి. అంత్యశ్రీకి తను కెవ్వన కేకవేసి పడతాడేమో ననిపించింది. కాని అలా జరుగలేగు. గొంతులోంచి బయటపడదామని ప్రయత్నిస్తున్నాయి మాటలు. ఎవరో నోటిమీద చెయ్యివేసి నొక్కేసినఅనుభూతి చెందాడు. భార్యని పిలుద్దామనుకున్నాడు. "లక్ష్మి" నోరుతెరిచేవున్నదే! కాని ఆశక భయం చేతో ఏమో ఆగది దాటి వెళ్లలేదు. పిలుపుకిమాత్రం సమాధానం వచ్చింది. "ఏం నాయనా" అని.

ఎంత చల్లనిజవాబు. కాని తనని నాయనా అనేవాళ్లు ఈలోకంలోనే లేరే! ఉన్నా లక్ష్మిని పిలిస్తే వీళ్లు పలకడమేమిటి? దగ్గరకొచ్చి ఆమాటలు తనచెవిలో మాట్లాడినట్లున్నాయి. మళ్ళీ భయపడ్డాడు. తను పిలుపు గట్టిగా పిలవలేదు. పొరపాటున లక్ష్మి పలికిందనుకున్నాడు కాని! "లక్ష్మీ" ఈసారి గట్టిగా పిలిచాడు.

"ఆఁ వచ్చాను. నీకోసమే వచ్చాను. ఎందుకంతగోల చేస్తావు. నీతో మాట్లాడాలి" అన్నదా అదృశ్యవాక్కు.

ఈసారి అంత్యశ్రీ నిజంగా త్రుళ్ళిపడ్డాడు. ఆ మాట ఎక్కడనుంచి వస్తున్నాయో, ఎవళ్ళాడుతున్నారో ఏమీ తెలియలేదు. కాళ్లు గజగజలాడాయి. కళ్లు బైర్లు కమ్మేయి. బుఱ్ఱ తిరిగిపోయింది. నిలద్రొక్కుకుంటూ "ఎవరదీ" అని అనగలిగినందుకు తనని తానభినందించుకున్నాడు.

"నేను లక్ష్మిని. ప్రపంచగమనాన్ని శాసించే డబ్బు - సంపదకు అధిదేవతని" అంత్యశ్రీకి భయం పోయింది. తత్ స్థానే సంభ్రమం - ఆశ్చర్యం - కింకర్తవ్యతా మూఢత్వం, ఆవరించాయి. ఇది నిజం అవునా కాదా? దేవి తనని వరాలు కోరుకొమ్మనడానికి వచ్చిందా? ఒక్క వరంలోనే ఐహికాముష్మిక సుఖాలన్నీ కోరుకున్న శెట్టిగారైనా ప్రక్కనులేరే!

లక్ష్మిమాత అన్నది "ఒరేయ్! నువ్వు లేనిపోని వేషాలువేసి కవిత్వం చెప్పావని తెలిసిందంటే నీ యింటివైపైనా చూడను. నాళ్లిద్దరే నీకు శరణ్యం" లాలనగా ముద్దుకొడుకుతో అన్నట్టు. అంత్యశ్రీ భయపడుతూ "క్షమించు తల్లీ! నేనే మపచారం చేశాను తల్లీ."

"లక్ష్మి కటువుగా అన్నది "శత్రువుల నాదరిస్తే మిత్రులకు ద్రోహంకాదూ? అల్లాగ". అంత్యశ్రీకి ఆప్రశ్న అర్థంకాలేదు. "నాకు అర్థం కాలేదు తల్లీ" అన్నాడు. లక్ష్మిదేవి "మంచికోసం చెప్పిన వి రుచించవు. నీ హితమే కోరుతున్నాను. నాకూ దానికీ పడదని నీకు తెలుసుగదా! దాన్ని ఎందుకు ఆరాధిస్తావు? అశేం కూడిస్తుందా గుడ్డ ఇస్తుందా? మా దేవతాకోటిలో ఇంత అప్రయోజకశిఖామణి మరొకతె లేదు. దాన్ని నమ్మకున్నవాళ్ళందరూ చెడ్డారు. దానికి బాగా కుదిరిందిలే స్నేహం! నాతో పడనివాళ్ళని తనకు సహచారిణులుగా చేసుకుంటుంది. నాకూ మా అక్కకీ విరోధం అని తను ఎక్కడుంటే మా అక్కనికూడా అక్కడికే తీసికెళ్తుంది నామీద కగ సాధించడానికి. ఎన్ని యుగాలకైనా నన్ను వాళ్ళు జయించలేరు. ఎప్పుడూ నాదే పైచేయి. ఆ కృష్ణరాయల కాలంలోనూ వీళ్లెంత మిడిసిపడేవాళ్ళు. నా కొడలున్నచోటనే రాయలు వారు నన్ను కట్టి పడేశారట. అంతేకాని నేను రాయలులోఉన్న నా భర్త అంశాన్ని గౌరవించడానికి అలాగ ఉన్నానని ఈనుటి బుఱ్ఱలకు తట్టి వుండా? అవన్నీ పాత విషయాలు కాని ఇప్పటికైనా నా ఆజ్ఞను అర్థం చేసుకున్నావా వెంటనే ఆ కవిలకట్ట తగలబెట్టు."

అంత్యశ్రీ బ్రహ్మాండమైన ఊచ్చులో పడ్డాడు. ఆ శారదను రోజూ ఆరాధిస్తూ ఊరుకోక ఉదయమే లక్ష్మీస్తోత్రపారాయణం ఎందుకు చేస్తున్నానురా బాబూ! అని చింతిల్లాడోసారి. బాగుంది! ఈ దేవతా యుద్ధంలో మధ్య తాను నలిగిపోవాలాయేమిటి? అయినా ఎంత దేవతలైనా భయపడ్డకొద్దీ మరీ అల్లరి పెడతారు. ధైర్యంగా అడిగి తేల్చుకోవాలి ఈ విషయం.

★ కలగా జరిగిన గాథ ★

"ఏమిటా ఆలోచన వేగిరం జవాబియ్యి" తొందర పెడ్తోంది క్షీరసాగర తనయ.

"ఆలోచన కాదు తల్లీ నా బాధ నువ్వు గ్రహించే ఉంటావు. ప్రతిష్ఠకోసం ప్రాకులాడే నాలాంటి అభాగ్యజీవులమీద కొంత కారుణ్యం కనబర్చు తల్లీ" అన్నాడు అంత్యశ్రీ.

"ఏమిట్రా ప్రతిష్ఠ అంటే ఎందులో ఉన్నదో తెలియక మాట్లాడుతున్నావు. నువ్వు దాని కొలువు మానేసిన క్షణంనుంచి నా కృపావీక్షణాలవల్ల పేరుప్రతిష్ఠలు, డబ్బు మూలినంత సంపాదించగలవు" అన్నది లక్ష్మీదేవి.

'ఎన్ని క్షణాలు నీ వీక్షణాలుంటాయో' అనుకున్నాడు అంత్యశ్రీ లోలోపల. బుఱ్ఱ ఝూడించి యోచించి చూశాడు. తాను ఈ రచనలతో యుద్ధం మానివేసి కాలుమీద కాలేసుకుని చిన్న కార్లలోనూ సిమెంటు భవనాల్లోనూ విలాసం చిత్తగిస్తూ డబ్బు కాల్చేస్తూ ఉంటాడా? అబ్బే అవన్నీ క్షణభంగురమైన సుఖాలు. శాశ్వతంగా ఆచంద్రార్కం పేరు నిలబెట్టే కావ్యసృష్టపదవి కోసం అంకితమయేదా? కాని ఎవరు విన్నా నవ్విపోతారే! ఎదురుపడ్డ సంపదని ఎదిరించి ఐహిక సుఖాలకు దూరమయ్యావురా అని దుయ్యబడతారే. ఒక వేళ నా హృదయానికి జవాబు చెప్పుకుందామనుకున్నా, ఈవిడ కోపగించి నాలుగురోజు లీవైపు చూడకపోతే నా కావ్యకృషి అంతా బుగ్గిపాలేగదా! ఈమెతో విరోధం తెచ్చుకో కూడదు. మరిద్దరినీ వశం చేసుకోగలమా! అమ్మో అది అసంభవం. అలా చేసుకున్నవాళ్లున్నారా? లేకేం సినిమాల్లో చేరిన కవులు. బలే మంచి ఆలోచనే! ఈవిడ ముందు ఈ ప్రశ్న పడేస్తే జవాబు చెప్పలేక విలవిలలాడుతుంది.

"ఏంరా! నా మాటకు సమాధానం చెప్పవేం?" లక్ష్మీదేవి చాల చిరాకుపడ్డది.

"క్షమించు తల్లీ! చిన్న సందేహం బాధిస్తూంది" ధైర్యంచేసి అంత్యశ్రీ అన్నాడు.

"ఏమిటది" లక్ష్మీమాత అన్నది. "నన్ను మీ కోడల్ని తలచవద్దని చెప్పేవు. అంటే నీ కోడలున్నచోట నీ చూపైనా పడదని కదూ! మరి అలాగ మీ యిద్దరి కటాక్షం పొందినవాళ్లగురించి" అనుకున్నమాట లప్పగించేశాడు అంత్యశ్రీ.

"చెప్పు. ఎవరలా నన్ను ద్రోహంచేసేవారున్నారో చెప్పు. వాళ్ళని వెంటనే ఒదులుకుంటాను" ఆత్రుతగా అడిగింది శ్రీదేవి.

"సినీమాల్లో కవులు" చెప్పాడు అంత్యశ్రీ.

శ్రీదేవి స్మితపడింది "ఓస్! వాళ్లు నాకు ప్రియపుత్రులు" అన్నది.


"అక్కే ఏమిటా పక్షపాతమని అడుగుతున్నాను" అంత్యశ్రీ ధైర్యంగా ప్రశ్నించేడు.

"వాళ్లు నాకు సంతోషాన్నిస్తున్నారు. నన్నారాధిస్తున్నారు. వాళ్ళ కావ్యాలు కవిత్వాలూ అన్నీ నాకోసమే. వాళ్లేది చేసినా నాకోసమే. వాళ్ళచేతుల్లోపడి అం ఎంత హింసపడుతోందో చూసి ఆనందిస్తున్నాను. ఆమె వాక్స్వరూపిణి అట. ఆమె శరీరం అంతా బాధపెడుతూనే వున్నారు. మాటలను సాగదీస్తున్నారు. మ్రింగిస్తున్నారు. ఒత్తులు లేనిచోట్ల దిగ్గొడుతున్నారు. శరీరాన్ని వారిష్టం వచ్చినట్టు వంచి బాధించుతున్నారు. నాకు చాలా ఆనందం. ఆమెను బాధించడం, నన్నారాధించడం చాలదూ" లక్ష్మీదేవి ఉద్రేకంగా చెప్పి ఉపశమించింది.

"అవునుతల్లీ! నువ్వన్నదీ నిజమే" అని ఒప్పుకున్నాడు అంత్యశ్రీ. "అవునుకద! ఇప్పుడైనా నేను మోసపోలేదని గ్రహించేవా! ఆలోచించుకో! ఏనాడు కావ్యాల గొడవ వదిలేస్తావో ఆనాడే తిరిగి నారాక" లక్ష్మీదేవి ముగించింది.

గమ్మని వాసన విసరిన గాలితో గడియ ఊడి తలుపు తెఱచుకోవడం జరిగింది. అంత్యశ్రీకి ఒళ్ళంతా జ్వరం జారినట్టు చిఱుచెమట పట్టింది. తనేం మాట్లాడాడో - ఎవరితోనో - అది కలో - నిజమో తెలిసికోలేక బాధపడుతున్నాడు. అంత్యశ్రీ గృహలక్ష్మి తలుపు తోసుకుని వచ్చింది. "ఏమండీ! నేను వచ్చేముందు గది తలుపు తెఱచుకుని ఎవరండీ వెళ్తున్నారు. అబ్బ! వాసన గుప్పేసింది. నేను విన్నానులెండి. ఎవరో ఆడాళ్లు మాటలాడుతున్నారు. పోనిండి నాతో చెప్తారా యేమిటి" ఒక్కసారి గాభరాగా అనేసింది. అంత్యశ్రీ "మంచినీళ్లు" అనిమాత్రం నోటితోనూ చేత్తోనూ చెప్పాడు. లక్ష్మి పట్టుకువచ్చి అందించింది. తాపీగా తాగేసి జరిగినదంతా పూస గ్రుచ్చాడు. లక్ష్మి నమ్మింది. గజగజలాడింది భయంతో. కిలకిలలాడింది ఆనందంతో. అంత్యశ్రీ విశ్రమించాడు.

మరునాడుఉదయం లక్ష్మి అమృతహస్తంతో కమ్మని కాఫీ అందుకుని, సేవించి, గదిలో కూర్చొని నిన్న ఆపిన గేయనాటిక పూర్తిచేస్తున్నాడు. గది తలుపులు రెండూ తెఱచుకునే ఉన్నాయి. తెల్లగా సున్నం వేయబడ్డ గోడలు కొంచెం ప్రకాశమానంగా ఉన్నాయి. అంత్యశ్రీ 'వెల్లవేయించడంచేత' అనుకున్నాడు క్రమేణా ట్యూబ్‌లైటు వెలిగించినట్టు చల్లని వెలుగు గదంతా నింపుకుంది వెన్నెలలా. అంత్యశ్రీకి



వెలుగులనీట పడవలబాట.

ఫొటో: పి. సి. ఎమ్. ఈశ్వరబాబు—మద్రాసు.

ఎందుకో భయంవేసింది. ఐనా నిన్నటి సంఘటన మళ్ళీ పూర్తి ధైర్యాన్ని ఇచ్చింది. కొంచెం చిరాకు కూడా వేసిం దతనికి, 'ఎంత తను దేవత అయితే మాత్రం మానవులను పీడించడమేనా ఏఁవిటి ఈవిడ పని. తనెవళ్లను కొలిస్తే ఆవిడ కెందుకో! శుద్ధ ఛాందసం మనిషిలాగుంది' అని మనసులో అనుకున్నాడు.

"అవును నాయనా! నువ్వనుకున్నది నిజం. నేను వాగ్దేవిని. నీ మాటలు నాకు బోధపడ్డాయి. ఆవిడ ముసలిదౌతున్న కొలదీ నువ్వన్నట్టు ఛాందసం హెచ్చవుతూంది"

అంత్యశ్రీకి వాగ్దేవిమాటలు అమృత వర్షంలా ఉన్నాయి. తను ధన్యుడినయినా నని భావించాడు. శారద మళ్ళీ అన్నది "ఏం నాయనా! నిన్న ఆవిడ వచ్చి ఏమేఁవిటో బెదిరించిందికదూ! నీ కెందుకూ భయం. నీకు శాశ్వత కీర్తి సంపాదించి యివ్వడానికి నేను పూనుకున్నాను. నీ ప్రాణం బ్రతకలేకపోదు. అన్నం పరబ్రహ్మస్వరూపం. నేను పూచీ పడుతున్నాను. ఆ కీర్తే నీకు ఐహిక సౌఖ్యాలన్నీ సమకూర్చవచ్చు."

అంత్యశ్రీ "అలాగే తల్లీ" అన్నాడు. "నిన్న నేదో చాల నిందించిందే నన్ను గురించి. గురివెంద తన వీపుమీద నలుపు తా నెరుగదుట. అల్లాగే వుం దీవిడ సంగతి" సరస్వతి మందహాసంతో అన్నది.

అంత్యశ్రీ "నిన్న నేనామెను 'సినీమా కవులవద్ద నీ కోడలున్నదికదా! నువ్వుకూడా ఎలా వరించేవు' అని అడిగేను తల్లీ! దానికి అన్నదికదా! 'వాళ్లు నాకు చాలసంతోషం కలిగిస్తున్నారు. నా కోడల్ని నానా యాతనలు పెట్టి శరీరాన్ని బాధపెడ్తున్నారు' అని సంబరపడుతూఅన్నది. 'ఇప్పుడైనా నేనెవరి చేతా మోసపోలేదని గ్రహించావా' అని చెప్పి వెళ్ళింది తల్లీ" అని పూర్తిచేశాడు.

"ఆవిడ మోసపోలేదూ! చిత్తుగా కురిడీ అన్నదావిడ. బాగా మోసపోయింది. అయినా కబుర్లు చెబుతుంది. అందుకే నా కొళ్లు మండుతుంది. ఈవిశ్వం బాగా మోసం చేయగలవాళ్ళు సినీమా కవులు కనుక నే వాళ్లి అండనున్నాను. వాళ్ళు చేసే సేవ అంతా నాకే. రచయితలుగా నే పేరు సంపాదిస్తున్నారు. సేవాధర్మంలో ఏవైనా పొరబాట్లు జరగవచ్చు. అవి నేను సర్దుకుంటాను. ఈవిడమాత్రం కాకినాడ కాజా కొట్టేసింది. తనకోసం నన్నుపయోగించుకుంటున్నారని ఆమె అభిప్రాయం. నా కోసం ఆవిడ ఉపయోగపడుతూందని తెలియదు - నా ప్రియపుత్రుల కవిత్వంలో కవితావస్తువేది? డబ్బు! డబ్బు! కూడబెట్టిన కుబేరులు! ధనికులు! వాళ్లని నిందించి దుయ్యబడుతున్నారు నా వాళ్లు. లక్ష్మీపుత్రులు నాశనమవాలన్నారు. ధనికులు, బీదలు ఉన్న దేశానికి 'అభ్యుదయం' లేదన్నారు. నా ప్రియస్నేహితురాళ్ళు, సహచారిణి - పెద్దమ్మ ప్రియపుత్రులు, రైతులను, కార్మికులను, బీదలను, బిచ్చగాళ్లను వారి కవితావస్తువులను చేసుకొని తెగ పొగడుతున్నారు. ఇదంతా తనమీద ప్రేమాభక్తీ అనే అనుకుంటోందా? ఇప్పుడు తెలిసిందా నాయనా! పూర్తిగా ఎవరు మోసపోయిందని" అన్నది శారద.

అంత్యశ్రీ "నిజమేనమ్మా" అన్నాడు.

వాగ్దేవి "నీ రచన సాగనీ నాయనా! ఇవి ఆచంద్రార్కం మాకు తెగని తగువులు. నువ్వు వినలేవు. విన్నా తీర్చలేవు" అన్నది.

అంతే. ధ్వనిలేదు. కాంతి మెల్లగా తగ్గిపోయింది. గది నిస్తేజంగా ఉన్నది. అంత్యశ్రీ విసనకఱ్ఱకోసం చూశాడు. "లక్ష్మీ" అన్నాడు. "ఆఁ వస్తున్నానండీ" అంటూ చేతులు తుడుచుకుంటూ వచ్చింది గృహలక్ష్మి. "ఇప్పుడేం మాటలు వినపడలేదూ" అన్నాడు. "అబ్బే" అంది గృహలక్ష్మి. "కోడల్ని పంపిందావిడ" అన్నాడంత్యశ్రీ. "ఏమిటో పూర్తిగా చెబుదురూ" అంది లక్ష్మి.

అంతా విన్నవించాడు అంత్యశ్రీ. లక్ష్మి "ఏమిటండోయ్ ఈ గొడవలు! ఆవిడే మోసపోయిందంటే ఆవిడే మోసపోయిందని చెప్పుకుంటున్నారు. గొప్ప తగువులాటే! మీ సరస్వతి అన్నట్టే ఈ చిక్కు విన్నా తీర్చలేం! పోనీండి మీ అభిప్రాయం ఏమిటి చెప్పండి? ఎవరు నిజంగా మోసపోయినట్టు? పక్షపాతం వద్దు" అన్నది ఆత్రుత ఉట్టిపడుతూను.

అంత్యశ్రీ ధూమవర్తిక వెలిగిస్తూ "పక్షం వద్దు పాతం వద్దు, ఇద్దరూ పూర్తిగా మోసపోయారు" అన్నాడు. ★

సుందర సూర్యగ్రహణం

నిశ్చల నిర్వికల్ప సమాధిలో కూర్చుని వుండిన్నీ తేజఃప్రభలతో వెలుగొంది పోయే ఒక కేంద్రబింబం చుట్టూ, ఎవరి మానాన వారు, వారివారి నిర్దిష్ట కక్ష్యలలో నిర్ణీత వ్యావృత్తులతో పరిభ్రమించుకుపోయే అన్ని గ్రహాలకూ ఒకే ఒక్కసారి సూర్యగ్రహణం సంప్రాప్తమయ్యింది. ఒక గంటా రోజూ కాదు...నాలుగు నిండు రోజులు!

మాకు మతులు పోయాయి. మండు వేసంగిలో మిట్టమధ్యాహ్నంవేళ తారురోడ్డు ముఖ్య మెయిన్ రోడ్డులో తడుముకులాడుకుంటూపోయే గ్రుడ్డివాడిగతి పట్టింది మాకు.

మా శ్రీమంతుడు మాయమైపోయాడు.

"యేమేవా యాక్సిడెంటయ్ పోలేదు గదా?" అన్నారు ఏక కంఠంతో రాహుకేతువులు: రైల్వే ఉద్యోగస్తులు; ఒక వారం పగలూ ఒక వారం రాత్రీ వీరికి. ఎక్కువ మాట్లాడరు. ఉండీ లేనట్టే ఏ వ్యవహారంలోనూ ఆర్భాటాలతో కలగజేసుకోరు. కాని ప్రతివాడి గొడవా వారి ఆంతరంగిక విషయంగా చూసుకుని మథనపడే భావుకులు.

ఆ ప్రశ్న మిగిలిన గ్రహాలకి అందంగానూ సమంజసంగానూ తోచలేదు సరికదా, పేరుకు తగ్గట్టు ఇద్దరికీ ఒకే ఆలోచన రావడం వెగటు కూడా కలిగించింది.

"ఐతే యామైనట్టు?" క్రాఫింగు ఎగరేసుకుంటూ అడిగేడు బుధుడు...ఇంకా స్కూలు ఫైనలు క్లాసుతో తన్నుకు ఛస్తున్న కుర్రవెధవ! "కాలవల్లో గాని క్రిష్ణలో గాని...?"

"ఇలాటి పాడు ఆలోచనలు డాపరిస్తున్నా యేమ్రా? వాణ్ని బతికి బాగుండనియ్యరేవిఁటి?" ఆరిపోయిన బీడీని వెలిగిస్తూ ఉరిమేడు శనిశాస్త్రి.

పై ముగ్గురూ ఖిన్నులయ్యేరు. పుస్తకాలుచ్చుకుని వీధులోకి జారిపోయాడు బుధుడు. వాడిదంతా ఆదోలోకం. తుపాకి దెబ్బకి తగలను పగలు. హోటలు భోజనం ఎప్పుడు చేస్తాడో. రాత్రిళ్ళు తొమ్మిదింటికి టీ సేవించి చదువుకోవాలంటూ పై డాబా మీదికి చేరి నిద్రపోతాడు. శ్రీమంతుడితో రాసుకు తిరిగేవాడు. వీణ్ణో చంటిపిల్లాడిని చేసుకుని వాడు ఆడించేవాడు.

మా కూటానికల్లా కొంతబరువు కలవాడూ గంటలతరబడి సైకిలుమీద తిరగగలశక్తి సామర్థ్యాలుగలవాడూ కుజుడు. పోస్టలు డిపార్టుమెంటు పేరుమీద అటు పోలీసు డిపార్టుమెంటులో కూడా పలుకుబడి సంపాదించుకున్నవాడు. ఒక అద్దె సైకిలు పుచ్చుకుని అన్వేషణకు బయలుదేరేడు మరొక్కసారి. పగటిపూట నిద్రచెయ్యవలసిన కేతువు కూడా వెళ్ళిపోయాడు - పడమటిదిక్కుకు.

* * *

అనగా అనగా సుమారు ఆరునెలల్రితం, ఒకరోజు సాయంత్రం మేమంతా డాలీ పార్కులోకి షికారు వెళ్లేం. అప్పటికి మే మెనిమిదేగ్రహాలం భూదేవితో కలుపుకుని. ఏదో చెప్పరాని వ్యసతోటే రోజులు నెట్టుకుంటూ సుమారు సంవత్సరంనుంచి సౌరకుటుంబంలా సత్యనారాయణపురంలో ఒక మూడుగదులకొంప తీసుకుని వుంటున్నాం. టైపుమేష్టారైన శనీ, ప్రైవేటు మేష్టారు (గురు) నైన నేనూ మినహాయించి మిగిలినవారంతా బ్రహ్మచారులు.

'జీవనప్రభాత'

ఎవ్వరూ లేనిచోటుకోసం గాలిస్తూ పార్కు చిట్టచివరకు వెళ్లిపోయాము. అక్కడ, ఎవరూ లేనికారణంచేతనే కాబోలు - ఒకవ్యక్తి ఏకాంతసేవ చేస్తున్నాడు.

జామిపండు శరీరం, సగం మాసివున్న మల్లు లాల్చీ పైజామాలు, ఎగదువ్విన క్రాఫింగు: నీరెండసహాయంతో అతనిజుట్టు రాగి కాంతినిస్తోంది. ఏకాగ్రతతో, నిమీలిత నేత్రాలతో దగ్గరలోవున్న గడ్డిపరకల కణాలను లెక్కపెట్టుతున్నట్టున్నాడు -

ఆవ్యక్తి ఏకాంతసేవను పాడుచెయ్యడమిష్టంలేక, ఇక గత్యంతరంలేక, అతని వెనకాలనే అతన్నే పరమావధిచేసుకుని అర్ధచంద్రాకృతిలో కూర్చున్నాం కొంతసేపో.

వ్రతం, నియమం పట్టగలమే కాని పాటించడం బహుకష్టం. మాలో ఎవడో దగ్గేడు. పరిశీలిస్తున్న వస్తువునుంచి అతనిదృష్టీ, అతనిమీద నున్న మాదృష్టీ - అన్నీ చెదిరిపోయాయి.

చెదురుతో వెనక్కు కలయచూశాడు. ఒక్క అరనిముషంలో మా అందరికీ సరిపోయే చిరునవ్వందించేడు. మళ్లీ తన సమాధివేపు మళ్లిపోయాడు.

కొంతసేపటికి అతన్ని కేంద్రంగా చేసుకుని వలయాకారంలో కూర్చుండిపోయాము. కోటవచ్చేట్లుండే అతని సన్నని ముక్కు, పలచటి పెదవులు, తీర్చి దిద్దిన కనుబొమలు, చిన్నవైనా లోతైన మెరిసే కళ్లు, చదునైన పనిపాపబుగ్గలు... మా అందరి హృదయాలలోనూ అద్దుకుపోయాయి. సన్నని పొడుగాటి వేళ్లతో, మా చూపుల తాకిడికి కొంత అలసట చెందుతూ, ఒక ఈనెపుల్లతో పచ్చగడ్డి రెక్కలను కదలించసాగేడు. అతని యోగవస్తువు ఏమిటా అనే ఆసక్తితో ముందుకు వంగేడు బుధుడు. దొంతర్లు దొంతర్లుగా సిగ్గుపడిపోయి, చిరునవ్వులో ధైర్యం తెచ్చుకుని అతడు మా అందరి కళ్ళలోకి తాపీగా చూడనారంభించేడు - ఒక చిన్నారి చిన్న చెవలపిల్లివలె!

అదే నవ్వుతో గాలిలో కరిగిపోయే కంఠంతో ప్రసంగించసాగేడు - అంటే, ఉపన్యాసధోరణిలో కాదు...అంతా పాడిమాటలలో.

అతని హృదయాన్నాకర్షించినవీ ఏకాగ్రతను ఇందాకటినుంచీ నిలబెట్టినవీ-గడ్డిలో మసలుతున్న చిన్నచిన్న నల్లని చీమలు!

వాటి అలవాట్లను గురించి, కార్యక్రమాలను గురించి, ప్రణయ కలాపాలను గురించి మాకు వివరించేడు. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళంగా ఆ చీమలను అతను కూర్చున్న స్థానంనుంచి, అతని దృష్టిని ఎరువు తీసుకుని పరిశీలించేము.

చీమలు కనపడకుండా చీకటి వచ్చింది. అక్కడ దీపం లేదు. ఎక్కడో రోడ్డుమీది దీపం సహాయంతోనే, మరి కొంతసేపతన్ని చూసి చూసి, మాలో కొందరికి డ్యూటీలకి టైమవుతుండడం మూలాన్ని సెలవుతీసుకుని వెళ్లిపోయాము.

ఆ రాత్రంతా అతన్ని గురించే చర్చించుకున్నాం. హృదయంలో ప్రతిధ్వనించే అతని చిరునవ్వు, జోకొట్టే అతని కంఠ

★ సుందర సూర్యగ్రహణం ★

…ఊర్ధ్వం మనిషిని లాలించే అతని కళ్ళ నీలిమ …ఇవే మా కథావస్తువులు.

ఉదయం ఏడుగంటలయింది. మేమంతా యథావిధిగా తయారయి వెళ్ళబోతున్నాము. వీధి వాకిట్లో నిన్నటి మా మిత్రుడు స్వంత చిరునవ్వుతో సహా ప్రత్యక్షమయ్యాడు.

“మీకోసం తెల్లారగట్లనించి ఊరంతా తిరుగుతున్నా –” అని భూమిక చదివేడు.

అది కూడా మా కనవసరమే … మా నిండుహృదయాలు అతనికోసం ఎదురుచూస్తున్నాయి. అతన్ని లోనికి ఆహ్వానించేం. పనిమనిషి భూదేవమ్మ ద్వారా హోటలునుంచి సరుకులు తెప్పించి అతిథి మర్యాదలు జరిగించేను.

ఒక్కొక్కళ్ళమే లేవబోతున్నాం—

“అంతా వెళ్ళిపోతున్నారా?” దిగాలుగా అడిగేడు.

పగటివారం గడుపుతున్న రాహువు: “నే నుండిపోతా లెండి … ఎవరి కైనను కావొస్తావుంటారు…” అన్నాడు.

ఇంతలోనూ బుధు డందుకుని: “పదింటికల్లా నాకు స్కూలు” అన్నాడు.

* * *

అవిఘ్నంగా అతను మాలో ప్రవేశించాడు. మాలోనే వుండిపోయాడు. మా అందరి మంచిచెడ్డలూ తోడుక్కునేవాడు. ఎవరి పక్క బాగుంటే దానిమీద పవ్వళించేవాడు. మా అందరి జేబుల పర్సులూ వాడుకునేవాడు. నీటుగా శుభ్రంగా వుండే వస్తువను గాని తాకేవాడు కాదు. చవకబారు వస్తువుకేసి చూపుకూడా పోనిచ్చేవాడు కాదు.

రోజుకు రెండుసార్లు వేణ్ణీళ్ళ స్నానం చేసేవాడు. డజనుసార్లు ముఖాన్నీ, చేతులనీ వేళ్ళనీ జుట్టునీ సాఫు చేసేవాడు.

చదువుకున్నవాడే. అందంగా చక్కని పుస్తకాల్ని చేతుల కలంకరించేవాడు. చదివినట్లు మాత్రం కనపడేవాడు కాదు.

మాలో సిగరెట్లు కాల్చేవారు ఇద్దరో ముగ్గురో వుంటే—అతనికోసమని అందరం గోల్డుఫ్లేక్ పెట్టెలు కొనేవాళ్ళం. సాయంత్రం ఇంటికి చేరే ముందు ఏ పండో కాయో పెద్దవాళ్ళ మిద్దరమూ తప్పకుండా అతనికోసం తెచ్చేవాళ్ళం.

మాలో ఎవరికివారికి విచారాలున్నాయి, బాంధవ్యాలున్నాయి, ఇబ్బందులున్నాయి. మా దైనందిన వ్యవహారాలలో తిన్న చివాట్లతో, బరువెక్కిన హృదయాలతో, ప్రపంచంమీద బయలుదేరిన విప్లవాగ్నితో లాడ్జికి వచ్చేసరికి, మందహాసంతో అతను మమ్మల్ని పలుకరించేవాడు. అతని సమీపంలో అర నిమిషంలో అన్నీ మరచిపోయి తేలికపడేవాళ్ళం.

సామాన్య సాంఘిక బాగకాల నన్నిటినీ అధిగమించి చిదానందంతోనూ చిద్విలాసంతోనూ అనవరతం ఊహావిహారం చేసే అతనికి శ్రీమంతుడని నామకరణం చేసుకున్నాం.

ఆ పేరుతోటే అతన్ని పిలిచేవాళ్ళం.

వాడసలి పేరేమిటో, ఏ వూరో, ఎందుకు ఎప్పుడు ఎలాగ ఈవూరు వచ్చేడో మాకు తెలియదు. అడగవలసిన అవసరము ఎప్పుడూ ఎవ్వరికీ కలగలేదు.

ఈనాటికి నాలుగు రోజులయ్యింది మా శ్రీమంతుడు మాయమయ్యి. పారిపోయాడనడానికి వీలు లేదు. ఎవరితోనన్నా లేచిపోయాడా? ఎవరన్నా లేవదీసుకుపోయారా?.. అంతటి నీచబుద్ధులు లేవాతనికి. ఏ కాలవలోనన్నా పడిపోయాడా అందామంటే—అంతటి అవసరమూ లేదు; అటువంటి పనికి కావలసిన ధైర్యమూ స్తోమతా వున్నవాడు కాదు—

తిళ్ళూ నిద్రలూ మానుకుని విజయవాడ పట్టణమంతా గాలించాము…

శ్రీమంతుడు మా కుటుంబానికి వెలుగు. వాడిని చూసుకుంటూ వాడి చుట్టూ తిరుగుతూ మామా బతుకులు వెటుకుపోయే మా గతులు నిలచిపోయాయి. మా అందరి హృదయాలనుంచీ పొంగి పొరలే కవిత్వ సంగీతం వాడు!

మా అందరి ఆశయాలకూ స్వరూపం. మాకు వాడి జీవితం ఒక ఆదర్శం.

అటువంటి మా శ్రీమంతుడికి - [illegible]గహా బలగపు సూర్యుడికి… ఒక దీర్ఘగ్రహణం పట్టింది…

ఏదో పరిపరివిధాల ఆరునెలల చరిత్రా నెమరువేసుకుంటూ గదిలో కూర్చుండిపోయాను. అద్దె సైకిల్ తోటి కుజుడు, వాడి వెనకాలే కేతువూ తిరిగి వచ్చేరు…

గోతుల్లో కాలవల్లో నదిలో ఎక్కడా విచిత్రమైన శవమూ తేలలేదు. పోలీసువారికి రిపోర్టు మూలకంగా గాని, పురజనులలో అనధికారంగా గాని - హత్యలు, ఆత్మహత్యలు, బలాత్కారాలు, ఆఘాయిత్యాలు, ప్రమాదాలు… వగైరా ఏమీ, అదేమి కర్మమో గాని, వారంరోజులు ఈ మధ్య బెజవాడలో జరగనే లేదుట. ఇదే మాదిరి పరిస్థితి ఇంకొక్క వారంరోజులు నిలపడితే, పోలీసువారి హోదాలకూ, సిబ్బందికీ కూడా ముప్పు రావచ్చునట…

బస్సులవాళ్లు, కార్మిక సంఘాలు, రిక్షా నాయకులు చివరకి విధి నిధి కీ నార్లా కేంద్రాలుగా పని చేసే కళ్ళిపాపలవారు .. మా యిద్దరి ప్రతినిధుల నిశిత పరిశీలనకూ గురిఅయ్యారుట. చివరకి, నిస్పృహతో కుజు డన్నాడు:

“పోలీస్ స్టేషన్లో నవ్వులపాలయిపోయాను. ఏవూరు - ఏం చేస్తాడు - ఏం పేరు - తండ్రి పేరు…వీటికి ఒకదానికీ మన దగ్గిర సమాధానం లేకపోయె! గుపెప్పగింతా…ఇనస్పెక్టరు ఫ్రెండయిపోయేడు గాని, లేకుంటే నన్ను పిచ్చాసుపత్రికి సాగనంపించేవాడు—”

కాలువనుంచి పారిపోయొచ్చిన బుధుడు వెల్లికిలా పడుకుని దూలాలు లెక్కపెడుతున్నాడు. వాడు వచ్చి మంచినీళ్ళు కూడా తాగడం లేదు.

మరి కొంత సేపయ్యేసరికి బలగమంతా ఇంటికి వచ్చేసింది: పనులు ఎగవేసి!

“అసలీ మధ్య కొంచెం పరాకు చిత్తగిస్తున్నట్లు కనపడేవాడు!” అన్నాడు శుక్రుడు, మెలకన్ను తీక్ష్ణంగా పెడుతూ.

ఇతను సగమూ, శని ఒకపాత్రూ జ్యోతిశ్శాస్త్రపారంగతులు.

మాలో కొంతెమో గొప్ప ప్రణయ కావ్యాలు చదివినవారు చంద్రుడూ, బృహస్పతినైన నేనూ. ఏ కావ్య సంపర్కమూ అక్కరలేకుండానే కాస్తోకూస్తో ప్రణయ కలాపాలలో అనుభవం సంపాదించుకున్నవాడు - మొల్లకంటి శుక్రుడు. అవసరం వస్తే, ఇద్దరేసి పెళ్ళాలను నిత్యసౌభాగ్యం దృష్ట్యా కట్టుకోవాలి, అని కేవలం ఒక థియరీనిమాత్రం వినపడిస్తూవుంటాడు కుజుడు. సర్వసంగపరిత్యాగినంటాడు శని.

శుక్రవచనంమీద కొంతసేపు తగనభర్గనలు చెలరేగాయి. విసిగిపోయిన చంద్రుడు కొన్ని సవరణలను ఉపపాదించి తాత్కాలికంగానైనా ఆమోదింపవలసిందని సభవారిని ప్రార్థించాడు. అతని పూర్తిపాఠ మిది:

“మనవాడు ఏదో ప్రణయకలాపంలో ఇరుక్కుపోయాడు. అసలే ఏకాగ్రత ఎక్కువవాలున్నవాడు. కాబట్టి ఏసందులోనో ఏయింటి అరుగుమీదనో తిష్టవేసి ఎదిరింటి గవాక్షానికి కళ్ళు క్రాసింగా తపస్సుగించి వుంటాడు. అటో ఇటో తేలేవరకూ ఆస్థలంనుంచి వాడిఘటం కదలదు ”

అయితే మనమంతా ఒక్కుమ్మడిగా ఆచరించగలిగిన నిర్మాణ కార్యక్రమం ఏది? –

అనే విషయం చర్చిస్తున్నాం ..

ఏదో కొంప మునిగిపోయినట్లు కాళ్ళీడ్చుకుంటూ పెంట చేతులతో ఊలిపలకు తోసుకు వచ్చింది భూదేవి. మన స్వంతగృహం పేరు మగవాళ్ళు మువ్వరమూ భరించలేక పనిమనిషి నే ఆ పేరిట పిలుచుకుంటూ ఆనందానుభక్తి చేసుకుంటున్నాం…

ఒకమూలకూలబడింది. మేమంతా చెవులను రెట్టింపుచేసుకుని ఆమెగోడు ఆవేదనంతా వినసాగేము:

వంటరిగా ఇంట్లో వుంటూవుండి, ఎదిరింటికేసి మొగమంతా కళ్ళు చేసుకుని గంటల తరబడి కూర్చుండేవాడుట. ఎదిరింటావిడకి

పురుడుపొయ్యడానికి నిత్యం వచ్చిపోతున్న "మంత్రసానమ్మాయి" మన వాడికళ్ళకు గుచ్చుకుంది. తన ముక్కుకు సూటిగా హృదయాన్ని నశిపేడు. నాలుగైదు రోజులు—ఆమె వెనకాలే పడిపోతూ వచ్చాడుట!

నా గుండెలు దిబ్బాగిపోవలసినట్లు ఉన్నాయ్. శని గాడు ఈ స్వరం ఎత్తుకున్నాడు. రాహు కేతువులు నిరాకారులయ్యారు. మిగిలిన ముగ్గురూ మాత్రం ఆనందిస్తున్నారు.

ఈ సంగతి యెదిరింటావిడే స్వయంగా చెప్పిందిట.

"ఆ అమ్మాయి యెలా వుంటుంది?" ఇది చంద్ర ప్రశ్న.

నాజూకైనది. పొట్టి కేశ్శ పిల్ల. నిండైనది. వాల్జడేస్తుంది. పువ్వులెట్టుకుంటుంది.—ఇది సారాంశం.

"పొట్టి కేశ్శ నాజూకు వాల్జడ పువ్వుల మంత్రసానో నర్సో అని వెతకవలసివస్తే— ఈ బెజవాడలో కొన్ని వందల స్త్రీలు తేలుతారు. మన శ్రీమంతుడ్ని మింగి కూర్చున్న మహోత్తలైనదో మాత్రం పోల్చుకోలేం......ఈరకపు ఉద్యోగం పిల్లలు రెండు వేషాలేస్తూవుంటారు, అందులో ఒక వేషం పంతులమ్మల్లో కలిసిపోతుంది"— ఇది కుజ వ్యాఖ్యానం. "చివరికి మనలో ఇద్దరు ముగ్గురేనా బలిదానమైపోవచ్చు..." అని కుజ మీమాంస.

కొంతసేపు క్రాస్ పరీక్ష చేసి ఇంకో రెండు మూడు విషయాలు మాత్రం కక్కించగలిగేడు శుక్రుడు. అవి శని విచారంలో నలిగిపోయాయి—"ఎంతటి కోకి మొహం తీసుకున్నా ఇంతటి పౌడరూ స్నోలు కలిపేసరికి అప్సరచ్ఛాయ అవతరిస్తుంది!" అన్నాడు.

ఈ వర్ణన చాలదు. ఆమె ఇల్లు పేరూ వగైరాలు కావాలి. వీలైతే ముఖ సందర్శన భాగ్యం ఉత్తమోత్తమం.

తగిన హామీనిచ్చి భూదేవి వెళ్ళిపోయింది. ఆమె తిరిగి వచ్చేలోగా చాలా [illegible] నిర్ణయాలు చేసుకున్నాం. మావాడి మొక్కైన మంత్రసాని ఇల్లే మాకు గమ్యం.

అందరికంటే పెద్దవాడూ, పిలక గౌరవం గలవాడు శని. భూదేవి ప్రక్కనే నడుస్తాడు. వంద గజాలదూరంలో బుధుడితో నేను. అత్యవసర సంకేతాలు అందచెయ్యడం, వెనక్కూ ముందుకూ పరిగెత్తడంలో బుధుడు సహకరిస్తాడు. మాకు వంద గజాల దూరంలో రాహుకేతుయుక్త శుక్ర కుజ చంద్రులు— రెండు జట్లుగా......నడకలు నిర్ణయించుకున్నాం. కావలసిన పదజాలాన్ని ఏర్చి కూర్చుకుంటున్నాం.

కిటికీలోంచి భూదేవి చింపిరిజుట్టూ, అత్యవసరాన్ని సూచించే మూలుగూ వినపడ్డాయి...

"బాబులూ! యోగం ఈదిలోకిరాండి—"

ఒక్క అంగలో అందరం వీధి అరుగు మీద విరుచుకుపడ్డాం. కుడిచేతి వేపు చూపులు పోనిచ్చేం—

వెనకభాగం మాత్రం మాకు కనపడింది. శరీర వంపులన్నిటినీ వెదజల్లుతున్న నీలి రంగు వాయిల్ చీర. వంగపండు జాకెట్టు, జడా పువ్వులూ, కాళ్ళకి జోళ్ళు ... రెండు గాజుల చేతులు మేము చూస్తుండగా నే దేవి సందుమళ్ళింది.

ఎడం వేపు సందులోకి ఉరికేరు బుధ చంద్రులు. విసురుగా వెనక్కాలే పడ్డారు శని రాహువులు. ఎక్కడో అక్కడ ఆమె ముఖసందర్శనం చేసుకురావడానికి!

అరగంటకల్లా అందరం సమావేశమయ్యాము. భూదేవి తెచ్చిన వివరాలతో వర్తమానపరిస్థితి ఇది:

పెళ్ళికూతురు పేరు "పి. సుమిత్ర" ఇరవై రెండేళ్ళవయస్సని శనిగారి అంచనా. అందమైన, తెలివైన అభిమానం అణకువా వున్న ముఖం. సంస్కారంవున్న మనిషిగా నేకనపడుతుంది. కొత్తపేటలో మకాం—తల్లితో. లోగడ ఆసుపత్రిలో పనిచేసేది. ఏదో వూరుకు ట్రాన్స్ఫరు అయితే దర్జాగా రాజీనామా ఇచ్చి ఈమధ్యనే డాక్టరు సుగ్రీవ రావు గారిదగ్గర చేరింది.

ఒక వేళ ఈ "మంత్రసాని అమ్మాయినే" మనవాడు వలచివుంటే, ఈ సెలజీతాలందరం చందాలు వేసుకుని ఆర్యమతంలోనో బ్రహ్మమతంలోనో పెళ్ళి చేసేద్దాం...

ఉన్నఊళ్ళోనే ఉంటాడు. మా అందరిలాగే ఆ అమ్మాయికూడా ఉద్యోగానికి పోయి వస్తూ వుంటుంది. పగలంతా మన దగ్గరా, రాత్రిళ్ళు ఆమెదగ్గిరా గడుపుతూ వుంటాడు.

ఈ ప్రేమికు లిద్దరూ మాత్రం అజ్ఞాత జీవితం గడుపడం మాకిష్టం లేదు. మా గ్రహబలంవల్ల వాళ్ళిద్దర్ని కలిపేస్తేమా పుణ్యం, పురుషార్థం కలసివస్తాయి. వీలైతే వాళ్ళకో చిన్నవాటా మా ప్రాంతంలోనే ఇప్పించవచ్చు. లేదూ శుక్రుడన్నట్లు "ఈయింట్లో వాళ్ళనేపుంచి, మనమే వాడికోసం వచ్చిపోతూ ఎక్కడెక్కడో సర్దుకుందాం—" ఇది శ్రీకాంతుడికి వివాహసంకల్పం!

* * *

నిర్ణీత కార్యక్రమం ప్రకారం సంజ మసకలవేళకి భూదేవితో శనిశాస్త్రి గమ్యస్థానాన్ని చేరగలిగేడు. సందుమొగలో నిలచిపోయాను నేను. ఎక్కడో దూరంగా వున్న వెనకటి బలగం కనపడుతోంది. బుధుడు ఒక్క రౌండులో ఒకరి వర్తమానాలు ఒకరికి చేరవేశాడు.

చీకటి పడిపోయింది. శని ఎంతకీ ఈవలికి రాడు. కారణం గ్రహించలేకపోయాడు బుధుడు. నే ముందుకు నడిచేను. కళ్ళు ముక్కూ నోరూ మూసుకు నిలుచున్నాడు శని! నన్ను చూసి వెనక్కు తిరిగేడు. ఆలస్యానికి కారణం తెలిసుక వెనకాలి నాంగు బలం అంచులమీదవచ్చి పాతికడుగుల దూరంలో నిలిచిపోయింది. భూదేవమ్మ ఎవరింటి ఏ వసారాలోనో లోకాభిరామాయణంలో మునిగిపోయింది.

వేలెట్టి చూపేడు శ్రీమంతుడి ప్రేయసీ నిలయం—

అది సామాన్య పాటకజనం వుండే కొంప. కుక్కలూ కోళ్ళూ పందులూ వీర విహారం చేసే క్షేత్రం. పోలీసులైన్లలాగున్న సన్నటి పొడుగాటి పెంకుటిళ్ళలో ఒక తడికతో తయారైన పిడి గదిగల ఒకే గది వాటా...ఇరుప్రక్కలా రెండూ వైతరణీ నదులు ఎల్లలు.

"ఇల్లాంటి ఇంటో భస్తే మనవాడుండడు." అని నసుగుతున్నాడు అప్పుడే వచ్చిన శుక్రుడు.

"వేళ రూమ్ తీసుకోకూడదా—హోటళ్ళల్లో గదులేవా?" అని చంద్ర ప్రశ్న.

"ఆవిడింకా ఇంటికి చేరలేదుట—ఆమె తల్లి చావల మార్కెట్టు కెళ్ళిందట," శని వాపోవసాగేడు: "మల్లిపువ్వులాంటి మనవాడికి ఈ పుల్లాకు తగిలిందేమిటోరా?"

"అంతా కర్మ—మనకీ సందు భాగోత మేమిటి?" అని శుక్రుడు ఎక్కిరించేడు.

ఇంతలోకే నాకో భయం పట్టుకుంది: "ఇదంతా అలగాజనం వుండేవాడ. సైన్యంలాగున్న మన్ని చూసి ఏ సేనా గోల బయలుదేరొచ్చు..."

ఈ మాటలతో మెల్లమెల్లగా ప్రక్క వీధికి నడుస్తున్నాం. మమ్మల్ని వెతుక్కుంటూ భూదేవి వస్తోంది. ఆగిపోయాం.

"కాస్త చీకటి పడితేనేగాని రాదంట మంత్రసానమ్మాయ్...పురుడని చెప్పేనుండి.."

ఇంతలోనూ మమ్మల్ని చూసుకుంటూ టకటక వెడుతున్న ఓ టిఫిన్ క్యారియర్ ఇల్లాలు ఆగి "యేవరు కావాలండీ" అంది సంకోచంతో—

భూదేవి సమాధానమిచ్చింది: "మంత్రసానమ్మాయుండి."

ఆవిడ మూకేసి రెండడుగులు వెయ్యబోయింది. ఒకరికి పదిమందన్నట్లు చీకట్లోంచి చించుకుంటున్న అనేక జతల కళ్ళని చూసేసరికి ఆగిపోయింది. ఒక ఇంట్లోంచి వస్తున్న దీపం వెలుతురు ఆమె కుడిచెంపని వెలిగించింది. నా గుండెల్లో శబ్దం బయలుదేరింది.

"మీ మంత్రసాని పేరు?—"

★ సుందర సూర్యగ్రహణం ★

"సావిత్రమ్మ" అంటున్న శుక్రుణ్ని ఆపి శని అన్నాడు, "సుమిత్రమ్మగారండి..."

"నేనే సుమిత్రని...మీకేం కావాలి?"

మసక వెలుతురులో శనిగారి పిలక ఆమెకి కనపడి కొంత మనోధైర్యాన్ని ప్రసాదించివుంటుంది.

ఆమె ప్రశ్నకి మేమంతా మూగపోయాం. భూదేవి చల్లపడిపోయింది. కంట్రాక్టు ప్రకారం ఆ యింటిదగ్గర ఆ వ్యక్తిని చూపించడంతో ఆమె డ్యూటీ అయిపోయింది.

కంఠం సరిచేసుకుని ఆమె మళ్లీ అంది, "ఎక్కడ కేసు?—ఎవరింటో పురుడు?"

చప్పపడిపోయిన ఆ క్షణాలు గడపడం మాకు మహాకష్టమనిపించింది. రిహార్సలులో గాని, ప్రణాళికలలో గాని అనుకోని సంఘటన ఎదురయ్యింది. వ్యవహారమూ అతి సున్నితమైనది.

శనినుంచి వస్తున్న దోశ మూలుగు.

తెగించి నే తెరచేసు కోరు—

"మాపిల్లాడొకడు తప్పిపోయాడండి—"

నా తెలివికి సంతోషించాను.

"పిల్లాడు? అ్రరె! పాపం—" సానుభూతి పంచిపెట్టింది. "పొద్దున్న నగాపోతా......ఈ చుట్టుపట్లంతా వెతికేరా? అందర్నీ కనుక్కున్నారా? [illegible]సు రిపోర్టు—"

"నాలుగు రోజు లయ్యిందండి—"

ఘోరంగా సాగుతోంది నా మాట—

"నాలుగు రోజులే! అయ్యో...పేరు?"

"శ్రీమంతుడు" ఇది శుక్ర కంఠం.

"బ్రాహ్మలా? ఏ పిల్లాడి సంగతీ నాకు తెలియదే!"

"మాది సత్యనారాయణపురం."

ఆమె నిర్ఘాంతపోయి వింటోంది.

"మీ పురిటికేసు ఇంటి కెదురుగానే మేం వుంట. రోజూ మీరు వెళ్లిపోతూంటే మీ వెనకాలే పడిపోయేవాట్ట"...ఇంక కవిత్వ ముపయోగించసాగేను. "ఉత్తి వెర్రి బాగులవాడు - ఏ ఘోరణి పడితే అదే ఘోరణి—"

ఆమె తికమకపడుతోంది. కళ్ళతోటి సానుభూతి చూపుతోందనుకుందామన్నా, ఆ చీకట్లో వీలు కలగడంలేదు.

"యెన్నేళ్లవాడు?"

ఒకమూలనుంచి మూల్గేరు - మెల్లిగా— ఎవరో—

"ఇరవై రెండూ - లేక మూడూ—"

ఆమె నిజంగా విస్తుపోయింది. రకరకాల భ్రమలలో పడి తన్నుకుని, తనని తానే సత్కరించుకుంది -

"యెలా వుంటాడూ?"

"పచ్చదబ్బపండులా - తెల్లలాల్చీ పైజామా ఎగదువ్వడు క్రాఫింగూ..."

ఆమె యథాశక్తి ఒకవంక ఆలోచిస్తోంది.

"ఒకరోజు రైలుగేటుదాకా కూడా మీ వెనకాలవచ్చేట్ట -"

ఇప్పటికి మాశనికి ప్రాణవచ్చింది. ఘోరణి అందుకున్నాడు:

"వాడికి వాలుజడలు, పువ్వులు రంగు, చీరలు అంటే అదోపిచ్చసరదా - కొంచెం అయోమయం మనిషి. ... ఒక వేళ మా పిల్లాడు మీ వెనకాలనే మీయింటిదాకా వస్తే, ఎవరబ్బాయోపాపం అని ఇక్కడ గాని మీ రెరిగినవా రెవరింటోగాని అన్నే పెట్టేరేమోనని -"

మా సీరియస్ వాలకాలు చూస్తున్న ఆమె చల్లపడిపోయింది. వెర్రి అనుమానాలకు ఆస్కారం లేదు. మా వెనకాల ఎక్కడో సందు మళ్లుతున్న మోటారులైట్లు ఆమెను రెండుక్షణాలు వెలిగించేయి. వయస్సులో మధ్యాహ్నంనుంచి ఓ ఎనిమిదేళ్లు యెదిగింది. ముఖం బాగబారి మోటుతనాన్ని బయలుపెడుతోంది. కళ్ళకాటుక బండ తేరినా ఆమెకు అందమే ఇస్తున్నది. కళకళపడుతోంది. నీరసపడుతూ విసుగుతో నిలతొక్కుకుంటోంది.

- "నా వెనకాల ఏ పిల్లాడు రావడం చూళ్లేదండీ...నే తిన్నగా ఇంటికూడా రాను, ఆస్పత్రికెళ్ళి కేసులుమీద తిరుగుతూ వుండిపోతా ... ఇంతదూరం అందులో రెండుమూడేళ్ల పిల్లాడు -"

- మా శనికంఠం కీచులో ఉచ్ఛస్థాయికి వెళ్లసాగింది:

- "రెండుమూడేళ్లేవిటమ్మా ఖర్మ ...? ఇరవై రెండేళ్లు. నవమన్మధుడులాగుంటాడు"

- "అంటే - అంటే -" ఆవిడ కంఠం ఎక్కడో నొక్కబడిపోయింది. ఇటూ అటూ దిక్కులు మాసింది.

- "మరి తల్లీ - మరే -"

- కొంచెం వణకుతున్న తీవ్రస్వరంతో తాపీగా అంది:

- "యెవరో ఆయన నా వెనకాలే పడి వచ్చారని -"

- "అమాయకుడని చెపుతున్నాంగా -"

- "ఒకవేళ నాయింటోగాని ఇంకో యింటోగాని ఆయన్నట్టిపెట్టుకున్నానేమో కనుక్కుందామని మీరొచ్చేరు. ఒక్కమాట చెపుతున్నా వినండి. ఈమధ్య నా వెనకా లెవ్వరూ పడి అంతవరకూ రాలేదు. అనేకమంది వెనకాల పడుతూనే వుంటారు. అందులో అమాయకులూ వుండొచ్చు నవమన్మధులూ వొండొచ్చు. ఓ వేళ నా యిష్టం మీదొచ్చిన వాడి విషయం మీదగ్గిర చెప్పుకుంటానా?" మ

అందరి మొహాలకేసీ అంత చీకట్లోనూ తీక్ష్ణంగా చూసింది. "క్షమించండి... నే నింక కూడొండుకోవాలి—"

ఆమె వెళ్లిపోతోంటే, వెనక వ్రేలాడుతున్న ఆమె జడ మమ్మల్ని వెక్కిరించింది.

* * *

మేమంతా పగిలిపోయిన గుండెలతో ఊగిసలాడుకుంటూ ఎప్పుడో ఇల్లు జేరాము. వీధి తలుపు చేర్లా వేసివుంది. లోపలకుపోయి లైటు వేసే సరికి—

మా శ్రీమంతుడు నా పక్క మీద హాయిగా నిద్రపోతున్నాడు—కళ్లజోడుతోటీ కాళ్ల జోడుతోటీ. మాటలేక ఒకరినొకరం చూసుకుంటూ నిలబడిపోయాం.

వాడికి మెలకువ వచ్చింది. అందర్నీ చిరునవ్వుతో పలకరించేడు. "టైమెంత?"

బుద్ధుడు తేరుకుని సమాధాన మిచ్చేడు: "పదకొండు"—

మంచంమీదనించి లేచి కళ్లు నిరుచుకుంటూ—"యా మైపోయార్రా ఇంత సేపు? తలుపు తెరిచివుంది. చూసిచూసి విసుగెత్తి నిద్రపోయా—"

వెయ్యి ప్రశ్నలతో వాడి చుట్టూ మూగేము.

ఒక లఘు ఉపన్యాసం మందహాసంతో అందించేడు.

"మీ అందరి కన్‌గ్రాట్యులేషన్సూ అందుకుంటున్నా. మీ రెవ్వరూ దగ్గరలేకుండా జరిగిపోయినందుకు విచారిస్తున్నా. మూడురోజులయ్యింది - నా వివాహమయ్యి... కంగారుపడకండి వ్యవధిలేకపోయింది. క్షణం దాటితే మించిపోయే పరిస్థితులు వొచ్చేయ్...

"రేపు ఉదయం ఎనిమిది గంటలకి మా నూతన దంపతులం ఈ సౌరకుటుంబానికి ఆతిథ్యమిస్తాం..మధ్యాహ్నం భోజనాలు.. ఆ కొలెండరుకి ఎడ్రెస్సు వగైరాలు తిరిలించా...ఆలస్యమైపోయింది. అందాకా శెలవ్..."

* * *

ఉత్సాహంలో ఒకటికి రెండుసార్లు కాఫీలు సేవించి, అలవాటులేని వాళ్లతో సహా సిగరెట్లమీద సిగరెట్లు పీలుస్తూ అంతా నీటుగా తయారయ్యి బయలుదేరాము. చిరునామాలూ గిరునామాలూ ఇవ్వలేదు మావాడు. సత్యనారాయణ పురంనుంచి బందరురోడ్డు చివరవరకూ ఉన్న విజయవాడ పటాన్నీ అందులో మేం నడవవలసిన రూటునీ చిత్రించేడు - ఎక్కడ మళ్లాలో ఏ యింటిదగ్గర ఆగాలో అక్కడి గురుతేమిటో, ఏ గేట్లోంచి, పువ్వుల మొక్కల ప్రక్కనించీ వెళ్ళి వరండా చేరాలో—

వరండాలో అడుగు పెట్టేసరికి లోపలి గడియారం ఎనిమిది గంటలు కొడుతోంది. వాకిలి తెర తొలగించుకుని ఒక ఖటావ్ వాయిల్ ముగ్ధ పాండ్స్ సౌకుమార్యంతో, మెక్లిన్ చిరునవ్వుతో, బాటా జోళ్ల టకటకలతో మాకు ఎదురుసన్నాహం చేసింది.

ఈమె మా అందరికీ మరదలుపిల్ల అయి వుండవచ్చు. కోటవలెనున్న ఒక లక్షాధికారి భవంతిలోనే పాగావేశాడు మా శ్రీమంతుడు. ఈ పిల్ల అప్పగారే మావాడి శ్రీమతి అయితే - వాడి కలలు ఫలించినట్లే.

మా హృదయాల సంతృప్తి డ్రాయింగు రూములోని కుర్చీల నలంకరించింది. ఒక్క క్షణంలో మీ ఫ్రెండ్ వస్తారు—" అని అతి నాజూకుగా సందేశం చెప్పి కరిగిపోయింది.

మరి కొస్తసేపటికామె ప్రత్యక్షమయ్యి మమ్మల్ని లోపలకు నడిపించింది పెద్ద హాలులోంచి కుడిచేతి వరండామీదికి. పెద్ద టేబిల్. ఆంగ్లపద్ధతిలో కుర్చీలు చుట్టూ పేర్చివున్నాయి. ఒకవంక పూలమొక్కల కుండీలు. దర్వాజాలకు కర్టెన్లు. తూర్పు వేపున భార్యాభర్తలకు కేటాయింపబడిన రెండు కుర్చీలు. బల్లమీద రకరకాల తినుబండారాలు వేడి పొగలతో నిండుతున్నాయి. అంతా చకచక జరిగిపోతోంది సినీమా స్వయంవరంవలె...

మావాడు మెరపు తీగలాగ వచ్చేడు. కేటాయించబడిన ఒక కుర్చీలో అతి తేలికగా కూర్చున్నాడు—

"యేదిరా నీ శ్రీమతి" అనబోతున్నా—

"వొస్తోంది—" అన్నాడు.

ఇంకొకటి ఖటావ్ యువతి పనిదాని చేత కాఫీ కెటిల్లు దింపించి వెళ్లిపోతోంది. ఆమె ప్రసక్తే లేనట్లు తీరుబడిగా మాఅందరి కేసీ చూస్తూ మావాడు అందుకున్నాడు: కొంతసేపు మమ్మల్ని వేధించుకు తింటేగాని తన పెళ్లాం పూర్తి పరిచయం మాకు కలిగించేటట్లు లేదు!

"భార్య అంటే మంత్రి - రక్షకురాలు - రంభ - శక్తి.....వగైరా వగైరా అన్నీ మీ రెరుగుదురు. అటువంటి సర్వలక్షణసంపన్నురాలికోసం ప్రతి యువకుడూ కలలు కంటూ వుంటాడు. పూజలు చేస్తాడు. కృషిలో ఉరకమన్నా సంసిద్ధపడతాడు. కాని, అటువంటి స్త్రీలు అరుదు..."

గట్టిగా ఏ ఒక్క విషయంమీదా పాడి మాటలు తెప్పిస్తే అని యెరగని మా శ్రీమంతుడు ఏకబిగిని ఉపన్యసిస్తున్నాడు. వాడి కంఠానికి వుండే మార్దవానికి తోడు గంభీరత కూడా వచ్చిపడింది...

"కోటికి ఒక్కరుండడమే కష్టం అటువంటి స్త్రీ దొరకడం పురుషుడి పూర్వజన్మ సుకృతం ... ఎన్నో పుణ్యాలు చేసుకున్న ఆయుష్మంతుణ్ణి నేను! నా కలలన్నీ ఫలించేటట్లు, ఊహలన్నీ అనంతవిశ్వాంతరాళంలో ప్రతిధ్వనించేటట్లు, నా బాధాతప్త హృదయానికి శీతలమందాకినీ స్నానమిచ్చినట్లు... వెయ్యేందుకు? - ఈ జన్మఎత్తినందుకు చరితార్థుణ్ణిచేసే స్త్రీరత్నం నాకు లభ్యమయ్యింది..."

అంటూ పెద్దపోజు పెట్టి లేచి నిలబడ్డాడు. వాడివెనకాల్లి కర్టెను తొలగించుకుని పూలమాలాహస్తఅయి ఇందాకటి యువతి ప్రవేశించింది. శనిగాడి చిరునవ్వు చూపు నన్ను దూసుకుపోయింది. ఆమె కొంచెం వెనకగాతప్పుకుని అవనతవదనయై నిల్చుంది.

మావాడు మళ్ళీ అందుకున్నాడు ఉపన్యాసం ... నా ప్రక్కనున్న చంద్రుడు నన్నొక్కసారి గిల్లేడు. 'ఊఁ కానిద్దూ - వాడిష్టమొచ్చినంత టైము తీసుకోనియ్యి' అనే తలపూపుతోనే లేచి నిలబడ్డాను - ఆవిడగౌరవార్థం. మావాళ్లంతా కూడా సగౌరవంగా లేచి నిలబడ్డారు.

"ప్రథమదర్శనంలోనే నాలోని నరాలన్నీ ప్రేమగీతం పాడసాగేయి. వెంటనే ఆమెకు నివేదించుకున్నా. ఆరు నిండు నెలలు ఆమె నన్ను పరీక్షించింది..." అంటూ తన విరహజీవితం మాధ్య గడపిన దినాలుగా స్మృతికి తెచ్చేడు. "నా తపస్సు ఫలించింది. చివరకు, నాల్గురోజులక్రితం - ఆమె నన్ననుగ్రహించింది..."

ఈసరికి వెనకాల్లి కర్టెను మళ్లీ కదలసాగింది.


"ఆమె నా అదృష్టదేవత - "

నాకళ్లను నేనే నమ్మలేకపోతున్నాను. ఇంకో యువతి ముందుకు వచ్చింది - ఇంకో పూలమాలతో. నిజంగా అదృష్టదేవతే! ఖటావ్ యువతికంటే ఎంతో అపురూప రూపవతీ ప్రౌఢా అయినకన్య. లేతనారింజ రంగు సిల్కుచీరకు గులాబీపువ్వుల జాకె

(34 వ పేజీ చూడండి)



కోణార్క శిల్పం



భువనేశ్వరశిల్పం

—ఫొటోలు: కమరుద్దీన్ ఖాన్, కటక్.

వనితాలోకం

మహిళా సంఘాలు ★

"రెండవ భార్యతో సమానముగా మొదటి భార్యకు (బేగము హామీదా) గౌరవ ప్రతిపత్తులు ఇవ్వవలసిన ద"ని అఖిల పాకిస్తాన్ మహిళా సంఘము పాకిస్తాను ప్రధానిని, ఈ నెల మొదటి వారములో, ఒత్తిడిచేసింది.

"బేగము హామీదాకు సంపూర్ణ స్వాతంత్ర్యము ఉంటుంది. ఆమె స్వేచ్ఛకు భంగము కలుగదు" అని ప్రధాని హామీయిచ్చాడు. "స్త్రీల హక్కుల విషయములో అవసరమైన మార్పులను చేయాదలచాము. త్వరలోనే ఒక కమిటి ఏర్పాటు కాబోతున్నది. సంపూర్ణాధికారముగల ఆ కమిటీదే తుదినిర్ణయము. వివాహాలు, విడాకులు, సంతానపోషణ, వారసత్వము మొదలైన విషయాలలో మార్పులు చేర్పులు జరుగుతాయి. వీటి వివరాలు నా రేడియో ప్రసంగములో తెలుపుతాను" అన్నాడు పాకిస్తాన్ ప్రధాని.

కుటుంబములో ఒకానొక స్త్రీకి జరిగిన అన్యాయానికి మహిళాసంఘము మాటలతోనే సానుభూతి ప్రకటించలేదు. దానికి తగిన చర్య తీసుకోదలచటము, కొంత ఆందోళన సలపటము ప్రశంసనీయము. ఆ ఒకానొక స్త్రీ ప్రధాని ప్రథమ భార్య కావటము తటస్థించింది. ప్రధానియొక్క ద్వితీయ వివాహ ఫలితముగా పాకిస్తానములో స్త్రీల హక్కులలో సంస్కరణలు జరుగబోతున్నాయి

సంఘములో స్వేచ్ఛగా మెలగగలిగిన వారు పైతరగతికీ క్రిందితరగతికీ చెందినవారై ఉంటారు. ఈ రెండు తరగతులలో క్రింది తరగతిమీద ప్రజాదృష్టి ఎక్కువ పడకపోవటముచేత విమర్శలు బయలుదేరవు. పైతరగతిమీద ప్రజాదృష్టి పడినప్పటికీ విమర్శలు బయలుదేరే అవకాశము తక్కువ. దీనికి కారణము—తగిన ధైర్యము, అవకాశము, మార్గము లేకపోవటమే. కాని ఇప్పుడు పరిస్థితులు మారిపోయినవి. దేశాభ్యుదయ దృష్ట్యా, సంఘశ్రేయోభిలాషులు ఎవరి చర్యలనయినా విమర్శించవచ్చు; సలహాలనిచ్చి సరిదిద్దవచ్చు. ప్రజలకు అటువంటి అధికారము ఉన్నది. పాకిస్తాన్ మహిళా సంఘము సరిగా ఈ మార్గమునే అనుసరించింది.

తన మతానుసారము తిరిగి వివాహమాడే అధికారము ప్రధానికి ఉన్నది; అది ఆయన స్వవిషయమే - అయినప్పటికీ, పాకిస్తాన్ మహిళా సంఘాలన్నీ ఏకమై ఒక స్త్రీ గౌరవ ప్రతిపత్తికొరకు ఆందోళన సలిపి, దేశములోని ఇతర సంస్థలకు దారి చూపించాయి.

అహమదాబాదులో ఒక వర్తకుడు తన 50 వ ఏట పదిహేను సంవత్సరాల వయసు గల బాలికను వివాహము చేసుకొన ప్రయత్నించగా సంఘసేవాపరాయణలైన స్త్రీలు సత్యాగ్రహము చేసి ఆ వివాహము జరుగకుండా చేశారు.

స్త్రీలలో ఐకమత్యము ఉన్నట్లయితే సాధించలేనిదంటూ ఉండదని మరొకసారి లోకానికి ఈ విషయాలవల్ల ఋజువయింది. ఐకమత్యమే కాదు - సానుభూతి భూత, దయ ఉన్నట్లయితే ఎన్నిటినయినా సాధించవచ్చు. మనను ఈనాడు సంఘములో అనేకసమస్యలు ఎదుర్కొంటున్నాయి. అన్ని సమస్యలూ చట్టాలతో తీరిపోయేవి కావు. సంస్కారముచేత చక్కబడేవి కొన్ని ఉన్నాయి.

పల్లెటూరు పట్టణము అన్న వ్యత్యాసము లేకుండా- విద్యావంతులు అవిద్యావంతులు అన్న విచక్షణ లేకుండా - సంఘములో ఈనాడు మనకు కనబడుతున్న దురాచారాలు ఎన్నో ఉన్నాయి. దురాచారమని గట్టిగా నిరూపించలేనివీ ఈనాటి సభ్యతకు లోపించినవీ కొన్ని అలవాట్లు ఉన్నాయి. వాటిలో కొన్ని మచ్చుకు: ఒక్కొక్క స్త్రీ వేకువజామున లేస్తుంది. తిరిగి రాత్రి పదకొండు గంటలకుగాని పడక చేరలేదు.

పిల్లలకొరకు భర్తకొరకు ఆమె చేయని త్యాగములేదు; జీవితమంతా ధారపోస్తుంది. తనకు అర్ధాంగి, తన సంతానానికి తల్లి అయిన భార్యలను కొందరు భర్తలు నమ్మి డబ్బు చేతిలో పెట్టలేరు. ఉదయము లేచి నప్పటినుంచీ కూరకు పావలా కావాలి - చీపురుకట్టకు అణా కావాలి - తలలో పెట్టుకొనే పూలకు బేడ కావాలి అంటూ ఆ గృహిణులు అభిమానము చంపుకొని - ఎన్నేళ్లు వచ్చినా చిన్నపిల్లలమాదిరిగా ఎంతమందిలోనయినా అడగవలసిన గతి పడుతూనే ఉంటుంది.

ఎంత విద్యావంతులైనా - ఈకాలములో కూడా భార్యను దండించవలెనన్న భావము కొందరిలో ఉదయించక మానటము లేదు.

★ మహిళా సంఘాలు ★

దుర్వ్యాపారాలను మాననివారుకూడా ఉన్నారు. పురుషుడికి అనుకూలముగా స్త్రీ తన జీవితాన్ని మలచుకోవలసినదే గాని స్త్రీకి అనుకూలముగా పురుషుడు చిన్న మెత్తు పని చేయదలచడు.

ఇటువంటివి స్త్రీల జీవితాలనుండి అనేకము ఎత్తి చూపించవచ్చు. కొన్ని దృష్టాంతాలలో పురుషుడు భార్యను పోషించుతూ తన యింట్లో ఉండనిచ్చినంతమాత్రాన ఆమె జీవితము ఆనందదాయకమని చెప్పటానికి వీలులేదు. అటా అని ఏ చట్టాన్నయినా ఆశ్రయించటానికి పైకి చెప్పుకోనే కారణాలూ కనబడవు. ఈ విషయాలన్నీ అతిశయోక్తిగా కనుపించినా అసహజమూ అసాధారణమూ మాత్రము కావు. ఇవన్నీ సంకుచిత స్వభావమువల్ల వచ్చినవి; సహృదయత్వము లోపించినందువల్ల కలిగిన లోపాలు.

కీ. శే. కందుకూరి వీరేశలింగము, గురజాడ అప్పారావుగార్ల కాలమునుండీ వరకట్న కన్యాశుల్క నిర్మూలనముకొరకు తీవ్రప్రచారము జరుగుతూనే ఉన్నది. కాని అవి అమర్యాదకరమైనవిగా ఈనాటికీ చాలామంది ఋజువు చేయలేకపోతున్నారు. కట్నాలు లేని వివాహాలు తమ హోదాకు తక్కువ అన్న భావము చాలామంది మనసులలో ఇంకా మెదులుతూనే ఉన్నది. సంప్రదాయము, కులము, గోత్రము గుణము చూసి పిల్లను చేసుకోవటము ఇంకా అరుదుగానే ఉన్నది తత్ఫలితముగా వివాహాల సమస్యలు అంతకంతకు అభివృద్ధి పొందుతున్నాయి. ఈ వరకట్నాలలో అంతర్నాటకాలు కూడా బయలుదేరుతున్నాయి. 'వారేమీ ఇవ్వలేదు. వీరేమీ తీసుకోలేదు' గానే పైకి కనబడుతుంది గాని మగపెళ్ళివారి హోదాకు భంగము రాకుండా అంతా నడుస్తుంది.

వివాహాది కార్యాలక్రింద అధికవ్యయము చేయటము మనము ఘనముగా భావించుకుంటున్నాము. ఒకరికి పెట్టినదీ తాను తిన్నదీ కాకుండా వృధాఖర్చులు కొన్ని ఉన్నాయి. పందిళ్ళకూ, దీపాలకూ, నాటకచేరీలకూ కొంత పైకము ఖర్చవుతుంది. ఈ ఖర్చులవల్ల కన్యాదాత ఆర్థికస్తోమత దిగనాసిల్లిపోతుం దనటములో ఆశ్చర్యములేదు. ధనవంతుల ఇండ్లలో ఒక బిడ్డ పుట్టినరోజు పండుగకు అయ్యే ఖర్చు పేదవారింటి పెళ్లి ఖర్చుకంటె అధికము. ఈ ధనమే దేశాభివృద్ధికీ సంఘాభివృద్ధికీ వ్యయము చేస్తే ఎంతో ఉపయోగకరముగా ఉంటుంది. నిరాడంబరజీవితము ఉదాత్త భావచింతనము (*Simple living and high thinking*) మానవ జీవితలక్ష్యముగా భావించబడ్డది కాని భోగయుతమైన జీవితము కాదు.

ఇవన్నీ చట్టాలతో శాసనాలతో చక్కబడేవి కావు; మానసిక పరిణామము కావాలి. మహిళాసంస్థలు పూనుకొని ప్రజల మానసిక పరిస్థితులను ఉన్నతస్థాయికి తీసుకొనివచ్చే ప్రయత్నము చేయాలి.

మహాత్ముడొకసారి స్త్రీల హక్కులను గురించి చెప్పుతూ 'కృషి చేసేవాళ్లకు విశాల దృష్టి అవసరము మనకు లోపము లేదు కదా అని ఇతరులకు కూడా కొరత లేదనుకోవటము పొరబాటు. ఏ విషయము చర్చించినా జనసామాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని చర్చించాలి' అన్నాడు. జనసామాన్యము యొక్క జీవితావసరాలు సమస్యలు ఎటువంటివో తెలిసికొని ఉండాలి వాళ్లకు ఉపయోగకరముగా - వాళ్ళ అభ్యుదయము కొరకు మహిళా సంస్థలు ఏర్పడి కృషి చేయాలి. ప్రతి మహిళాసంస్థకు ఒక వైద్యశాల ఒక న్యాయసలహాదారు ఉండటము ఎంతైనా అవసరము. మహిళాసంస్థలు సంఘపునరుద్ధరణకు పూనుకోవటము ఈ కాలములో అనవసరమని కొందరు అభిప్రాయపడుతున్నారు. సంస్కారము దిద్దుబాటు ఏనాటికీ అవసరమే. దేశాభ్యుదయానికీ సంఘాభ్యుదయానికీ ప్రజాధనముతో సంస్థలు ఏర్పడుతున్నాయి; కాని వినోదవిహారాలకొరకు కాదు. స్త్రీలు తమలో ఉన్న తరతమ భావాలను అంతమొందించుకొంటేనే గాని మహిళా సంస్థలు కార్యరంగాలుగా మారలేవు.

సంస్థలు గాని వ్యక్తులు గాని ఏ ఉద్యమము నడిపినా, ఆందోళన సలిపినా ఉద్రేకము గాని స్వార్థము గాని మనసులలో ఉండకూడదని గాంధిమహాత్ముడు తన అనుయాయులకు పదేపదే చెప్పుతూ ఉండేవాడు. ఈ రెండిటిలో ఏ ఒక్కటి ఉన్నప్పటికీ ఉద్యమములో సత్ఫలితము రాదు. పాకిస్తానులో మహిళా సంస్థలు బహుభార్యాత్వమును నిర్మూలనము చేయాలన్న సద్భావముతో ఆందోళన చేశాయి. తత్ఫలితముగా స్త్రీల హక్కులలో సంస్కరణలు లభించబోతున్నాయి. కాని ఆ ఉద్యమములో వివాదాలు బయలుదేరటము, కొందరు పురుషులు ఆగ్రహపరులై ఎదురు తిరగటము సంభవించింది. చలనచిత్రాలలో స్త్రీల అర్ధనగ్న స్వరూపాలను, ప్రదర్శనమును (*Exhibitionism*) మోడు వేడుకపడే పురుషులు, స్త్రీల వేషధారణలో అణకువ మర్యాదలు, నృత్యములో అసభ్యతలను గురించి శ్రీరంగనీతులను చెప్పబూనుకోవటము, స్త్రీలను గురించి అసభ్యకరములైన ప్రసంగాలను చేయటము, వాల్ పోస్టర్సు గోడలకు అంటించటము వరకూ వచ్చింది. ఇప్పుడు పాకిస్తానులో స్త్రీల ప్రచారము, పురుషుల తిరుబాటు శృతిమించినదనే చెప్పాలి. సంకల్పశుద్ధిగల మహిళలు దాని నిర్వహణాలోకూడా తగిన జాగ్రత్త వహించటము ఎంత అవసరమో దీనివల్ల రూఢి అవుతున్నది. ★

ధర్మపత్నీ సమేతస్య....

శోభాయమానంగా ఉన్న పందిరి లోంచి గుమ్మంలోకి అడుగు పెట్టాడో లేదో, అతనికి వాళ్ళ మామయ్య ఎదురయ్యాడు, ఎక్కడికో వెడుతూ.

"అమ్మాయిని తీసుకురాకుండా ఒక్కడివీ వచ్చావేరా?" అని అంటూ గబగబా వెళ్ళిపోయాడు తన సమాధానం వినకుండానే. అతని మనస్సు చివుక్కుమంది. తను వస్తే సరిపోదన్నమాట! ఆమెని కూడా తీసుకువచ్చినప్పుడే తన రాకకి పరిపూర్ణత కలుగుతుందన్నమాట!

లోపలికి ప్రవేశించగానే తాతగారు "ఏంరోయ్, యిదేనా రావడం? ఒక్కడివేనా వస్తే? లోపలికి వెళ్ళు," అంటూ తల వంచుకుని చుట్ట చుట్టుకోవడంలో నిమగ్నులయ్యారు.

ఒక్కణ్ణే వస్తే యింత ఆరా వస్తుందని తనకి తెలియలేదే! అయినా ఆమెని ఎలా తీసుకువస్తాడు...

ఈ ఆలోచనల్లో ఉండగానే బామ్మ ఎదురై "రారా! ఇంత ఆలస్యం అయిందేం? నిన్న సాయంత్రానికే వస్తావనుకున్నా. రా! కాఫీ ఫలహారం తీసుకుందు గాని" అంటూ లోపలికి వెళ్ళిపోయింది, తను 'వద్దు యిప్పుడే తీసుకున్నా' అంటున్నా వినిపించుకోకుండా.

అమ్మయ్య! బామ్మకి ఒక్కత్తెకీ తను ఒక్కణ్ణే వచ్చినా యింకోలా యేమీ తోచలేదు అతను పెళ్ళికి రావడం ముఖ్యంగాని ఎవరు వస్తేనేం. ఈమాత్రం...

ఇంతలోకే బామ్మ వచ్చేసింది. ఒకచేత్తో అరటాకులో ఫలహారం, రెండోచేత్తో ఒక గ్లాసుతో కాఫీ పట్టుకుని. అక్కడే ఒక పీటదగ్గర పెడుతూ "రారా! యిక్కడ కూర్చో అవును గాని అదేదిరా? లోపలికి వెళ్ళిందా? దాన్నికూడా రమ్మను..." మధ్యలోనే సమాధానం చెప్పేశాడు "తీసుకురాలేదు బామ్మా! ఒంట్లో బాగోలేదు. మంచు పట్టుకుంటోంది. అందుకని..." "అందుకని తీసుకురావడం మానేస్తావుట్రా? మేటికి మంచిపనే చేశావు. సరేలే కాఫీ చల్లారిపోతోంది", అంటూ ఇంకో పని చూచుకోడానికి వెళ్ళిపోయింది

ఇంక అతనికి ఆ కాఫీ యేం సహించలేదు వచ్చిందిలగాయతు అందరూ ఒకటే ధోరణి. తను వచ్చినందుకు ఒక్కళ్లూ హర్షం వెలిబుచ్చరేం? ఒక్క ఆమె రాకపోతేనే లోటు అన్నమాట! అంటే తనకి ఎంత హోదా, చదువు సంధ్యలు ఉన్నా, ఆమె లేకపోతే - ముఖ్యంగా యిలాంటి శుభకార్యాల సాంఘిక సమ్మేళనాల్లో - తనకి వ్యక్తిత్వం లేదన్నమాట పురుషుడికి, తనకి తానై, గౌరవం పొందే అవకాశం లేదన్నమాట స్త్రీ లేకుండా ఆఖరికి బంధుకోటిలోనైనా సరే! అబ్బ! మన సాంఘికాచారాలు యింతలోతుకు వేళ్లూని నిలిచిపోయాయన్నమాట!

అయినా తను ఎలా తీసుకువస్తాడు? రోజూ ఉండే ఆ మానసికావేదన తగ్గించుకుని ఒకటి రెండు రోజులైనా హాయిగా కులాసాగా కాలక్షేపం చేయ్యాలని కదా తను ఒక్కడూ వచ్చింది? ఆమెని కూడా

ఆర్. సూర్యనారాయణ

తీసుకువస్తే యిక్కడ, యింతమంది దృష్టిలోనూ తను చులకనై, తన దౌర్భాగ్యానికి ఎంత కుందిపోవలసివస్తుందో వీళ్ళకేం తెలుసు? ఆ పెళ్ళిలో రంగు రంగుల అలంకారాలతో తిరిగే సుందర యువతులు - వివాహితలు, అవివాహితలు కూడా - తన స్థితిని జ్ఞాపకం చేసినట్టు, వాళ్లతో పోల్చుకుని తన దురదృష్టాన్ని ప్రత్యక్షంగా చూడ్డం తప్పనిసరి అయినట్టు, తను బాధపడడం యిష్టంలేకే ఆమెని తీసుకురాలేదు. ఇందులో తాను స్వార్థంతో ప్రవర్తించినా, తాత్కాలికంగానైనా మానసిక అశాంతిని తగ్గించుకోవడంకోసం తాను ప్రయత్నం చెయ్యడం స్వార్థం కాదని సర్దుకున్నాడు.

ఇదంతా తెలియక తన బంధువులందరూ మానిపోతున్న తన గాయాన్ని రేపడానికే ప్రయత్నించారు. ఆ పెళ్లికి తన అత్తగారు కూడా రావడం అతనికి మరింత బరువుగా తోచింది. తన కూతురును తీసుకురాలేదంటే ఆమెకి యేం జవాబు చెప్పడం? తప్పుకుని తిరిగాడు సాధ్యమైనంతవరకూ!

రాత్రి భోజనాల వేళ తన వయస్సువాళ్ళు, అంతకన్నా పెద్దవారూ కూడా, పట్టుపంచెలు అందుకోవడంలోనూ, వెండిచెంబులు సంపాదించడంలోనూ, పొందే ఆనందసౌభాగ్యాలు తనకి లేకపోవడం అతనికి కొంచెం వెలితిగానే తోచింది తను ఒక్కడూ వెళ్లి సంచీలోంచి అన్నీ తీసుకుని, మళ్లీ విడిచినవి జాగ్రత్తగా మడత పెట్టుకోవలసి వచ్చింది.

భోజనం చేస్తూన్నంతసేపూ, ఆ తర్వాత కూడా అతను ఆలోచిస్తూనే ఉన్నాడు, భార్యాభర్తల సంబంధాన్ని గురించి; భార్య లేకుండా భర్తకి సంఘగౌరవం లేకపోవడమే కాదు, మానసికంగా యేదో లోటు అనిపిస్తుంది కూడానా? ప్రాచీన హైందవ వైవాహిక మంత్రాల్లో అలాంటి మహత్తరశక్తి యిమిడిఉందా? ఆ కర్మకాండద్వారా పురుషుడికి వచ్చిన భర్తృస్థానానికి మూలకందం భార్యయైన స్త్రీయేనా? వేదమంత్రాలు కూడా స్త్రీకి అంత విలువ యిచ్చాయా?

ఈ సందేహాలతో అతను వివాహ కర్మకాండ అంతా శ్రద్ధగా పరిశీలించాడు. ఏ కర్మ ఆదరించడానికైనా సరే ఉద్యుక్తుడయ్యే పురుషుడు మొట్టమొదట 'ధర్మపత్నీ సమేతస్య' అని అనకుండా చెయ్యడానికి వీలులేదు. సమస్త సభాసమ్ముఖాన తన ధర్మపత్నీ సమేతత్వము చెప్పుకున్న తరవాతనే అతనికి యేం చేయడానికైనా అనుమతి! ధర్మపత్నీ సమేతస్య కానివాడికి యే గౌరవం లేదన్నమాట!

ఆ మరునాడు దంపత్తాంబూలంతతంగం జరుగుతూంటే అనుకోకుండానే అతను ముఖ్యపాత్ర వహించవలసి వచ్చింది. దంపతులను సమకూరుస్తుంటే, నూత్న వధూవరుల మునుసిగ్గు, ప్రౌఢదంపతుల పూర్వ మధురస్మృతుల వ్యక్తీకరణ, వృద్ధదంపతుల అన్యోన్యత యివన్నీ అతనికి యేదోలా తోచాయి. క్షణకాలం అతను కూడా ఆ ఆనందంలో భాగస్వామి అయ్యాడు. ఇంతలో ఎవరో తననిగురించి వేళాకోళం ఆడారు. తనకి ఆ అవకాశం లేదు కనక తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోమని - కొంచెం సిగ్గుతో రెండో ప్రక్కకి ముఖం తిప్పేటప్పటికి, అత్తగారు తనవైపు చూసిన చూపుల్లో యేదో బాధ కనిపించిందతనికి. "ఈ సరదాలు లేకుండా చేశావుకదా దానికి!" అని అంటూన్నట్టు.

ధర్మపత్నీ సమేతస్య...

ఇంక అతను అక్కడ ఉండలేక పోయాడు. అనుకున్న దానికంటె ముందుగానే ప్రయాణం అయ్యాడు. గుమ్మం దాటబోతుంటే వెనకాలనుంచి వినిపించింది:

"వెళ్ళిపోతున్నట్టున్నాడు. పసుపూ కుంకం అవీ యిచ్చారా వాడికి." కిలకిలలు వినిపించి వెనక్కి చూశాడు. వరసకి మరదలైన ఒక యువతి కొంటె నవ్వుతో అంటోంది. "అవును, మరి ఆవిడని తీసుకు రాలేదుకదూ! అందుకని యిదైనా పట్టుకెళ్ళి యియ్యి." ఏం చెయ్యలేక తను కూడా నవ్వాడు.

హాలు దాటి వెడుతోంటే ప్రక్కగది లోంచి వినిపించింది పురోహితుడిగారి గంభీరస్వరం "...ధర్మపత్నీ సమేతస్య.... మమ...కరిష్యామి." ★

సుందర సూర్యగ్రహణం

(27 వ పేజీ తరువాయి)

ట్టుకూడా తన బంగారువన్నె శరీర కాంతితో నిరెండ శుభాశింపు ఇవ్వసాగింది. "మేమిద్దరమూ మీ అందరి ఆశీర్వచనాలకూ ఎదురుచూస్తున్నాం" అని ముగించేడు మా వాడు.

ఆ అమ్మాయి మావాడికి కొంచెం ఎడం చేతి వేపు మళ్ళి నిలుచుంది. బరువుతీరిన నిశ్వాసలు మా అందరినించీ వెడలేయి.

మావాడు ఇంకా నిలపడే వున్నాడు – కరిగయవాక్యా లందుకోలేదు. నే వాడి వేపు తీవ్రంగా చూశాను. ఇంకా ఎవరి కోసో వా డెదురుచూస్తున్నట్టున్నాడు.

నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ లోన గదిలో జోళ్ళ చప్పుడయ్యింది. కర్టెను సందుల్లోంచి ఒక క్షీరాబ్ధి ఝరీఅంచు గోచరమయ్యింది. తల సవరించుకుంటున్న గాజులసవ్వడి వినిపించింది. నన్ను ఒక ఆత్రుత, ఒక ఉత్సాహం, ఒక ఆశ్చర్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఆ తెర వెనకాల "కలదు సత్యభామ!" సినీమా ఫక్కీలో ప్రవేశపెడుతున్నాడు తన భార్యను. "అంతకంతకు అధికమౌ రుచుల" అన్న వైష్ణవ సాంప్రదాయపు విందువలె మా కళ్ళకూ, మనస్సుకూ ఆతిథ్యమిస్తూ, తన భార్యయొక్క రూపసౌందర్యాల ఘనతను ఒక్కొక్క మెట్టే అంతరిక్షాని కెక్కిస్తున్నాడు.

ముందు వచ్చిన యువతు లిద్దరూ కేవలం ద్వారపాలక సుందరులే అనే సంగతి మావాళ్ళందరికీ గ్రహింపయిన సంగతి వాళ్ళ ముఖారవిందాలే చెప్తున్నాయి. శ్రీమంతుడి కవితాహృదయాన్ని శనిశాస్త్రి అమోఘంగా ఆనందిస్తున్నాడు.

నిశ్శబ్దం కొంపముంచేస్తోంది.

మళ్ళీ నేపథ్యాన జోళ్ళచప్పుడు... గాజుల చప్పుడుతో తెర తొ[illegible]గింది... అంతే...ఒక స్వరూపం ... ఒక పర్వత వర్ధని...కదలి ముందుకువచ్చింది...మావాడి ప్రక్కను నిలిచింది – అందింపబడిన మాలలతో ఒకరినొకరు అలంకరించుకుంటున్నారు—

నాకు కడుపులో పేగులు మెలితిపడసాగేయి. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. మావాడు ఆప్యాయతతో ఒక గవిడిగెడ మెడమీద చెయ్యివేసి ఫొటో దిగుతున్నట్లవుతోంది...

ఏదో పుష్పవర్షం కురిసింది. చప్పట్లు వినపడుతున్నాయి. నాకు చైతన్యం తిరిగి వస్తోంది.

మా గ్రహ పెద్ద, శనిశాస్త్రి రుద్ధకంఠం, ఆశీర్వచన వచనాన్ని పద్యవరసలో కీచుమంటోంది—

సగం తూలిన నా ప్రక్క శుక్రుడు నా భుజాలను వేళ్ళాడుతూ నిలపడుతున్నాడు.

గుండెల్లోంచి ఉబికివస్తున్న ఏడుపు నాపుకుంటూ నావంక చూస్తున్నారు రాహుకేతువులు. భూదేవి నిజస్వరూపం నా కర్థమవుతోంది. బుధుడు ద్వారపాలకు [illegible]ంగుతున్నాడు. చంద్రుడు కళ్ళలో [illegible]ను తీసుకుంటున్నాడు. కుజుడు యుద్ధంలో ఓడిపోయి ఫిరంగి గుండుకు ఎదురుగా నిల్చున్న వీరుడి మొహం పెట్టేడు.

రెట్టింపు చేసుకున్న కంటిపాపలతో చూస్తున్నాను, మా సూర్యుణ్ణి పెళ్ళి అనే పేరుతో పూర్తిగా మింగివేసిన ఆ మనిషిని—

నలుపుకు కూడా గంట్లు పెట్టిన ఆ భగవంతుడిమీదా, ఒడ్డూ పొడుగూ ఒకేవిసంగా పెంచిన 'విటమిన్లు' మీదా, రాక్షసిబొగ్గను అమూల్య వస్తువును చేసిన ఈ లోకంమీదా నాకు రోత పుట్టుకువచ్చింది.

ఇంతకీ—ఆమె—

తారకాసుర సంహారానంతరం అప్సరసలు కీర్తిస్తూవుండగా భక్తకోటిని ప్రసన్నవదనయై తిలకిస్తున్న భద్రకాళి!

మా శ్రీమంతుడికంటే పదేళ్ళు పెద్దదీ, లోగడ యుద్ధంలో పోగొట్టుకున్న భర్తను గలదీ, ఈమధ్యనే ఈ వూరికి దిగుమతి అయి వేనకువేలు ఆర్జిస్తున్న డాక్టరు రూపలక్ష్మి, వర్తమాన మిసెస్ శ్రీమంతుడు—

—ఒక పర్వత వయ్యారంతో మా అందరినీ చిరునవ్వు సిగ్గుదొంతరలలో ముంచుతోంది. ★



కన్న తల్లి

కవిరావు

అమ్మా! మాబడికి పంతు
లమ్మగారు వచ్చారే.
బండపంతులా రేటికో
బదిలీయై పోయారట.

పంతులమ్మ నిజముగాను
ఎంతో మంచివారమ్మా,
కొట్టదసలు, బలేబలే
పిట్టకథలు చెపుతుండే.

నూతి దిబ్బమీద రెండు
తీతువ పిట్టలు గల్వట,
చెట్టుమీద గూడుకట్టి
పెట్టుకొన్నవంట గుడ్లు.

పెంటిది రెక్కలు గప్పి
పొదుగుడు ప్రారంభించి
పున్నమ జారబడగానె
పిల్లలు చేసిందంట.

పోతు దొక్కనాడు ప్రొద్దు
పోయి గూడు చేరగానె
పెంటిపిట్ట మగనిని గని
కంట నీరు పెట్టిందట.

'ఏమే'మని మగ డడుగగ
"ఏమని నే చెప్పుకొందు?
పెత్తనాలు చేసి యిప్పు
డొత్తురుగద యింటివైపు.

మిన్ను విరిగిపడితే నా
కన్నవార లేమౌదురు?
ఏ దేవునిపుణ్యానో
ఇంతవరకు నిలిచెగాని.

కన్నవారిచూస్తుంటే
కన్ను మూతపడదాయెను"
అని వలవల పెండ్లమేడ్వ
అన్నదంట పోతుపిట్ట:

"ఇంతగొడవ దీనికేన?
ఇంతగ భయపడితివీవు
కాళ్ళు పైకిచూపి నీవు
కళ్లు మూసుకొంటే సరి.

అంతగ పైబడితే నే
నంతు దేల్చకుంటానా?"
అని కాళ్ళను పైకిచూపి
ఆలిని నిద్దురపుచ్చెను.

తెలతెలవారంగ మగడు
తీరికగా లేచిచూచి
"ఎన్ని 'దమ్ము' లుండవలెను
మిన్నువిరిగి పడుట" కనెను.

'కన్నవారి నెపుడు వేయి
కన్నుల కనిపెట్టి యుండు
కన్నతల్లి' అని మాకీ
కథ చెప్పెను పంతులమ్మ.

పంతులమ్మ చెప్పుచు ను
న్నంతసేపు నీవు నాన్న
కథలో నున్నట్లె నాకు
కన్నుల బొడకట్టినారు.

నిజముగ నాన్నారులేని
నిసిరాతిరి మనకు భయము,
అందుకె నీ ప్రక్కజేరి
అంటియుండి పండుకొందు.



దేగ - తాబేలు

చాలకాలము పూర్వము
జలములందలి కూర్మము
చెట్టుపై గల దేగతో
చెలిమిచేసినది


నింగిమబ్బులదాకను
నిత్య మెగిరే దేగను
చూచి తాబే లెప్పుడూ
చోద్యమందెడిది.

మేఘమార్గమునందున
దేగలా విహరించిన
ఎంత సుఖమని కూర్మమూ
ఎంచుచుండెడిది.

'దేగ బ్రదుకే మధురము
దేగ బ్రదుకే సహజము
చెరువుబ్రదుకిది దేని'కని
చింతనొందినది.

"నీకువలెనే ఎగురగ
నాకు పుట్టెను కోరిక,
ఎగురుటెట్లో నేర్పు"మని
ఎంతొ వేడినది.

"నీటనుండెడిదానవు,
నింగికెట్టులు పోదువు?
ఉన్నచోటే తృప్తితో
ఉండు" మనె దేగ.



ఈసప్ కథలు : 2

నండూరి రామమోహనరావు

“రెక్కలైనా లేకనె
పక్కి సైతము ఎగురునె?
ఎందుకొచ్చిన తిప్ప”లని
మందలించినది.


కాని వదలక పంతము
శ్యేనమును బలవంతము
కూర్మ మెంతో చేసెనూ
కర్మవశమునను.

డేగ అంతా విన్నది,
నీగతింతే నన్నది.
రెండుకాళ్ళతో పట్టుకుని
రివ్వునెగిరినది.

మింటి మబ్బుల కొసలను
అంటుకొని తాబేలును
‘చేతనైనచో ఎగురు’మని
చెప్పి వదలినది.

కాళ్ల తటపట కొట్టుచు
కళ్ల తేలగవేయుచు
వెర్రి తాబే లెక్కడో
గిర్రుమని పడెను.

చచ్చిపోయెను పాపము
కచ్ఛపమ్మని శ్యేనము
ఎంతగా దుఃఖించినా
ఏమి లాభమ్ము?



నీతి

తనకు చేతగాని పనులు
తగుదునంచు చేయబూను
మూఢుడెపుడు కూర్మమువలె
కీడు తెచ్చుకొనునుగాదె!

ధర్మాత్ముడు

— శ్రీ ఆరాధ్య

శ్రీవిబక చిన్నపల్లె. ఆ పల్లెలో ఒకే ఒక్క పెద్దఇల్లు ఉన్నది. అది ఒక ధనవంతునిది. ఆయన ఒంటరి గాడు. పెళ్లాం, పిల్లలులేరు. చిన్న ప్పటినుండి ఉంటున్న ఒక నౌకరు మాత్రమే ఆయనకు అండగా ఉన్నాడు.

ఆ పల్లెచుట్టూ కంటికి ఇంపైన దృశ్యాలున్నాయి. కొంచెం దూరంలో ఒకకొండ. ఆకొండ ప్రక్కగా ఒక చిన్నవాగు ప్రవ హిస్తూ ఉంటుంది. ప్రతిరోజూ ఆయన సాయంత్రంపూట నౌక రును వెంట బెట్టుకొని ఆ కొండ వైపుకు షికారు వెళ్తుంటాడు.

సాయంత్రపు ఎండలో ఆకొండ మెరిసిపోతుంటుంది. పచ్చటి కంబళి పరచినట్లుండే పచ్చగడ్డిలో, అక్కడక్కడ తెల్ల తెల్లగా ఆవులు కనిపిస్తుంటాయి. ప్రొద్దుగ్రుంకే వేళకు ఆవులన్నీ కొండమీదినుండి దిగివచ్చి, యింటిదారి పడుతుం టాయి. కడుపునిండా తృప్తిగా మేసి కన్నదూడలు ఆకలితో ఎంతగా అలమటించి పోతున్నాయో అన్న ఆత్రుతతో గబగబ యిళ్లకు పోయే ఆ ఆవులనుచూసి ఆయన ఆనందిస్తూ ఉండేవాడు. వాగు మీదినుండి వచ్చే చల్లని పిల్ల గాలులకు గుడ్డలు రెప రెప లాడు తుండగా, సుందర ప్రకృతి దృశ్యా లనుజూచి మురిసిపోతూ చీకటి పడే దాకా తిరిగి, తరువాత యింటికి వెళ్లేవాడు ఆయన.

ఇలా కాలం గడుస్తున్నది. ఒక నాడు ఆయన చల్లగాలికి తిరుగుతూ ఉండగా, కొండప్రక్కన ఉన్న కాలిబాట వెంట నలుగురు మను ష్యులు వస్తూ కనిపించారు. ఆ నలు గురూ ఒకే కుటుంబంవారు. ఒక పేదరైతు, అతని భార్య, ఇద్దరు పిల్లలు. తలా ఒకమూట చేతితో పట్టుకొని పోతున్నారు. వారికళ్లు, దవడలు లోతుకు పీక్కుపోయి ఉన్నాయి. నీరసంగా, నిస్సత్తువగా నడుస్తున్నారు. వారిని చూడగానే ఆయనకు జాలివేసింది.

వారందరూ ఆయనకు దగ్గరగా వచ్చారు. ఆరైతు "బాబూ పై ఊరు ఇక్కడికి ఎంతదూరం ఉం టుంది?" అని అడిగాడు.

"నాలుగు మైళ్లుంటుంది."

"అమ్మో! నాలుగు మైళ్లే!" అన్నారు పిల్లలు దిగాలపడి.

"ఆఁ! ఎంతసేపు పడుతుందిలే! చీకటిపడే వేళకు చేరుకుంటాము" అన్నాడు రైతు.

"మీదియేఊరు? ఎక్కడికి వెళ్లాలి?" అని అడిగాడు ఆయన.

"మాది పడమట ఒక పల్లె బాబూ! ఈ యేడాది వర్షాలు పడ లేదు. పంటలన్నీ మాడిపోయి నాయి. పొట్టకూటికి గడవక, అలా



ఎగువఊళ్లకెళ్లి కూలి నాలి చేసు కుందామని బయలుదేరాము." అని చెప్పి రైతు మళ్లా నడకసాగించాడు.

కాళ్లీడ్చుకుంటూ తక్కినవారు బయలుదేరారు.

ఆ మాటలు విని ఆయన హృదయం ద్రవించిపోయింది. తక్కిన సుఖాలమాట దేవుడెరుగు. మనిషికి తింటానికి తిండి లేక పోవటం! ఆయన కళ్ల వెంట నీళ్లు కారినాయి.

అలా ఆలోచనలో పడి ఎంత సేపు నిలబడ్డాడో ఆయనకే తెలియ లేదు. బాగా చీకటిపడింది. నౌకరు "బాబూ"అని పిలిచాడు. ఆయన ఉలిక్కిపడి చూశాడు. మారు మాటాడకుండా నౌకరు వెంటబడి ఇంటికి చేరుకున్నాడు.

ఆ రైతు, కుటుంబం వారు ఆయన కన్నులముందు కట్టినట్లు కనిపించసాగారు. పిల్లలు "అమ్మా? నాలుగుమైళ్లే!" అనటం చెవులలో మార్మోగ సాగింది: "అయ్యో? పాపం వారు నీరసంగా నడవలేక నడవలేక నడిచిపోతూఉంటే, పోనీ. యీ పూటకు ఇక్కడ ఉండి నాలుగు మెతుకులు తినిపొండని చెప్పకపోతినే!" అని విచారించాడు. "తన్ను తాను తిట్టుకొన్నాడు. ఆ రాత్రి ఆయనకు అన్నము తిన బుద్ధికాలేదు. నిద్రపట్టలేదు.

మరునాడు అలాగే సాయంత్రం పూట తిరగటానికి బయలుదేరాడు. కరువువచ్చి తినటానికి తిండి లేకుండా పోయినజనం పట్టణానికి చేరుకుంటున్నారు. ఒకస్త్రీ చంటి పిల్లణ్ణి ఎత్తుకొనిపోతున్నది. ఆ పిల్లడు పాలులేక ఆకలితో గుక్క పట్టి ఏడుస్తున్నాడు.

ఆయన ఆమె దగ్గరకువెళ్లి,



"దాహం వేస్తోంది, ఏం చెయ్యను?"

ఫొటో: ఉప్పలూరి వెంకటశ్రీనివాసరావు,—విజయవాడ.

"ఏమమ్మా! పాపం ఏడుస్తున్నాడు. కాసిని పాలు పోయరాదూ?" అన్నాడు.

"పాలు ఎక్కడ దొరకుతాయి? నా మొరవిని ఊరికే పాలుపోసే పుణ్యాత్ము డెవరు బాబూ!" అన్నది ఆమెజాలిగా.

ఆయన జేబులోనుండి ఒక రూపాయితీసి ఇచ్చి, "తీసుకుపో! పాలుకొని పోయవచ్చు."అన్నాడు.

సంతోషంతో ఆమె మాట్లాడ లేకపోయింది. ఎవరిస్తారు కరువు రోజులలో అడగకుండా రూపాయి? "బాబూ! మాపిల్లడిని బ్రతికి

★ ధర్మాత్ముడు ★

చారు." అని రెండు చేతులూ దండం పెట్టింది. సంతోషంతో కళకళలాడే ముఖంతో బయలుదేరి పోయింది.

ఒక్క రూపాయి ఇచ్చినందుకు ఆమె పడిన సంతోషం చూచి, ఆయన విస్మయపడ్డాడు. తోటి ప్రాణికి అంత సంతోషం కలిగించ గలిగినందుకు ఆనందించాడు. ఒక్క రూపాయి! పోతేపోయింది. ఆ రూపాయి తన జేబులో ఉండగా ఎప్పుడూ అంత ఆనందం గలిగించ లేదే!.

కొంత సేపయింది. ఆ స్త్రీ చాలా దూరం వెళ్లి పోయింది. ఇంతలో ఆయనకిలా అనిపించింది. "అయ్యో పాపపాలకు ఒకరూపాయి ఇచ్చాను గాని, ఆమె తిండి తిన్నదో లేదో విచారించటం మరిచి పోయినాను." చాలా విచారపడ్డాడు.

ఈవిధంగా ఆయన హృదయం నానాటికి ఆర్ద్రమైపోసాగింది. కష్టాలలో ఉన్నవారికి, పేదసాదలకు ఎంతెంత దాన ధర్మాలు చేసినా తరువాత, వారికి చేయవలసినంత సాయం చెయ్యలేదేమో అని చింత పడేవాడు.

సుఖంగా, ప్రశాంతంగా నిష్కల్మషమయిన జీవితం గడపటం వలన ఆయన పండుముదుసలి అయ్యే వరకు జీవించాడు. చివరిరోజున ఆయన మరణించే ముందు, ఆయనకు తాను చేసిన దాన ధర్మాలు స్వీకరించి, కృతజ్ఞతతో, అమాయికానందంతో చేతులెత్తి నమస్క

మాట్లాడే చిలక

మనిషి కాక చిలకా?

దానిపేరు కృష్ణ. అంటే మనిషి అనుకునేరు. మనిషి కాదు పిల్లి. పిల్లికి 'కృష్ణ' అనే పేరు ఎందుకు వచ్చిందా అని మీకు ఆశ్చర్యం కలగవచ్చును. అది నా పెంపుడు పిల్లి. నల్లగాఉంటుంది గనుక 'కృష్ణ' అనే సార్థకనామం పెట్టాను. నాతో స్నేహంగా ఉండేది. నా మంచం క్రిందనే పడుకొనేది. నాతో షికారు వచ్చేది. నేను వ్రాసుకొంటుంటే దూరంగా నిశ్శబ్దంగా కూర్చుని నా వంక చూసేది. పొద్దున్నే పాలవాడి కోసం నాకంటే తనే ఎక్కువ ఆత్రంగా ఎదురుచూసేది.

ఒకరోజున నా మిత్రుడొకడు పొరుగూరు వెడుతూ తాను పెంచుతున్న చిలకను నాకిచ్చి, భద్రంగా ఉంచమని చెప్పి వెళ్లాడు. దాన్ని అతడు తిరిగి వచ్చేవరకూ సంరక్షించడం కష్టమే అనిపించింది కాని మిత్రుడిమాట తోసివెయ్యలేక ఒప్పుకున్నాను. అది ఎగిరి పారిపోవడానికి వీలులేకుండా రెక్కలు కట్టివేయబడి ఉన్నాయి. సరే దాన్ని తెచ్చి నా చిలకకొయ్యమీద కూర్చోపెట్టాను. అక్కడ కూర్చుని అది బిక్కముఖంతో దిక్కులు చూస్తూ, 'ఈ కొత్తచోటికెందుకు వచ్చానా' అని గజగజ వణుకుతూ ఉంది.

చిలకను కృష్ణ చూసింది. అంతకు ముందు అదెప్పుడూ చిలకల్ని చూడలేదు. ఈ కొత్తప్రాణి ఏమై ఉంటుందా అని దానికి ఆశ్చర్యం కలిగింది. పచ్చని శరీరం, ఎర్రని ముక్కు, చక్కనితోక – ఈ అందమైనమూర్తి ఏమిటి, ఎవరు, ఎక్కణ్ణించి వచ్చింది, ఎందుకు వచ్చింది వగైరా ఆలోచనలు కలిగినట్లున్నాయి దానికి. క్లాసులోకి కొత్తగా అందమైనపిల్ల పుస్తకాలుపుచ్చుకుని వచ్చి, 'కొత్త' చేత కొంచెం బెరుకుచూపులు చూస్తూ కూర్చుంటే తోడిపిల్లవాళ్ళకు ఎంత చిత్రంగా ఉంటుందో కృష్ణకూ అలాగే అనిపించివుంటుంది.

చాలసేపు దూరాన కూర్చుని చిలకకేసి నిదానంగా చూసింది. తనకు తెలిసిన జంతుశాస్త్రంఅంతా నెమరువేసుకుని ఆలోచించింది. అన్నికోణాలనుంచీ పరీక్షించి చూసింది. అది ఏమైనదీ తెలియలేదు.

"ఇది కోడిమాత్రం కాదు" అని నిర్ధారణగా తేల్చుకున్నమాస్తరుగా పెంటాంపెట్టి లేచి, వళ్ళు విరుచుకుంది. మరోకోణాలకు వెళ్ళి మళ్ళీ దీక్షగా చూడసాగింది.

చిలక పిల్లి ఆలోచనలూ, పోకడలూ అన్నీ చూస్తోంది. అది ఎప్పుడు తనమీదకి దూకుతుందో అని గజగజ వణికిపోతోంది. రెక్కలల్లార్చడానికి, ఎగరడానికి ప్రయత్నించి మళ్ళీ ఉన్నచోటే బిగా అగా ఉండిపోతోంది.

నేను ఈజీచైరులో కూర్చుని ఈ నిశ్శబ్దనాటకం చూస్తూ గమనిస్తున్నాను. ప్రమాదం సంభవించే పక్షంలో జోక్యంచేసుకోడానికి సిద్ధంగా పెద్దకర్ర ఒకటి దగ్గర పెట్టుకున్నాను.

"ఇదేదో తినదగిన పదార్థమే" అని నిర్ణయించుకున్నట్లు కృష్ణ మళ్ళీ లేచి నుంచుంది. ఈ మధురమైన ఆలోచనతో దానివొళ్ళు గగుర్పొడిచింది. పులకరించింది. ఒకవిధమైన తన్మయత్వం, పరవశత్వం, చెప్పలేనంత ఆనందం కలిగాయి దానికి. "పచ్చగా ఉంటేనేం, చాలా రుచిగా ఉండేట్లు తోస్తోంది. ఇదేదో సీమనుండి దిగుమతి అయిన ఆహారపదార్థం కావచ్చు" అనుకున్నది. నోట్లో నీళ్లూరినాయి కాబోలు ముంగాలితో మూతి తుడుచుకుంది. గభీమని ఒక్కసారిగా, చిలకకొయ్యకిందుగా ఉన్న మంచంపట్టెమీదికి ఎగిరింది.

చిలక తనకు రాబోయే ప్రమాదాన్ని గుర్తించి అకస్మాత్తుగా గదిలోని నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ ఇలా అరిచింది: "అన్నం తిన్నావా రామూ?"

ఈమాటలు స్పష్టంగా మనిషి మాట్లాడినట్లు వినిపించాయి. పిల్లి అదిరిపోయింది. ఒక తుపాకిమోత,

---

రిస్తున్నట్లు పిల్లలు, పాపలు, వృద్ధులు, యువకులు, పురుషులు, స్త్రీలు ఎందరెందరో కనిపించారు. వారందరిపయిన ఆయనకు జాలి, వాత్సల్యము కలిగినాయి. వారందరూ ఆయనను గౌరవంతో ప్రేమతో చూస్తున్నారు.

"దయామయుడైన భగవంతుడు నాకిచ్చిన జీవితం నేను వృథా చెయ్యలేదు." అనుకుంటూ ఆయన సంతోషంగా కన్నులు మూశాడు. ★

మాట్లాడే చిలక

కాయకోరస్, రేడియోసంగీతం, సినిమాపాట ఏదీ పాడలగొట్టలేనంతగా, ఆ మాటలు కృష్ణని పాడలగొట్టాయి. ఎంత విసురుగా మంచంమీదికి దూకిందో, అంత విసురుగానూ కిందికి దూకింది.

కృష్ణముఖం చూస్తే దానికి కలిగిన అపూర్వ భావాలన్నీ పుస్తకంలో చదివినంత తేలిగ్గా చదవ గలిగాను.

“ఇదిపక్షి కాదు. తినే పదార్థమూ కాదు. ఎవరో పెద్దమనిషి కాబోలు” అని పిల్లి అనుకున్నట్లు తోచింది.

తనమాటలు పిల్లిని భయపెట్టాయని చిలక గ్రహించినదానివలె గొంతెత్తి శ్రావ్యంగా చక్కనిపాట పాడసాగింది. దానికి అంత లయ జ్ఞానం, రాగజ్ఞానం ఉన్నందుకు నాకే ఆశ్చర్యం కలిగింది.

పిల్లి విస్తుబోయి చూసింది. అంత చక్కగా పాడుతున్న దాన్ని పక్షి అని ఎలా అనుకోవడం? నావంక ప్రశ్నార్థకంగా చూసింది. నేను ఏమీఅనకుండా చిరునవ్వునవ్వాను. మరేమి చేయాలో తోచక కృష్ణ అవతలకు వెళ్ళిపోయింది.

మర్నాడు మరికొంచెం ధైర్యం తెచ్చుకుని కృష్ణ చిలకను సమీపించబోయింది. కాని చిలక మళ్ళీ అవేమాటలు పలికింది. పిల్లి భయపడి వెనక్కి తగ్గింది.

ఆ రోజునుంచీ చిలకను పట్టుకోడానికి కృష్ణ ప్రయత్నించలేదు సరిగదా, సృష్టిలోకల్లా మాట్లాడడం చేతనైన ఒకే ఒక ప్రాణియైన ‘మనిషి’యెడల ఎంత గౌరవం చూపించాలో అంత గౌరవమూ చూపించసాగింది.

(ఒక ఫ్రెంచి కథకు అనుసరణ)

మానవసేవ

బండ్లమూడి సుబ్బారావు

దేవపురంలోని రైతులందరు ఊరిమధ్యనున్న మఱ్ఱిచెట్టుక్రిందకు చేరారు. పొలం పనులు పూర్తి అయిపోవటంవలన, పంటలు బాగా పండటంవలన, రైతులందరు తీరికగాను, ఎంతో ఆనందంగాను ఉన్నారు.

వారందరిలోను తెలివికి, వయస్సుకు పెద్దవాడైన గ్రామపెద్ద వెంకయ్యగారు లేచి ఇలా మాట్లాడారు: “మనము ఈరోజు ఎంతో సంతోషంగా ఉన్నాం. ఈ సంతోష సమయంలో నేను మిమ్మల్ని ఒకటి అడగదలిచాను. మన ఊరిలో ఉన్న ఒక్క దేవాలయమూ పడిపోవటానికి సిద్ధంగా ఉన్నది. కాబట్టి ఆ దేవాలయం పునర్నిర్మించుకోవాలి. మన ఊరిలో ఉన్న ప్రతికుటుంబమువారు తమ తమ శక్తికొలది సహాయం చేసి, దేవాలయ నిర్మాణానికి తోడ్పడాలి.”

అక్కడ చేరినవారందరికి గ్రామపెద్ద చెప్పిన మాటలు నచ్చినాయి. అందరు ‘సరే’ అన్నారు. వెంటనే కొంతమంది యువకులు ఊరిపెద్దతో కలిసి చందాలు వసూలు చేయటానికి బయలుదేరారు. చందాలు విరివిగా పోగయినాయి.

ఆ ఊరిలోనే బీదవిధవరాలు ఒక ఆమె ఉన్నది. ఆమెకు ముగ్గురు పిల్లలు, ముగ్గురూ చిన్నవాళ్లే. ఆమె భర్త ఒక్క కానీకూడా మిగల్చకుండా చనిపోయినాడు. తలదాచుకోటానికి, జీర్ణావస్థలో ఉన్న ఒక్క పూరిగుడిసెమినహా ఆమెకుమరేమీ లేదు. ప్రతిరోజు ఉదయంనుంచి సాయంకాలందాకా కూలిపనిచేస్తూ తాను ఒకపూట పస్తువడుకొని, ఎలాగో తన ముగ్గురి పిల్లలను పెంచుతూ జీవితం గడుపుతున్నది.

ఒకరోజు సాయకాలం గ్రామపెద్ద ఆ బీదరాలుంటున్న గుడిసె దగ్గరకు వెళ్లి దేవాలయానికి చందా అడిగాడు.

ఆమె కళ్లనుండి బొట బొట నీళ్లు కారినాయి. “నేను సంపాదించే దానితో మాకు జీవనం గడవటమే కష్టంగా ఉన్నది. అయినప్పటికీ మీరు సత్కార్యం చేయబోతున్నారు కనుక, మా అవస్థలు మేము పడి, యీరోజు కూలి మీకిస్తాను” అని దీనంగా జవాబిచ్చింది.

ఆ గ్రామపెద్దహృదయం కరిగింది. పస్తులుండికూడా దేవాలయానికి చందాయివ్వటానికి సిద్ధపడిన ఆమె దైవభక్తి ఆ గ్రామపెద్దను ఆశ్చర్యపరచింది. “నువ్వేమిస్తావులే పాపం! వద్దులే!” అన్నాడు.

కాని ఆబీదరాలు “అదేమిమాట బాబూ! తీసుకొండి. ఆ దేవుడి దయవల్లే ఈమాత్రం నిలవటానికి చోటు లభించింది. ఆయనకంటె నేను నా పిల్లలు ఎక్కువకాదు.” అంటూ ఆ డబ్బును ఆయన చేతిలో సంతోషంగాపెట్టింది. ఆ గ్రామ పెద్ద ఆ డబ్బు తీసుకొని వెళ్లాడు.

మరుసటిరోజు చెట్టుక్రింద రైతులందరూ హాజరైనారు. గ్రామపెద్ద లేచి ఇలా చెప్పాడు.

"దేవాలయం కట్టించడానికి తగినంత ధనం పోగైంది కాని ఈ సంవత్సరానికి ఈపనిఆపుచేయాలి."

ఈ మాట అనేసరికి అక్కడ చేరినవారందరికి ఆశ్చర్యం వేసింది. కారణంఏమిటో వాళ్ళకర్థంకాలేదు. గ్రామపెద్ద తాను చెప్పదలచుకొన్నది చెప్పసాగాడు: "మనందరికి మంచి ఇళ్లు ఉన్నాయి. భోజన సదుపాయాలు ఉన్నాయి. మనం ఏదిగులూ లేకుండా జీవితం గడుపుతున్నాం. ఒకరోజు పని చేయక పోయినా మనం పస్తుండవలసిన అవసరం లేదు. కాని, మన ఊరిలోనే ఒక బీదరాలు ఉన్నది.

ఆమె ఒకరోజు పనిలేకపోతే, పిల్లలతో సహా పస్తుండవలసిందే. తలదాచుకోడానికి ఎండకు వానకు ఆగని, పూరిగుడిసెలో ఆమె ఉంటున్నది. మనఊరిలో, మనసరసన, ఒకస్త్రీ దిక్కులేనిదిగా ఉండటం మనం అంతా ఆలోచించవలసిన విషయం. కాబట్టి ఈయేటికి మనం దేవాలయంప్రయత్నం మానేసి, ఆబీదరాలు నివసించటానికి ఇల్లు కట్టించి ఇద్దాం. మన తోటి మానవులకు సేవచేస్తే, ఆ పరమాత్ముడు కూడ మెచ్చుతాడు."

రైతులు ఆలోచనలో పడ్డారు. తర్జన భర్జనలు జరిగాయి. గ్రామపెద్ద చెప్పినదానిలో న్యాయం, సత్యం కనిపించాయి. ఎవరో కొద్దిమందితప్ప తక్కిన అందరూ తమ అంగీకారాన్ని తెలియబరిచారు.

మానవసేవకోసం మాధవసేవను వాయిదావేసుకొని ఆ గ్రామరైతులంతా ఆ బీద విధవరాలుకి ఇల్లు కట్టించి సౌకర్యాలు కలిగించారు.

పదహారేళ్ల కుఱ్ఱవాడు. నల్లగాఉన్నాడు. జుట్టు దుమ్ముపట్టిఉన్నది. చింకిలాల్చీ తొడుక్కొని, చేతిలో ఒకకఱ్ఱ పట్టుకొని, ప్లాటుఫారంమీద ప్రతిపెట్టెవద్ద నిలబడి, "ధర్మం బాబూ!" అని అడుగుతూ పోతున్నాడు.

"పోతులాగా ఉన్నావు. కూలిచేసుకు బ్రతకరాదూ!" అన్నాడు ఒకఆయన.

"రామరామ. ఈ ముష్టివాళ్లబాధ ఖాత్రిగా పడలేకుండా ఉన్నాము." అని వాపోయినాడు ఇంకొకఆయన.

ఒక పెట్టెలో పైబల్లమీద ఒక విద్యార్థి పండుకొని ఉన్నాడు. ఈ కుఱ్ఱవాడు పెట్టెలోకి ఎక్కాడు. ఆబల్లదగ్గరకుకూడా వెళ్లి, "ధర్మంబాబూ! ధర్మం బాబూ!" అని అడిగాడు. ఆ విద్యార్థికి నిద్రాభంగమైంది. కోపంతో కస్సుబుస్సులాడుతూ లేచి కసిరికొట్టాడు. "ఛీఛీ, వెధవగోల! నిద్రపోయేవారిని కూడా లేపుతున్నాడు. న్యూసెన్సు!" అని విసుగుకున్నాడు. చిన్నబుచ్చుకున్న ముఖంతో ఆకుఱ్ఱవాడు దిగిపోయినాడు.

గార్డు విజిల్ వేశాడు. బండి బయలుదేరింది. క్రమంగా వేగం అందుకున్నది. విద్యార్థికి మళ్లీ నిద్రపట్టలేదు. మెల్లిగా క్రిందికి దిగి ప్రక్కవారిని అడిగాడు "ఇప్పుడుదాటింది ఏ స్టేషన్?" అని. వారు పేరు చెప్పగానే అతడు కంగారుపడిపోయినాడు. అతడు దిగిపోవలసినచోటుఅదే. అప్పటికే బండి చాలాదూరం వచ్చేసింది. ఇక చేసేదేముంది? ప్రక్కస్టేషన్‌లోదిగి ఆరాత్రికి అక్కడ నానాయాతనలూపడి, మరునాడుప్రొద్దున్నే బండిలో వెనక్కి చేరుకున్నాడు.

ఆఊరు అతని అత్తవారి ఊరు. అత్తగారిఇంటికి చేరగానే బావమరిది ఎదురువచ్చి, "ఏం బావా? రాత్రే వస్తావనన్నావుగా!" అన్నాడు. జరిగిన సంగతి చెప్పుకోవటానికి అభిమానం అడ్డువచ్చి, అతడు "ఏంలేదోయ్! వేరే పని ఉండటం వలన రాలేకపోయినాను." అన్నాడు.

ఇంతలో రాత్రి బండిలో కనిపించిన కుఱ్ఱవాడు వచ్చాడు. "బాబూ! మీరేనా?" అన్నాడు ఆశ్చర్యపోతూ. అతడూ ఆకుఱ్ఱవాడినిచూసి ఆశ్చర్యపోయినాడు. బావమరిది "ఏమిట్రా! పోలాయి!" అని అడిగాడు.


"రాత్రి బాబుగారినిబండిలో చూశానండి. ధర్మంబాబూ అని పిలిస్తే విసుక్కునితిట్టినారండి." అనిచెప్పాడు పోలాయి.

అప్పుడర్థమైంది బావమరిదికి - "ధర్మంబావా! నిన్ను పిలవటానికివచ్చినవాడిని తిట్టటం ఏం ధర్మం?" అన్నాడు నవ్వుతూ.

"ధర్మానికి వచ్చాననుకున్నానోయినేను." అన్నాడు ధర్మం తెల్లబోతూ.

సి. శరభేశ్వరరావు.—వాల్తేరు.

★



జరిగినకథ:

ఫ్రాన్సుదేశంలో విప్లవం ఉధృతంగా ఉన్న రోజులు - చాలామంది ప్రభువంశీకులకు శిరచ్ఛేదం విధించబడింది. ఉన్నట్టుండి ఇలా శిక్షలు విధించబడినవారితో సహా, చాలామంది ప్రభువంశీకులు తప్పించుకు పారిపోవటం మొదలు పెట్టారు. కొంతమంది ఇంగ్లీషువారు సంఘంగా ఏర్పడి వారిని తప్పిస్తున్నారని వదంతులు బయలుదేరినాయి. వారి నాయకుడు ఎవరో ఎవరికి తెలియదు. స్కార్లెట్ పింపర్నల్ అనే మారుపేరుతో వ్యవహరిస్తుంటాడు. ఈ స్కార్లెట్ పింపర్నల్ బిబట్ అనే ద్వార రక్షకుని కళ్లల్లో దుమ్ముకొట్టి, కౌంటెస్ శి టూర్నెను ఆమె పిల్లలు సుజేన్, వైకౌంటులను తప్పిస్తాడు. వారు ఛానెల్ దాటి ఇంగ్లాండ్ చేరుకుంటారు. మార్గరెట్ అనే ఫ్రెంచియువతి, సర్ పెర్సీ అనే ఇంగ్లీష్‌వానిని పెళ్లిచేసుకొని లండన్ వచ్చేస్తుంది. ఈమెకూడా పెళ్లికాకముందు ఒకసారి ఒక ప్రభువుకు మరణశిక్ష వేయిస్తుంది. ఇంగ్లాండులో ఉండగా ఆమెను ఎన్నడూ కలుసుకోవటం తటస్థించరాదని కౌంటెస్ కోరుకుంటుంది. కాని కౌంటెస్ ఇంగ్లాండు చేరిన కొద్దిగంటల్లోనే ఆమె ఉన్న హోటలుకే మార్గరెట్ వస్తుంది. ఆమెపై తనకున్న ద్వేషంకొద్దీ కౌంటెస్ మార్గరెట్‌ను నలుగురిలో అవమానపరుస్తుంది. తరువాత సర్ పెర్సీకూడా లోపలికి వస్తాడు. సర్ పెర్సీ వట్టిమందమతి, బద్ధకస్తుడు. వైకౌంట్ సర్ పెర్సీతో కలహానికి తలపడతాడు. కాని పెర్సీ వేళాకోళంగా మాట్లాడి కలహం తప్పిస్తాడు. మార్గరెట్ ఫ్రాన్సుపోతున్న తన సోదరుడు ఆర్మండ్‌ను సాగనంపటానికి బయలుదేరుతుంది. ఆర్మండ్‌ను సాగనంపి మార్గరెట్ వెనుతిరిగి వస్తూ ఉండగా, ఆమెకు పారిస్‌లో ఉన్న రోజులలో తెలిసిన షావలిన్ కనిపిస్తాడు. ఫ్రెంచిప్రభుత్వంతరఫున రాయబారిగా వచ్చినట్లు తెలిపి షావలిన్, స్కార్లెట్ పింపర్నల్ ఆచూకి తీయటానికి తోడ్పడమని కోరుతాడు. కాని మార్గరెట్ అంగీకరించదు. ఎందుచేతంటే మార్గరెట్‌కు తనదేశంలో జరుగుతున్న విప్లవం అంటే సానుభూతి పోతుంది. స్కార్లెట్ పింపర్నల్ అంటే ఆమెకు అభిమానం కలుగుతుంది. పెర్సీ దంపతు లిద్దరూ ఆరాత్రే లండన్ వెళ్లిపోతారు. లార్డ్ టోనీ, ఆండ్రూ స్కార్లెట్ పింపర్నల్ అనుచరులని తెలుసుకున్న షావలిన్ ఆరాత్రే వారిని బంధించి, కొన్ని రహస్యకాగితాలు స్వాధీనం చేసుకుంటాడు. వెంటనే షావలిన్ లండన్ చేరుకొని మార్గరెట్‌ను ఒక నాటకశాలలో కలుసుకుంటాడు. ఆమెసోదరుడు ఆర్మండ్ పెద్దప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుపుతాడు.

6

మార్గరెట్ మనస్సు పరి పరి విధాల పోయింది. కాని షావలిన్‌ముందు లోకువ కాకుండా ఉండాలని మేకపోతు గాంభీర్యంతో, లేని ఉల్లాసం తెచ్చుకుంటూ "ఊఁ! చెప్పు చెప్పు! ఇంకా ఏమేమి తమాషాలు చెప్తావో! ఎందుకు ఊరికే నాకు టోపీపెట్టా లని చూస్తావుగాని, సంగీతం చాలా బాగుంది, నన్ను విననివ్వు" అన్నది. రంగస్థలం ప్రక్కకు ముఖం త్రిప్పి, నిర్లక్ష్యంగా కనిపించాలని ప్రయత్నించింది.

పారిస్‌లో అప్పుడు ఉన్న పరిస్థితులనుబట్టి, ఏ నిమిషానైనా, ఎవ్వరికైనా ప్రాణాంతకమైన ప్రమాదం ఏర్పడవచ్చు. అందుచేత మార్గరెట్ మనస్సులో చాలా కలవరపడింది. ఉండబట్టలేక, మళ్ళీ షావలిన్ ప్రక్కకుతిరిగి, "అయితే, ఆర్మండ్ ప్రమాదంలో చిక్కుకున్నాడంటావు. అంతేనా? ఏమిటా ప్రమాదం? అదికూడా చెప్పు" అని అడిగింది.

తన పాచిక పారుతున్నందుకు షావలిన్ లోలోన సంతోషపడ్డాడు - మెల్లిగా మొదలుపెట్టాడు. "ఫ్రాన్సు దేశం నిన్నొకసహాయం అర్థిస్తున్నది అని ఆనాడు నీతో చెప్పాను. గుర్తుందా? నీవుసహాయం చెయ్యటానికి అంగీకరించలేదు."

"ఇప్పుడదంతా దేనికి? సంగతి ఏమిటో తిన్నగా చెప్పరాదూ?"



"...ఈ పింపర్నల్ ఎవరో, సంగతి సందర్భాలన్నీ 'మీరే' వివరించి చెప్పగలరని అనుకుంటున్నారు..."

"ఇదుగో, చెప్తున్నా! మరి నీవంటే చెయ్యనని ఎగకొట్టావు. నాకు ఎలాతప్పుతుంది. కాబట్టి ఏదో నా తంటాలు నేనే పడవలసి వచ్చింది. ఎలాగైతేనేమి, ఆనాటిరాత్రి కొన్ని రహస్యపత్రాలు సంపాదించగలిగాను. వాటినిబట్టి స్కార్లెట్ పింపర్నల్ గురించిన కొన్ని సంగతులు తెలిసినాయి."

మార్గరెట్ ఇంతవరకు ఓపికగా షావలిన్ చెప్పినదంతావిన్నది. ఆ సంగతి, ఈ సంగతి చెప్తాడే కాని ఆర్మండ్ సంగతిఏమిటో చెప్పడేమిటా అని మార్గరెట్‌కు ఆరాటంఎక్కువైంది. షావలిన్‌పైన పట్టరానికోపం వస్తున్నది. అసహ్యం వేస్తున్నది. కాని చేసేదేముంది? మొహం చిట్లించుకొని, "ఈగొడవంతా నాకెందుకు?— అసలువిషయం చెప్పకుండా" అన్నది.

"తొందరపడకు మార్గరెట్! ఫిషర్ మన్స్ రెస్ట్ నుండి మీరు వచ్చేనాటిరాత్రి సర్ ఆండ్రూ, లార్డ్ ఆంటొనీ అనేవారిద్దరు అక్కడేఉన్నారు."

"తెలుసు. ఉంటే?"

"మన గూఢచారులు వారినిపట్టుకొని, బంధించి వారివద్ద చాలా కాగితాలు స్వాధీంచేసుకున్నారు. వారిద్దరూ స్కార్లెట్ పింపర్నల్ అనుచరులని మాకు ముందే తెలిసిపోయింది. ప్రస్తుతంవారిద్దరు మాబందీలుగాఉన్నారు."

"ఏపనిచేసినా నీవుచాలా మూర్ఖంగా చేస్తావు షావలిన్! ఇదేమి మన ఫ్రాన్సనుకున్నావా? అలాంటి అత్యాచారం చేస్తుండగా గనక మీవాళ్లు బయట పడితేఏమయ్యేది?"

"ఏమౌతుంది! వారు ఫ్రాన్సుమాత పవిత్ర పుత్రులు. సంతోషంగా ప్రాణాలిచ్చేవారు. సరే, ఆ కాగితాలవలన కొన్నిమంచి విశేషాలే లభించినాయి. కాని ఆ పింపర్నల్ ఎవ్వడో? అనేది తేలలేదు."

మార్గరెట్ పరిహాసం చేస్తున్నట్లు నవ్వింది. "సేష! ఇంకేం? గొంగళి వేసినచోటే ఉన్నది. అన్నట్లు, మా ఆర్మండ్ మాట ఏమిటిచెప్తావు?"

"దానికేవస్తున్నా. ఆ కాగితాలలో మీ సోదరుడు ఆర్మండ్ సెంట్‌జస్ట్ సర్ ఆండ్రూకు వ్రాసిన ఒకానొకఉత్తరం కూడా ఉన్నది. ఆ ఉత్తరాన్నిబట్టి

మీ వాడు విద్రోహులపట్ల సానుభూతి చూపించటము ఒక్కటే కాకుండా, వారు మన దేశంనుండి పారిపోవటానికి సహాయంకూడా చేస్తున్నట్లు - తెలుస్తున్నదా? అంటే, స్కార్లెట్‌పింపర్నల్ భక్తాగ్రేసరుడై, ఆ ఇంగ్లీషువారితో చేరిపోయినట్లు కూడా స్పష్టమౌతున్నది."

పావలిన్ చెప్పిన ప్రతిమాటా మార్గరెట్ చెవులకు పిడుగులాగా తాకింది. కళ్ళనీళ్ళపర్యంతం అయింది. సోదరుణ్ణి తలచుకొని కుమిలిపోయింది. ఎంత తెలివి తక్కువ? ఎంత అజాగ్రత్త? ఆ ఉత్తరం ఇప్పుడు పావలిన్ చేతుల్లోపడింది. దాని ఆసరాతో ఇప్పుడుతన పీకమీదికి కత్తి తేబోతున్నాడు.

పావలిన్‌ను దబాయించకపోతే వీలులేదని అనుకున్నది మార్గరెట్. "వహ్వా! బలేకథ అల్లావు. ఎన్నాళ్లు ఆలోచించావు? అబద్ధంచెప్పినా తడికపెట్టినట్లా?" అన్నదినవ్వుతూ, ప్రేలుతూ.

పావలిన్ ఈమాటలు లెక్కచెయ్యలేదు. "నమ్ము. నమ్మకపో. చెప్తున్నాను. ఆర్మండ్ చేసినపని ఎంతమాత్రం క్షమించదగినదికాదు. చాలా ఘోరమైన నేరం. అందుకుగాను విధించబడేశిక్షఏమిటో నీకూ తెలుసు." అన్నాడు.

మార్గరెట్ ఒకనిమిషం సేపు నిశ్చలంగా, నిటారుగా కూర్చున్నది. తక్షణం చెయ్యవలసిన పనిఏమిటా అని తీక్ష్ణంగాఆలోచించింది- నిట్టూర్చింది.

"పావలిన్! మనము ఒకరినొకరు అర్థంచేసుకోవటం మంచిది. మొన్న ఈమధ్యపడిన వానలవల్లనో ఏమో బుఱ్ఱబొత్తిగా తుప్పపట్టిపోయింది. సరే, ఇప్పుడు చెప్పు. నీకు కావలసిందిఏమిటి? ఆ పింపర్నల్ ఎవరా అనేవిషయం. "అంతేగా!"

"సరిగ్గా. అంతకంటె నేను కోరుకునేది మరొకటి లేదు."

"మా ఆర్మండ్‌కు వచ్చినప్రమాదం తప్పిపోవాలంటే, నేను దుర్మార్గానికి ఒడిగట్టక తప్పదంటావు. అవునా?"

"ఎంతమాట? దుర్మార్గంకాదు దేశసేవకుపూనుకోవటం."

"ఏదో ఒకటిలెద్దూ; ఏరాయి అయితేనేం పళ్ళు ఊడకొట్టుకోవటానికి."

"నీవు అట్టే శ్రమపడవలసిన పనిలేదు మార్గరెట్! ఒక్కచిన్నపని చేసిపెట్టుచాలు. సర్ ఆండ్రూ దగ్గరదొరికిన కాగితాలలో ఇదొకటి. ఇది చూడు ముందు అంటూ పావలిన్ ఒక చిన్న కాగితంముక్క ఇచ్చాడు. ఈకాగితంముక్క చదవబోతూ ఉండగానే సర్ ఆండ్రూ, లార్డ్‌టోనీ పట్టుపడ్డారు.

ఆకాగితంలో మూడేమూడు పంక్తులున్నాయి. దస్తూరి కావాలనిమార్చినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

"అనవసంగా పదే పదే కలుసుకోబోకండి. 2వ తేదీ యాత్రతాలూకూ విశేషాలన్నీ లోగడేచెప్పాను గదా! ఇంకామాట్లాడాలంటే గ్రెవిందుకు వస్తాను."

కిందమామూలుగా ఎఱ్ఱటి పువ్వుబొమ్మఉన్నది. మార్గరెట్ ఆశ్చర్యంతో, పింపర్నల్‌పట్ల భక్తి, గౌరవాలతో ఆ ఉత్తరంచదివింది. "ఏమిటిది?" అని అడిగింది.

"మళ్ళీచదువు తెలియకపోతే!" అన్నాడు పా[illegible]న్.

"గ్రెవిందా? ఓహో! గ్రెన్విల్ చేస్తున్న విందని కాబోలు."

"అనే నేనూ అనుకుంటున్నాను. ఇక జరగవలసిన పనిఏమిటో చెప్తానువిను. లార్డ్‌టోనీ, సర్ ఆండ్రూ నాదగ్గరబందీలుగా ఉన్నారనిచెప్పానా? తరవాతనాకో ఉపాయంతట్టింది. వారిద్దరూ అవసరంగా తమ నాయకునివద్దకు పరుగెత్తుకొని వెళ్లి, మొత్తుకొనవలసినది చాలాఉంటుంది. అందుచేత వారివిడుదలకు ఏర్పాట్లు చేశాను. ఎలా? ఈవేళ తెల్లవారేసరికి వారిని బంధించిన కొట్టుతలుపులు తీసిఉంటాయి. రెండు మంచి గుఱ్ఱాలు సిద్ధంగాఉంటాయి. ఎవరోతమవాళ్లు తమని తప్పించిఉంటారని వారిద్దరూ హడావిడిగా పరుగెత్తుకు వస్తుంటారు. లార్డ్‌గ్రెన్విల్ విందుకువస్తారు. నాయకుని కలుసుకుంటారు. కనుక వారు ఎవరెవరిని కలుసుకుంటారో, కాస్త ఒకకంట కనిపెట్టిఉండు, చాలు. చూశావా! ఎంతసులభమో?"

"సులభమే! కాకేముంది? చేతిలో పిట్ట చిక్కిన తరువాత, అలా మెడపట్టుకోవటం, ఇలా చేతితో నులిమివెయ్యటం. అంతే. చాలా సులభమే, కాని పిట్టకూ అలా అనిపించాలిగా!" అన్నది మార్గరెట్ కసిగా.

"ఆర్మాండ్‌ను రక్షించుకొనే అవకాశం దొరికిందన్న సంతోషమేనా లేదు." అన్నాడు షావలిన్.

"నేను నీవు చెప్పిన ప్రకారం చేస్తాను. ఆర్మాండ్ ఉత్తరం నాకిలా ఇచ్చేయి!" అన్నది మార్గరెట్ ఆశగా అతనివంక చూస్తూ.

"అనుమానం తీర లేదా! మళ్లీ చెప్తున్నాను విను. మార్గరెట్! ఈ వేళ రాత్రి ఏకొంత ప్రయోజనకరమైన సహాయం నీవు చేసిపెట్టినా, రేపుపొద్దున మీ ఆర్మాండ్ సంతకంతో ఉన్న ఉత్తరం నీ చేతికి ఇచ్చేస్తాను." అన్నాడు షావలిన్ ఒక్కొక్క మాట నొక్కి చెపుతూ.

మార్గరెట్ భయపడిపోయింది. ప్రయోజనకరమైన సహాయం! "షావలిన్! ఏ కారణం చేతనైనా నేను కష్టపడినా, ఫలితం దక్కకపోతే...?"

"ఏం జరుగుతుందో వేరే చెప్పాలా?" అన్నాడు షావలిన్ క్రూరంగా చూస్తూ. ఆ చూపుకు మార్గరెట్ ఆపాదమస్తకం కంపించిపోయింది. నల్లరాయి కరుగుతుంది కాని షావలిన్ గుండె కరగదు. ఆ సంగతి మార్గరెట్‌కు బాగా తెలుసు.

మార్గరెట్ చాలా ఆవేదన పడసాగింది. నుదుటి మీద స్వేదబిందువులు నిలిచినాయి. పింపర్నెల్ - ఆ వీరుడికి - ఆమహానీయుడికి తాను ద్రోహం చెయ్యబోతున్నది.

పోనీ సర్ పెర్సీకి ఉన్న విషయమంతా చెబితే ఏమయినా సర్దగలడేమో అనుకున్నది కాని ఆయన దగ్గరకు వెళ్ళి చెప్పుకోవటం ఆమెకు మనస్కరించ లేదు.

షావలిన్ చెప్పవలసిన మాటలేవో చెప్పాడు. ఏమీ జరగనట్లు నాటకం చూస్తూ తన్మయత్వంతో కూర్చున్నాడు.

ఇంతలో సర్ పెర్సీ యథాస్థానానికి వచ్చాడు. తన చోటులో షావలిన్ కూర్చోవటం గమనించాడు. "ఓహోహో! కూర్చోండి. కూర్చోండి. ఫరవాలేదు. చూడు మార్గరెట్! బండి సిద్ధంగా ఉన్నది. మరి లార్డ్ గ్రెన్విల్ భవనానికి పోదామా?" అని అడిగాడు.

మార్గరెట్‌కు అక్కడ కూర్చోవటం ముళ్ళమీద ఉన్నట్లు ఉంది. "పదండి. పోదాం!" అన్నది. షావలిన్ వైపు తిరిగి,

"షావలిన్! అయితే లార్డ్ గ్రెన్విల్ విందులో కనిపిస్తారుగా!" అన్నది ఉల్లాసంగా.

"అలాగే, అలాగే." అంటూ షావలిన్ తల ఊపాడు: మార్గరెట్ ముఖకవళికలనుబట్టి ఆమె మనసులో చెలరేగుతున్న భీభత్సం గ్రహించాడు. సంతృప్తిగా విజయసూచకంగా ఇకిలించాడు. ఊపిరి సలపకుండా ఉన్న పని నెరవేరిన తరువాత అలసట తీర్చుకుంటున్నట్లు ముఖం పెట్టాడు. ఒక్క పట్టు నస్యం ముక్కుల్లోకి ఎక్కించటం మర్చిపోలేదు.

7

లార్డ్ గ్రెన్విల్ చేస్తున్న విందుకు రావలసిన అతిథులు చాలామంది నేరుగా నాటకశాలనుండే రావలసి ఉన్నది. ఈ విందుకు వేల్సు యువరాజు కూడా తప్పక వస్తానని మాటయిచ్చాడు. నాటకంసగంలోనే లార్డ్ గ్రెన్విల్ లేచివచ్చేశాడు. తన భవనం చేరుకొని విందు ఏర్పాట్లన్నీ సరిచూసుకున్నాడు.

పదిగంటలైంది. భవనమంతా దీపాలతో వెలిగిపోతున్నది. కన్నులు మిరుమిట్లుగొలిపే రకరకాల జరీ దుస్తులతో ఆభరణాలతో చాలామంది స్త్రీ పురుషులు విందుకు విచ్చేశారు. నలుగురు ముగ్గురు చొప్పున నిలబడి మాట్లాడుకునే వారు మాట్లాడుకొంటుంటే మరి కొంతమంది సంగీతం వింటున్నారు. ఇంకా కొంతమంది ఉత్సాహంగా నృత్యం చేస్తున్నారు.

వేల్సు యువరాజుకు స్వాగత మివ్వటంకోసం లార్డ్ గ్రెన్విల్ ద్వారంవద్ద వేచిఉన్నాడు. గ్రెన్విల్‌కు సమీపంలో ఒక బల్లకు ఆనుకొని షావలిన్ నిలబడ్డాడు. నల్లటి దుస్తులు వేసుకొని ఉన్నాడు. సర్ పెర్సీ, మార్గరెట్ ఇంకా రాలేదు. షావలిన్ మార్గరెట్ రాకకోసం నిరీక్షిస్తున్నాడు.

ఫ్రాన్సులో అప్పుడు నెలకొని ఉన్న విప్లవ ప్రభుత్వం అంటే లండన్ ప్రజలకు ఎవ్వరికీ గురి లేదు. షావలిన్ వంటి ప్రతినిధివాడొకడు అటువంటి విందు సమయంలో తమమధ్య ఉండటం అందరికీ అయిష్టంగానే ఉన్నది. కాని అతని అధికారిక హోదానిబట్టి అతనికి స్వాగతమివ్వక తప్పలేదు. కాని అనధికారవర్గం వారు ఎవ్వరూ షావలిన్‌ను పలకరించలేదు. అయితే అతను ఇవన్నీ పట్టించుకునేవాడు కాదు కాబట్టి సరిపోయింది.

విందుకు వచ్చినవారిలో అక్కడక్కడ కొన్ని ప్రఖ్యాతి వారి ముఖాలు కనిపిస్తున్నాయి. వారంతా పారిస్‌నుండి తప్పించుకొని వచ్చిన ప్రభువంశీకులు. వారిని చూడగానే షావలిన్‌కు కడుపులో చెయ్యిపెట్టి

కలచినట్లయింది. "ఆహా! గిలస్టైన్ మహాతల్లి నోటి ముందు తిండి జారిపోయిందికదా!" అని చాలా విచారించాడు. ఈ విచారమంతా పింపర్నల్‌పై కోపంగా మారింది. పింపర్నల్‌పై అతనికున్న కోపం ఇనుమడించింది.

ఈస్కార్లెట్ పింపర్నల్ అంతుఏమిటో తేల్చుకుతీరుతానని షావలిన్ మిత్రులముందు బాస చేశాడు. తనకళ్ళుచల్లగా ఎప్పుడు స్కార్లెట్ పింపర్నల్ తలకాయ తాటిపుచ్చెలా ఎగిరిపడటం చూస్తానాఅనుకొని లొట్టలువేశాడు.

భవనంముందు జనంలో పెద్దసంచలనం కలిగింది. సపరివారంగా వేల్సుయువరాజు, సర్ పెర్సీ, లేడీబ్లాకెనీ విచ్చేశారు. లార్డ్ గ్రెన్విల్ సంభ్రమంతో ఎదురువెళ్ళి ముగ్గురికి స్వాగతంచెప్పాడు.

మామూలు ఇష్టాగోష్ఠిమాటలు అయినతరువాత లార్డ్ గ్రెన్విల్ "ప్రభువులు అనుమతిస్తే ఫ్రెంచి ప్రభుత్వరాయబారిని తమసముఖానికి తీసుకువస్తాను." అన్నాడు.

లార్డ్ గ్రెన్విల్ తనను వేల్సుయువరాజుకు పరిచయంచేస్తాడని షావలిన్ ముందే ఊహించాడు. అందుచేత షావలిన్ గబగబ ముందుకువచ్చి, వినమ్రంగా వంగి నమస్కరించాడు. యువరాజు కనుబొమలెగరేసి వందనం అందుకున్నాడు

"ఫ్రెంచిరాయబారిగా వచ్చారన్న దృష్టితో కాదుకాని మాకుప్రస్తుతం అతిథిగా వచ్చారన్న దృష్టితోమాత్రమే మీకు స్వాగతం ఇస్తానాము." అన్నాడుయువరాజు.

"షావలిన్, నేను పారిస్‌లోఉండగా స్నేహితంగాఉండేవారం ప్రభూ!" అనిచెప్పింది మార్గరెట్.

"అలాగా?" అన్నాడు యువరాజువిస్మయంతో.

ఇంతలో లార్డ్ గ్రెన్విల్ అందుకొని, "ప్రభువులు అనుగ్రహించాలి. తమ దర్శనం కోరుతున్నవారు ఇంకాఉన్నారు." అన్నాడు.

"ఎవరు?"

"పారిస్‌నుండివచ్చారు- కౌంటెస్ డి టూర్నే, ఆమె పిల్లలు."

"తప్పకుండా; మాకు చాలా సంతోషంగా ఉన్నది. వారు బ్రతికి బయటపడినందుకు." అన్నాడు యువరాజు.

లార్డ్ గ్రెన్విల్ కౌంటెస్ డి టూర్నేను సుజేన్, వైకౌంటులను యువరాజుకు పరిచయంచేశాడు.

కుశలప్రశ్న లయినతరువాత యువరాజు మార్గరెట్‌ను కౌంటెస్‌కుచూపిస్తూ, సాదరంగా అన్నాడు.

"మా స్నేహితురాలు మార్గరెట్ బ్లాకెనీని మీకు పరిచయంచేస్తాము. మీరు, ఆమె ఒక దేశంవారే కదా! ఆమెస్నేహితులంతా మాకూ స్నేహితులే. ఆమెశత్రువులు ఇంగ్లాడుకే శత్రువులు."

మార్గరెట్ కళ్లు మెరిసిపోయినాయి. కౌంటెస్ వంక దర్పంగా చూసింది. అంతకుముందు మార్గరెట్‌ను అంత అవమానం చేసినకౌంటెస్ ఏమీమాట్లాడలేకపోయింది.

"నిరాశ్రయులమైన మాకు ఇంగ్లాడుదేశం ఆశ్రయమిచ్చింది. కృతజ్ఞతాసూచకంగా ప్రభువుల చిత్తానికి అనుగుణంగా మేము నడుచుకుంటాము." అన్నది కౌంటెస్ గంభీరంగా.

ఈలోగా యువరాజు వైకౌంట్‌తో మాటలలో పడ్డాడు. వైకౌంట్ అన్నాడు. "తమ దర్శనభాగ్యం కలిగినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నాకీ అదృష్టం కలిగించిన స్కార్లెట్ పింపర్నల్......"

యువరాజు మాటకు అడ్డువచ్చాడు. "ఇశ్శ్" అనివారించాడు షావలిన్‌ను ఉద్దేశించి చూపుతూ. కౌంటెస్‌వంక అక్కసుతోచూస్తున్న షావలిన్ చప్పునయువరాజు ముఖమై అన్నాడు.

"చెప్పనివ్వండి పాపం! స్కార్లెట్‌పింపర్నల్‌పట్ల కృతజ్ఞత తెలుపుకోనివ్వండి. స్కార్లెట్ పింపర్నల్ పేరు నాకు, మావాళ్ళందరికీ కూడా తెలిసినదే."

అతనిఉద్దేశ్యం ఏమయిఉంటుందా అని యోచిస్తూ యువరాజు రెండుక్షణాలు నిలబడ్డాడు.

"ఓహో! మా స్కార్లెట్ పింపర్నల్‌గురించి మాకంటే మీకే ఎక్కువ తెలుసునట్లేఉన్నది. చూడండి. ఒకచిన్నసలహా! స్కార్లెట్ పింపర్నల్ అంటే వీళ్ళందరికీ తెగనిఅభిమానం. కాని పాపం అతడు ఎవరో తెలియక కొట్టుకుంటున్నారు. మీరు గనుక అమొక్క చెప్పారా? ఇంకేంలేదు. మీకు బ్రహ్మరథంపట్టేస్తారు అందరూ.

"మా దేశంలో అంతా ఏమనుకుంటున్నారంటే ఈ పింపర్నల్ ఎవరో సంగతిసందర్భాలన్నీ 'మీ శే' వివరించి చెప్పగలరని, మరెవరివలనకాదని అనుకుంటున్నారు." అన్నాడుపావలిన్. 'మీ శే' అన్నప్పుడు మార్గరెట్ పై దృష్టినిలిపి. మార్గరెట్ పావలిన్ అభిప్రాయం గ్రహించింది. కాని నిగ్రహంతో ఊరుకున్నది.

"అబ్బేలాభంలేదు." అన్నాడు యువరాజు.

"ఆ పింపర్నల్ అనుచరులు ఈరహస్యం ఇనపపెట్టెలోపెట్టి దాస్తున్నారు. ఒక్కమాట చెప్పమా? ఈ లండన్ మహిళలందరూ ఈ మధ్య ఆస్కార్లెట్ పింపర్నల్ నే ఆరాధించటం మొదలుపెట్టారు. ఆ పింపర్నల్ ఎలాఉంటాడో తెలియదు. పొడుగ్గాఉంటాడో, పొట్టివాడో లావుగాఉంటాడో, సన్నగావుంటాడో కాని ప్రపంచంలో మరెవరికి అతనిపాటిధైర్యసాహసాలు లేవనటం మాత్రంనిజం. అటువంటిపింపర్నల్ మా ఇంగ్లీషువాడు అన్నమాట తలపుకు వచ్చినప్పుడల్లా మేము పులకించి పోతుంటాము."

మార్గరెట్ అందుకొనిచెప్పింది. "నిజం నిజం మేమందరమూ పింపర్నల్ ను ఆరాధిస్తున్నాం."


ఆతరువాత కొంతసేపు అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

"వెధవది! మధ్య మాకర్మం కాలిపోయింది. ఈ వనితాలోకమంతా మనిషో భూతమో తెలియని ఆ పింపర్నల్ ను ఆరాధిస్తున్నారు. మేమంతా బూజు పట్టిపోయినాము."


నిద్రమత్తుగా, బద్ధకంగా మాట్లాడుతూ వినుక్కున్నాడు సర్ పెర్సీ. అందరూ ఘక్కుననవ్వారు: వేల్సుయువరాజు అందరికంటె బిగ్గరగానవ్వాడు.

లార్డ్ గ్రెన్విల్— దారితీయగా అతిథులు లోపలికి ప్రవేశించారు.

(ఇంకా వుంది)



ఫిల్మిస్థాన్ వారి "హీర్" అనే ప్రేమకథా చిత్రంలో హిందీ తార నూతన్.



భాస్కర్ ప్రొడక్షన్సువారి "చెరపకురా - చెడేవు!" చిత్రంలో
గజంబారుగడ్డాలతో రేలంగి, ఆర్. నాగేశ్వరరావు.

బొంబాయిసినిమా లేఖ

మహారాష్ట్ర తార ఉషాకిరణ్ రెండు నెలలపాటు యూరప్‌లో సంచారం చేయబోతున్నది. మంచి నటనా సామర్థ్యంగల ఈమె సినిమాలలోకి రాకపూర్వం నాటకాల్లో వేషాలు వేస్తూ అనుభవం గడించింది. ఆమె తన తండ్రివద్దనే నటనలో శిక్షణ పొందింది. తరువాత ఆమె మహారాష్ట్ర చిత్రరంగంలోకి ప్రవేశించింది 'ఔరత్ హై తుఝే కహానీ' అనే చిత్రమూ, 'బాల జోజోరే' అనే మరొక చిత్రమూ ఆమెకు ఖ్యాతి చేకూర్చినవి.

నర్తకిగా ఆమె మొదటి చిత్రం ఉదయశంకర్ నిర్మించిన 'కల్పన' ఉదయశంకర్ శిక్షణలో ఆమె నాట్యకళలోని మెలకువలన్నీ జాగ్రత్తగా అభ్యసించింది. శాస్త్రీయ, జానపద నాట్యరీతులు బాగా తెలిసిన అగ్రశ్రేణి తార బొంబాయిలో ఉషాకిరణ్ ఒక్కతేనని అంటే అతిశయోక్తి కాదు. "బాద్‌బాన్" చిత్రంలో ఈమె పల్లెపడుచుగా నటించి చేసిన నాట్యానికి 1954 లో ఈమెకు 'క్లేర్' బహుమతి లభించింది.

అమియ చక్రవర్తి నిర్మించిన "గానా" లో ఈమె తొలిసారిగా హిందీ ప్రేక్షకులకు పరిచితురాలైంది. ఆ తర్వాత 'దాగ్', పతిత, బాద్‌బాన్, సమాజ్ మొదలైన చిత్రాల్లో ఈమె ఖ్యాతి ఇనుమడించింది.

ఆమె వయస్సు 25 సంవత్సరాలు. గత సంవత్సరమే ఆమె తన బాల్యస్నేహితుడు, తనకంటె చిన్నవాడు అయిన డా॥ మనోహర్ బి. ఖేర్‌ను వివాహమాడింది. ఆమె భర్త వైద్యపరీక్షలో బంగారుపతకం బహుమతి పొందినవాడు; మంచి ఆర్జనపరుడు.

ఉషాకిరణ్ త్వరలో యూరప్ వెళ్ళి ముఖ్యపట్టణాలన్నీ పర్యటిస్తుంది. జూన్ మాసంలో బెల్‌గ్రేడ్‌లో జరుగనున్న అంతర్జాతీయ నాటక సమావేశంలో పాల్గొంటుంది.

* * *

సాగర్ ఫిలిమ్స్ వారి మొదటి చిత్రం "సర్కస్" లో నిగర్ సుల్తానా నటిస్తున్నది. అశోక్ స్టూడియో (అంధేరి) లో ఇటీవల ఈ చిత్రం ప్రారంభోత్సవం జరిగింది. మొదటిషాట్‌లో, నిగర్ సుల్తానా సర్కస్ తెరను ఆనుకుని చూస్తూ ఉంటుంది. ఈ చిత్రం సర్కస్ మీద ఆధారపడినది. రంజన్ హీరోగా నటిస్తున్నాడు. నయాన్‌తారా, ఇందిరాబన్సాల్, సుందర్, కేసరి, అనంత్ ప్రభు, జానకీదాస్, నాగ్‌పాల్ ఇతర నటీనటులు. రామ్నిక్ వైద్ ఈ చిత్రం దర్శ



విఠల్ ప్రొడక్షన్స్‌వారి "కన్యాదానం" తెలుగుచిత్రంలో
చంద్రకళ, కాంతారావు.

బొంబాయి సినిమా లేఖ

కుడు. పండిట్ గిరీష్ రచయిత. సంగీత దర్శకుడు చిత్రగుప్త.

*　　*　　*

జి. పి. సిప్పీ నిర్మిస్తున్న "మెరైన్ డ్రైవ్" అనే చిత్రంలో బొంబాయిలోని మెరైన్ డ్రైవ్ ప్రాంతానికి బాగా ప్రాముఖ్యం ఉన్నది. ఇందులో బీనా రాయ్, అజిత్ నాయికా నాయకులు. మీనాషోరీ, జానీవాకర్‌లతో జి. పి. సిప్పీ "శ్రీమతి 420" అనే మరొక చిత్రం నిర్మిస్తున్నాడు. ఇది చురుగా షూట్ చేయబడుతోంది.

*　　*　　*

బి. ఎన్. సర్కార్ నిర్మించబోయే "అమరవాణి" అనే చిత్రంలో మీనాకుమారి బుక్ అయినది. దర్శకుడు హేంచందర్.

దర్శక నిర్మాత గ్యాన్ ముఖర్జీ తీస్తున్న "సర్దార్" చాలవరకు అయిపోయింది. దీనిలో అశోక్‌కుమార్, బీనారాయ్ నటిస్తున్నారు. ముఖర్జీ మరొక చిత్రం "స్ట్రేంజ్" కూడా మొదలుపెట్టాడు. దీనిలో అశోక్‌కుమార్, మీనాకుమారి నటిస్తారు. సంగీత దర్శకుడు సి. రామచంద్ర.

*　　*　　*

ఫిల్మిండియా కార్పొరేషన్‌వారి అసాధారణ చిత్రం "సొసైటీ"లో నిమ్మి రివాల్వరు చేతబుచ్చుకుని బెదిరించడం చూడవచ్చు. దర్శకుడు షాహిద్ లతీఫ్. ప్రొడ్యూసరు అతని భార్య ఇస్మత్ చుగ్తాయ్. ఈ చిత్రంలో నసీర్‌ఖాన్, జానీవాకర్, కుంకుం, ఇఫ్తికర్ మున్నగువారు నటిస్తున్నారు. దొంగల ముఠాకు సంబంధించిన ఈ చిత్రం కథ ఇదివరలో ఎక్కడో జరిగిన యథార్థ సంఘటనను పోలిఉన్నది. సాహిర్ లూధియానీవ్ పాటలు వ్రాశాడు. సంగీత దర్శకుడు ఎస్. డి. బర్మన్.

*　　*　　*

బిమల్ రాయ్ చిత్రం "దేవదాసు" షూటింగ్ శీఘ్రగతిని సాగుతున్నది. మోహన్ స్టూడియోలో దిలీప్‌కుమార్, వైజయంతీమాల, మోతీలాల్‌లతో చాల ముఖ్యమైన సన్నివేశాలను ఇటీవల షూట్ చేశారు.

*　　*　　*

అశోక్ స్టూడియోలో షూటింగ్ జరుగుతున్న లైఫ్ ఎండ్ ఆర్ట్స్‌వారి "హంసీ ఖుషీ"లో అభిభట్టాచార్జీ, గీతాబాలి, పమ్మీ, సుందర్ నటిస్తున్నారు. పండిట్ గిరీష్ వ్రాసిన ఒక కథ దీనికి ఆధారం.

*　　*　　*

నవకేతన్ వారి "హవుస్ నం. 44"లో



మహారాష్ట్రతార ఉషాకిరణ్

ఆనంద్‌ను ఒక దొంగగాను తరుము ...దృశ్యాన్ని ఇటీవల ఫూడ్ బందర్ స్టూడియోలో చిత్రీకరించారు. ఈ చిత్రం ...న్ లో విడుదల కాగలదు. కల్పనా కార్తిక్, కె. ఎన్. సింగ్ కూడా ఈ చిత్రంలో ఉన్నారు. ఎమ్. కె. బర్మన్ దర్శకుడు. ఎస్. డి. బర్మన్ సంగీత దర్శకుడు.

ఈ కంపెనీవారే "ఫన్‌టూష్" అనే మరొకచిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. దీన్ని చేతన్ ఆనంద్ డైరక్టుచేస్తాడు.

దర్శకనిర్మాత హేమేన్‌గుప్త నిర్మిస్తున్న "టక్ సాల్" చిత్రానికి కావలసిన కొన్ని ఔట్‌డోర్ దృశ్యాలకుగాను బలరాజ్ సాహ్నీ, నిరూపారాయ్ త్వరలో కలకత్తా నగరం వెడుతున్నారు. ఈ చిత్రంలో ఓం ప్రకాష్ కూడా ఉన్నాడు. ఈ చిత్రం ప్రస్తుత సమాజపరిస్థితులను ప్రతిబింబిస్తుందట.

ఫార్చ్యూన్ ఫిలిమ్స్‌వారి "మన్‌భర్‌కైసన్"లో కిశోర్‌కుమార్, బీనారాయ్ ప్రధాన పాత్రధారులు. హేమ్‌చందర్ డైరక్టు చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం ఎస్. డి. బర్మన్ సమకూరుస్తున్నాడు.

రూప్‌కమల్ చిత్రావారి 'భాగవత్'లో చిత్ర తొలగించబడి ఆమె స్థానంలో మాలా సిన్హా నటిస్తోంది. ఈ చిత్రం మోహన్ స్టూడియోలో షూట్ చేయబడుతోంది. మహీపాల్, సుందర్, హీరాలాల్ మున్నగువారు నటించే ఈ చిత్రానికి దర్శకుడు జస్వంత్ ఝావేరి. నిర్మాత మహీపత్ రాయ్. సంగీత దర్శకుడు అవినాశ్ వ్యాస్.

* * *

దాదాపు అర డజన్ భారతీయ చిత్రాల తాలూకు ఇంగ్లీషు అనువాదచిత్రాలు అమెరికా, బ్రిటన్‌లలో విడుదల అవకాశం దొరకక నిలిచిపోయాయి. "టైగర్ ఎండ్ ది ఫ్లేమ్" (సొహ్రాబ్ మోడీ తీసిన "ఝాన్సీ కీ రాణి"కి ఇంగ్లీషు పేరు), "మహాత్మ" (నిర్మాత దత్తా ధర్మాధికారి), "రాహీ" (అబ్బాస్), "గునా" (కిదార్ శర్మ) మొదలైనవి వీటిలో ఉన్నాయి. ఇవి విడుదల కాకపోవడంచేత కొన్ని లక్షలరూపాయల నష్టం కలుగుతోంది. అందుచేత ఈ విషయమై భారతప్రభుత్వాన్ని శ్రద్ధ వహించాలని కోరడానికి కొందరు నిర్మాతలు ఆలోచిస్తున్నారు. ఇండియా పాకిస్థాన్‌లమధ్య ఫిలింకోటాపద్ధతి ఉన్నట్లుగా పాశ్చాత్య దేశాలకూ భారత దేశానికీ మధ్య కోటాపద్ధతి ఏర్పాటుచేయాలని వారు సూచిస్తున్నారు. ఈసూచనఅమలు జరిగితే మన చిత్రాలకు విదేశాలలో మార్కెట్ పెరుగుతుందన్నమాట నిజమే కాని ఆ దేశాల చిత్రాలతో పోటీలో సరితూగగలవా అని అనుమానం కలుగుతున్నది.



జి. వి. యస్. ప్రొడక్షన్స్‌వారి మొదటిచిత్రంలో బాల్యస్నేహితులు దాసు, మాధవ్‌లుగా అమరనాథ్, ఎన్. టి. రామారావు.

ఇంతకంటే మంచి మార్గం ఒకటేమిటంటే అద్భుత కల్పనలతోను, సంగీతంతోను నిండిన చిత్రాలను తీసి అరబ్బీ దేశాలకు ఎగుమతి చేయడం. మన చిత్రాలకు ఆ దేశాలలో మంచి డిమాండ్ ఉన్నది. ఆమధ్య మెహబూబ్ చిత్రం "ఆన్" కైరో, బీరూట్‌లలో పదిలక్షల రూపాయలు సేకరించింది. కనుక అరేబియన్ భాషలో సబ్ టైటిల్స్ వేసి ఎగుమతి చెయ్యడం లాభసాటే.

* * *

చిత్రనిర్మాణంలో కాలమే ధనం. ఈ సూత్రాన్ని పాటించని నిర్మాతలు ఎప్పటికైనా నష్టపడక తప్పదు. ఐ. ఎమ్. పి. పి. ఎ. వారు ఇటీవల చేసిన పరిశోధనవల్ల స్వాతంత్ర్యసిద్ధి తరువాత బొంబే టాకీస్, ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ ఇంకా దేశంలోని 400 మంది నిర్మాతలు ఆర్థికంగా నాశనమైనారని తేలినది. దీనికి కారణం పై సూత్రాన్ని నిర్లక్ష్యం చెయ్యడమే.

★

షా నాటక చిత్రం

బెర్నార్డ్‌షా నాటకం "ఆర్మ్స్ ఎండ్ మాన్"ను సర్ అలెగ్జాండర్ కోర్డా సినిమా తీస్తాడట. "ది చాకొలెట్ సోల్జర్" అని ఆ చిత్రంపేరు. ఇందులో బ్రిటిష్ నటుడు అలెక్ గిన్నెస్, బాక్సిన్‌చిత్ర



ఇస్మాయిల్ ఫిలిమ్స్‌వారి "జవాబ్" హిందిచిత్రంలో నటించిన గీతాబాలి, నసేర్ ఖాన్

పార్లమెంటు సభ్యుల ఫిర్యాదుకు వాసన్‌గారి జవాబు

సినిమాలు ప్రజలను చెడగొడుతున్నాయని పార్లమెంటు సభ్యులు 64 గురు ఇటీవల కాంగ్రెసు కార్యవర్గానికి ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా విమర్శిస్తూ భారత ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్. ఎస్. వాసన్‌గారొక ప్రకటన చేశారు. సెన్సార్‌షిప్ ఇంకా కఠినంగా ఉండాలనీ, సినిమాలపై ప్రభుత్వం ఇంకా ఎక్కువ అధికారం తీసుకోవాలనీ పార్లమెంటు సభ్యులు సూచించారు. కేంద్ర సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖవారు కూడా ఈ విషయాన్ని గూర్చి కాంగ్రెసు కార్యవర్గానికి ఒక లేఖ పంపించారు. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి పార్లమెంటు సభ్యుల ఫిర్యాదును సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖవారికి అందజేశారు. ఈ తతంగం అంతటినీ విమర్శిస్తూ వాసన్‌గారిలా అన్నారు.


"భారత రాష్ట్రపతిచేత, ప్రధానమంత్రిచేత ప్రశంసింపబడిన సినిమా పరిశ్రమ విమర్శకుల దాడినుండి మాత్రం తప్పించుకోలేకపోతోంది. సినిమా పరిశ్రమ పేరును కళం

పా నాటక చిత్రం

లైమ్‌లైట్‌లో నటించిన క్లేర్ బ్లూంమ్ నటిస్తారు.

* * *

గత సంవత్సరం కానిస్ చలన చిత్రోత్సవంలో ప్రథమ బహుమతి పొందిన జాపనీస్ చిత్రం "గేట్ అఫ్ హెల్" (నరక ద్వారం) అనేది జపానులో ఎవర్నీ ఆకర్షించలేకపోయిందట. అక్కడి విమర్శకులు దాన్ని చెత్తకింద జమకట్టారట.



మ బాబ్ ప్రొడక్షన్స్‌వారి "హసీనా" లో హిందీనటుడు అమరనాథ్


తకిం చేసి, దానిని ప్రభుత్వాధికారంలోకి తీసుకురావాలని వీరు ప్రయత్నిస్తున్నారు. నిజానికి వీరు సినిమా పరిశ్రమపై వేసే నింద యావత్తూ సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖకే తగులుతుంది. అవాంఛనీయ చిత్రాలను ఎందుకు సర్టిఫైచేసి, ప్రదర్శన యోగ్యములని ఎందుకు అనుమతిస్తున్నారో సంజాయిషీ చెప్పుకోవలసిన పూచీ ఆ శాఖ వారిదే. సెన్సార్ల ఆమోదం పొందనిదే ఏ చిత్రమూ విడుదల కావడంలేదు. కనుక సినిమా పరిశ్రమను విమర్శించడానికి ఆస్కారంలేదు.

నేషనల్ ఫిల్మ్‌బోర్డును స్థాపించడానికి సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖవారు తలపెట్టిన తరువాత, వారి సంకల్పానికి రాజ్యాంగరీత్యా కొన్ని అవరోధాలు వచ్చాయి. ఆ బోర్డును స్థాపించాలంటే రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం కనిపించింది. అలా మార్చడానికి కావలసిన ప్రజాభిప్రాయ బలాన్ని సమకూర్చుకోడానికే ఇప్పుడిలా సినిమా పరిశ్రమపై లేనిపోని అభాండాలు వేయడం జరుగుతోంది.

సెన్సార్‌షిప్ కూడదని పరిశ్రమలో ఎవరూ భావించడంలేదు. కాని సెన్సార్‌షిప్‌కు హద్దూ పద్దూ ఉండాలని మాత్రమే పరిశ్రమవారు కోరుతున్నారు. సెన్సార్‌షిప్‌ను ఎక్కువ కఠినం చేయడంలో అర్థం లేదు. సెన్సార్‌షిప్ ఒక దారి డొంక లేకుండా ఉంటున్నదనే భయంవల్లనే మన చిత్రాలు పురోగమించలేక పోతున్నాయి. సమకాలిక కథా వస్తువులను తీసుకొని కొత్త పద్ధతులలో చిత్రాలు తీయడానికి నిర్మాతలు జంకుతున్నారు. సెన్సార్ల అభ్యంతరం ఉంటుందని వారు భయపడుతున్నారు. అందుచేతనే నిర్మాతలు స్టంట్లు, జానపదాలు, పౌరాణికాలు తీస్తూ పరిశ్రమ పురోభివృద్ధికి తోడ్పడలేకపోతున్నారు. బాధ్యతగల నాయకులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలి. పరిశ్రమ బాగుపడాలనే వారెవరూ సెన్సార్‌షిప్ ఇంకా కఠినంగానూ, హేతురహితంగానూ ఉండాలని ఒత్తిడి చేయరాదు. చలనచిత్ర గోష్ఠిని ప్రారంభిస్తూ, ఫిలిం సెన్సార్‌షిప్ యొక్క పరిమితిని గూర్చి తన అభిప్రాయాలను ప్రధాని నెహ్రూ వెల్లడించారు. భావ స్వాతంత్ర్యం పేరుతో సినిమాలు యుద్ధ ప్రచారం చేయడానికి వీలులేదన్నారు. కాని నీతి పేరుతో సినిమావంటి సృజనాత్మక కళలలో సంకుచిత బుద్ధితో కలగజేసుకోడానికి కూడా ఆయన వ్యతిరేకించారు. ప్రజలను నైతికంగా శాసించి దండించే పని ప్రభుత్వం పెట్టుకోవడం ప్రమాదమని ఆయన అన్నారు. దూరదృష్టిగల నెహ్రూ వంటి రాజకీయవేత్త చెప్పిన పై మాటలను ఫిలిం విమర్శకులు గ్రహిస్తారని ఆశిస్తున్నాను. సినిమాలు ప్రజలను చెడగొడుతున్నాయనే విమర్శకుల వృథా ఆక్రోశాన్ని పార్లమెంటు సభ్యులు, కాంగ్రెసు కార్యవర్గమూ ఏ మాత్రమూ పట్టించుకోక, వినోద పరిశ్రమను ఈ అభివృద్ధి నిరోధకుల నుండి రక్షించాలి." ★



ఎస్. ఫతేలాల్ నిర్మిస్తున్న "జగద్గురు శంకరాచార్య"లో రాజకుమార్, పాండే.



పారమౌంట్ చిత్రం "రియర్ విండో"లో జారెన్ డి అర్బీ

★ ప్రేక్షకుల అభిప్రాయాలు ★

"అనార్కలి"

చిత్రం మొదటినుంచి మంచి బిగిలో పోయింది. నాగేశ్వరరావు తన నటనా కౌశలమంతా అభివ్యక్తములో వెల్లడించినాడు. అంజలీదేవి చాలా బాగుగా నటించినది. రంగారావు అక్బరుపాత్ర అనుకున్నంత బాగుగా నటించలేకపోయినాడు. మ్యూజిక్ సామాన్యంగా వుంది. కాని హిందీ ట్యూన్సు అనుకరణ తృప్తికరంగా చెయ్యలేక పాడుచేసినారు. మొత్తంమీద అందరూ చూచి ఆనందించదగ్గ చిత్రం.

జి. రామానుజరావు,
—అమలాపురం.

* * *

పాటలు బాగున్నవి. అనార్కలిగా అంజలీదేవి నటన బాగున్నది. సలీముగా నాగేశ్వరరావు రాణించలేదు. మిగిలిన పాత్రలన్నీ బాగానే రాణించినవి. దర్శకత్వంలో కొన్ని లోపాలున్నవి. ఉదాహరణకి, అనార్కలి, సలీములు కలుసుకొనకుండా మాన్‌సింగ్ అంతఃపురానికి కావలి పెట్టించినపుడు అనార్కలి విచారముతో పాట పాడుతుంది. అప్పుడు ఆకాశములో నిండుచంద్రుడు కనిపిస్తాడు. అదే సమయానికి సలీము అనార్కలిని కలుసుకోలేక తోటలో తిరుగుతున్నపుడు తరిగిపోయిన చంద్రుడు కనిపిస్తాడు.

ఎమ్. కుసుమ—బందరు.

* * *

చిత్రం చూస్తున్నంతసేపు చాల ఉత్సాహంగా వుంది. సలీంగా నాగేశ్వరరావు, అక్బరుగా రంగారావు చిత్రానికి ప్రాణం పోసేరు. పాటలు మాటలు రాయడంలో సముద్రాలవారి కలం చిందులు త్రొక్కింది. ఆదినారాయణరావు మ్యూజిక్ చాల బాగుంది. ఘంటసాల, జిక్కి పాడిన పాటలు చాల బాగున్నాయి. సెట్టింగులు చాల బాగున్నాయి.

రావుజీ—కాకినాడ.

"రోజులు మారాయి"

తాపీ చాణక్యగారి దర్శకత్వం అత్యద్భుతంగా వున్నది. పాటలు, మాటలు బాగున్నాయి. నాగేశ్వరరావు, జానకి వారి పాత్రలను చక్కగా పోషించుకొని వచ్చేరు. కలంగికియిచ్చిన "పోలయ్య" పాత్రలో హెచ్చుగా హాస్యం లేకపోయినా వున్నంతమట్టుకు బాగా నటించేరు. రమణారెడ్డి అద్భుతంగా కరణమే అన్నట్టున్నాడు. క్రొత్తతార వహీదా రెహమాన్ నాట్యం ప్రేక్షకుల కళ్ళను మిరుమిట్లు గొలిపింది.

కె. వి. ఎన్. ఆచార్య,
—విజయవాడ.


* * *

తాపీ చాణక్య తన ఆశయాలను చాల చక్కగా వ్యక్తంచేశారు. అందుచేత చిత్రం బావుంది. కథలో మనకు ఒకటి, రెండు పాత్రలు తప్ప మిగిలినవన్నీ సజీవంగానే కనపడుతాయి. వేణుగా నాగేశ్వరరావు చాల గంభీరంగా, సహజంగా నటించాడు. రాధగా జానకి కూడా బాగానే నటించింది. అమ్మాజీ పాత్ర చిన్నదైనా బాగానే నటించింది. అసలు భారతి పాత్రచుట్టూ కథ తిరుగుతుంది. ఆమె పెళ్లిసమస్య లేకపోతే ఈ కథ యింతదూరం నడవలేదు. అసలు చిత్రానికి కూతురు పెళ్ళి అని పేరు పెట్టినట్లయితే బావుండేది. "రోజులు మారాయి" అనే పేరు సరిగా అతకలేదు. అతికించటానికి ప్రతివారిచేత రోజులు మారాయిరా అనిపిస్తారు. కోటయ్యగా పెరుమాళ్ళు భావయుక్తంగా నటించాడు. రచన రసవత్తరంగా వుంది. పాటలు ఒకటిరెండు తగ్గించినట్లయితే బావుండేది. వహీదారెహమాన్ చేసిన ఏరువాక నృత్యం బావుంది కాని పాటలో కొన్నిమాటలు అసందర్భంగా వున్నాయ్.

టి. విమల్ కుమార్,
—తెనాలి.

★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St Madras



కొబ్బరాకుల చందం

—ఫోటో: జి. సత్యనారాయణ, గొల్లప్రోలు.

ఈ ప్రసిద్ధిగాంచిన క్రీములు మీ చర్మమునకు సరిగా అనువైనవి

మీ పరిసరాల శీతోష్ణస్థితికి తగినవి :

అద్భుతమైన యీ రెండు పాండ్స్ సౌందర్య సాధనం వాడండి. అవి మీ చర్మమునకు సరిగా అనువైనవి. ఈ రెండూ శీతోష్ణస్థితుల బాధల నుండి మీ ముఖమునకు రక్షణ నిచ్చి, మీ చర్మమును నిర్మలముగ మరియు మృదువుగ ఉంచును.


శీతకాలంలో శీతోష్ణస్థితి మీ ముఖ కాంతిని పాడుచేయు నపుడు — పాండ్స్ కోల్డ్ క్రీమ్ మీకు అవసరము. దానిలో నున్న విశేష నూనెలు చర్మమునకు ఉపశమనము నిచ్చి తీక్షణమైన ఎండ, వడగాడ్పులతో అది వాడిపోకుండా కాపాడును.

మీ చర్మము సహజముగ జిడ్డుగాయుంటే లేక వేడి చెమ్మగల గాలిలో జిడ్డుగా అవుతూ ఉంటే — పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడండి. ఎంతో తేలికగా మరియు మంచివాసనున్న ఈ క్రీమ్ రోమరంధ్రాలను అద్దిన జిగటను, నిర్జీవమైన రక్త కణములను అద్దము తీసి, మీ ముఖమునకు సౌమ్య రక్షణ నిచ్చును.

పాండ్స్ క్రీమను ప్రతిదినము తప్పక వాడండి. కొన్ని రోజులలో మీ చర్మము ఎంతో మనోహరముగ, నవనవలాడేలా ఉండుట మీరు చూడగలరు — అనుభవించగలరు కూడా!



ప్రపంచములో సౌందర్యరాణులు వాడే క్రీములు



పాండ్స్

కోల్డ్ క్రీమ్

వ్యానిషింగ్ క్రీమ్

P.[illegible]